ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 06.04.2025 | సంపుటి : 11 సంచిక : 257 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## బాబూ జగ్జీవన్ రామ్‌కు సీఎం రేవంత్ ఘన నివాళి



2లో

# ఆర్టిఫిషియల్ వీడియోలపై సీఎం ఆగ్రహం



## సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఫేక్ కంటెంట్ విస్తృత ప్రచారంపై కోర్టును ఆశ్రయించండి

- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):** వివాదాస్పదమైన హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల కేసులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై అధికారులను ఆదేశించారు.చెట్లను నరికివేయడంతో అక్కడి వన్యప్రాణులు చెల్లాచెదురయ్యాయంటూ కొందరు ఏఐ వీడియోలు సృష్టించడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు. దీనిపై విచారణకు ఆదేశించేలా కోర్టును కోరాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో 25ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారని, ఎన్నడూ వన్యప్రాణులు, పర్యావరణానికి సంబంధించిన వివాదాలు రాలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏఐ ఫేక్ వీడియోలతో గందరగోళం సృష్టించారని వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. ఏఐ ఫేక్ కంటెంట్‌ను పసిగట్టే ఫోరెన్సిక్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌టూల్స్‌ను సమకూర్చుకోవాలన్నారు. కంచె గచ్చిబౌలి లోని సర్వే నెంబర్ 25లో ఉన్న భూముల్లో గత 25 ఏండ్లుగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. ఐఎస్ బీ తో

- కంచ గచ్చిబౌలి భూముల్లో గత 25 ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు
- ఎన్నడూ వన్యప్రాణులు, పర్యావరణానికి సంబంధించిన అంశాలు రాలేదు
- ఇప్పుడే వివాదాలు చెలరేగడానికి గల కారణాలను సీఎంకు వివరించిన అధికారులు

పాటు గచ్చిబౌలి స్టేడియం, ఐఐఐటీ, ప్రైవేటు బిల్డింగ్ లు, రెసిడెన్షియల్ అపార్టుమెంట్లు, హైదరాబాద్ యూనివర్సిటీ బిల్డింగ్ లను నిర్మించారు. వాటిని నిర్మించేటప్పుడు ఎలాంటి వివాదాలు, ఆందోళనలు జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకు వచ్చారు. అప్పుడు వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ విధ్వంసం లాంటి వివాదాలు కూడా లేవన్నారు. మిగతా 2లో..

## ట్రంప్ సుంకాల పెంపుతో మనకు మేలే..

### ఈ పరిణామాన్ని అనుకూలంగా మార్చుకుని రాష్ట్రానికి ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు

- పరిశ్రమల రంగానికి తెలంగాణ పెద్దపీట
- రైతులను వ్యాపారవేత్తలుగా మారుస్తాం
- గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం సదస్సులో మంత్రి వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అనుకూలతలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇండియా, లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రతినిధుల సదస్సులో పార్క్ హయత్ లో పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. వీరితో పాటు శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. ప్రభుత్వం తరపున పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని ఈ సందర్భంగా మిగతా 2లో..

## 'పాలమూరు-రంగారెడ్డి'ని త్వరగా పూర్తి చేయండి

### మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్(జనంసాక్షి):** పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మొదటి దశను డిసెంబరు లోపలే పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. నార్లాపూర్, ఏదుల జలాశయాల మధ్య రెండో ప్యాకేజీని త్వరగా పూర్తి చేస్తామని ఉత్తమ్ తెలిపారు. కాలువల పనులను తక్షణమే చేపట్టి అక్టోబర్ మిగతా 2లో..

## హెచ్‌సీయూ వ్యవహారంలో ప్రభుత్వం వైఖరి సరికాదు

విద్యార్థులు, వారికి అండగా నిలిచిన పార్టీలకు అభినందనలు : కేసీఆర్

వార్త 2లో

## హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, సమాచార కమిషన్‌ల ఎంపిక

- నియామకంపై సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కీలక భేటీ
- సమావేశానికి విపక్ష నేత కేసీఆర్ డుమ్మా

వార్త 2లో

## 2034 తర్వాతే 'జమిలి'

### వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి ఈ విధానం సాధ్యం కాదు



- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ క్లారిటీ
- 2024 పార్లమెంటు ఎన్నికల్లో రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు
- జమిలి ఎన్నికలతో ఈ భారీ వ్యయం ఆదా అవుతుందని వెల్లడి

**చెన్నై(జనంసాక్షి):** జమిలి ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న ఓ ప్రచారాన్ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల సమయంలో వీటిని అమలు చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. చెన్నైలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. మిగతా 2లో..

# ఆయుధాలు వీడండి

### మావోయిస్టులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు
### 50 ఏళ్లుగా బస్తర్ అభివృద్ధికి దూరమైందని వెల్లడి



**బస్తర్(జనంసాక్షి):** మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో పర్యటిస్తున్న ఆయన.. రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన బస్తర్ పణ్ దూమ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తర్ గిరిజనుల అభివృద్ధిని మావోలు ఆపలేరన్నారు. మార్చి 2026 నాటికి నక్సల్ సమస్య అంతమవుతుందని అమిత్ షా ఉద్ఘాటించారు. "బస్తర్‌లో బుల్లెట్ కాల్పులు, బాంబు పేలుళ్ల రోజులు ముగిశాయి. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టు సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నా. మీరు కూడా మాలో భాగమే. ఏ మావోయిస్టు చనిపోయినా ఎవరిలోనూ సంతోషం లేదు. ఆయుధాలు అడ్డం పెట్టుకొని స్థానిక గిరిజనుల అభివృద్ధిని ఆపలేరు" అని అమిత్ షా పేర్కొన్నారు. లొంగిపోయి అభివృద్ధిలో భాగమైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి రక్షణ ఉంటుందన్నారు. గతేడాది మొత్తంగా 881 మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 521 మంది లొంగిపోయినట్లు చెప్పారు. 50 ఏళ్లుగా బస్తర్ అభివృద్ధికి దూరమైందన్న మిగతా 2లో..

## 86 మంది మావోయిస్టుల లొంగుబాటు

- తెలంగాణ ప్రభుత్వ 'ఆపరేషన్ చేయూత'లో భాగంగా జనజీవనస్రవంతిలో కలిశారు
- కొత్తగూడెం మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి



**కొత్తగూడెం(జనంసాక్షి):** పెద్ద సంఖ్యలో మావోయిస్టు లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. భద్రాద్రి మిగతా 2లో..

## కెనడాలో భారతీయుడి దారుణ హత్య

**ఒట్టావా(జనంసాక్షి):** కెనడాలో ఇటీవల హిందూ ఆలయాలు, భారతీయులపై దాడులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ భారతీయుడిని దుండగుడు కత్తితో పొడిచి హత్య చేశాడు. కెనడాలోని భారత ఎంబసీ పోస్ట్‌తో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. "ఒట్టావా సమీపంలోని రాక్‌లాండ్ ప్రాంతంలో ఓ భారతీయుడు కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటన విచారకరం. ఈ ఘటనలో అనుమానితుడిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విచారకర పరిస్థితుల్లో మిగతా 2లో..





## కుటుంబాన్ని చిదిమేసిన రోడ్డుప్రమాదం

- ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టిన వ్యాన్
- ఐదుగురు మృతి.. పలువురికి గాయాలు
- కర్ణాటకలో చోటు చేసుకున్న దుర్ఘటన

వార్త 2లో



## వక్ఫ్ తరువాత మోదీ టార్గెట్ క్రైస్తవులే..

### కాథలిక్ చర్చీల ఆస్తిపై ఆర్‌ఎస్‌ఎస్ కన్ను
### సమిష్టిగా ఎదుర్కోవాల్సిందే : రాహుల్

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 5(జనంసాక్షి):** వక్ఫ్ బిల్లు తరవాత ఇప్పుడుప్రభుత్వం దృష్టి క్రిష్టియన్ మైనార్టీలపై పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్రైస్తవ మతమే ఆర్‌ఎస్‌ఎస్ తదుపరి టార్గెట్ అని అన్నారు. కాథలిక్ చర్చిలు దేశంలోనే అత్యధిక భూములు కలిగి ఉన్నాయని ఆర్‌ఎస్‌ఎస్ మౌత్‌పీస్ వెల్లడించిందని అన్నారు. వక్ఫ్ బిల్లుతో ముస్లింలపై దాడి జరుగుతుందని చెప్పాను. ఇప్పుడది భవిష్యత్తులో ఇతర మతాలను టార్గెట్ చేయడానికి మార్గం సుగమం చేస్తోంది. క్రిష్టియన్లను ఆర్‌ఎస్‌ఎస్ టార్గెట్ చేయడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు. అలాంటి దాడుల నుంచి మన ప్రజలను కాపాడుకోవాలంటే రాజ్యాంగం ఒక్కటే మార్గం. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మనందరి సమష్టి బాధ్యతని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు-2025ని పార్లమెంట్ ఆమోదించింది. అయితే, ఆమోదం పొందినప్పటికీ దీనిపై రచ్చ ఆగడం లేదు. కాంగ్రెస్, ఇతర ఇండీ కూటమి పార్టీల నేతలు వక్ఫ్ బిల్లును ఛాలెం జ్ చేస్తూ సుప్రీంకోర్టుని ఆశ్రయించా రు. ఈ వివాదాల నేపథ్యంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశా రు. వక్ఫ్ తర్వాత ఆర్‌ఎస్ఎస్ కాథలిక్ చర్చిలను, క్రైస్తవ సమాజాన్ని టార్గెట్ చేయ బోతోందని హెచ్చరించారు. ఆర్‌ఎస్‌ఎస్ వెబ్‌సైట్ వ్యాసంలో భారతదేశంలో కాథలిక్ సంస్థలకు 7 కోట్ల హెక్టార్ల భూమి ఉందని, అవి అతిపెద్ద ప్రభుత్వేతర భూ యజమానులుగా ఉన్నాయని పేర్కొందని రాహుల్ గాం ధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వక్ఫ్ బిల్లు ఇప్పుడు ముస్లింలపై దాడి చేస్తుందని నేను చెప్పాను. కానీ భవిష్యత్తులో ఇతర వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఇది ఒక ఉదాహరణ. కాథలిక్ సంస్థల కింద ఉన్న భూమిలో ఎక్కువ భాగాన్ని బ్రిటిష్ పాలనలో మిగతా 2లో..

## వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఆప్ ఎమ్మెల్యే పిటిషన్

వార్త 2లో



## మోదీకి మిత్ర విభూషణ్

### ప్రధానికి శ్రీలంక అత్యున్నత పురస్కారం
### ఇచ్చి సత్కరించిన ఆ దేశ అధ్యక్షుడు అనురకుమార డిసనాయక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** శ్రీలంక అత్యున్నత పురస్కారం మిత్ర విభూషణ్‌ను ప్రధాని మోదీ అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు అనుర కుమార డిసనాయక.. ఆ అవార్డుతో శనివారం మోదీని సన్మానించారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కీలక పాత్ర పోషించినట్లు శ్రీలంక అధ్యక్షుడు తెలిపారు. శ్రీలంకలో అత్యున్నత పౌర పురస్కారం అయిన మిత్ర విభూషణ్ అవార్డును 2008లో ప్రారంభించారు. ఆ నాటి అధ్యక్షుడు మహింద రాజపక్స మిగతా 2లో..





## ట్రంప్ చర్యలతో ఈ ఏడాదిలోనే అమెరికాలో మాంద్యం

### యూఎస్‌లో ఉద్యోగాలుండవ్: జేపీ మోర్గాన్

**న్యూయార్క్(జనంసాక్షి):** ట్రంప్ చర్యలతో ఈ ఏడాదిలోనే అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రముఖ బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జేపీ మోర్గాన్ అంచనా వేసింది. ఇంతకుముందు 40 శాతం ఉన్న ఈ అవకాశం ఇప్పుడు 60 శాతానికి పెరిగినట్లు పేర్కొంది. అంతేకాకుండా దేశ స్థూల దేశీయోత్పత్తిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ప్రపంచ దేశాలపై యూఎస్ మిగతా 2లో..

వార్త 2లో

## సుంకాలతో అమెరికాకు మేలు జరగదు : ఒబామా

# లైట్ తీసుకోండి

### అగ్రరాజ్య మార్కెట్ల పతనంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
### అమెరికా సుసంపన్నం కావడానికి ఇదే సరైన సమయం
### మరోసారి తన చర్యలను సమర్థించుకున్న అధ్యక్షుడు



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా పలు మార్కెట్లు కుదేలయ్యాయి. అగ్రరాజ్య మార్కెట్లు కూడా భారీగా పతనమయ్యాయి. మరోవైపు ఈ ఆర్థిక అనిశ్చితులతో మాంద్యం తప్పదనే భయాలూ వెంటాడుతున్నాయి. ఈ పరిణామాలపై అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌లపై తన నిర్ణయాన్ని మరోసారి సమర్థించుకున్న ఆయన.. అమెరికా సుసంపన్నం కావడానికి ఇదే సరైన సమయమని వ్యాఖ్యానించారు. మార్కెట్ల పతనంపై ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టారు. "అమెరికాలోకి చాలామంది ఇన్వెస్టర్లు వస్తున్నారు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. దీనిపై నా విధానాల్లో ఎలాంటి మార్పు ఉండబోదు. మునుపెన్నడూ లేనివిధంగా ధనవంతులు కావడానికి ఇదే గొప్ప మిగతా 2లో..



## సుంకాలపై భారత్‌తో సంప్రదింపులు!

### స్వయంగా చర్చలు జరుపుతున్న ట్రంప్
### ఈమేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడి
### టారీఫ్ వార్ నేపథ్యంలో కీలక పరిణామం

**న్యూయార్క్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంచనాలకు మించి ప్రపంచవ్యాప్తంగా భారత్ సహా పలు దేశాలపై సుంకాల మోత మోగించి వాణిజ్య యుద్ధానికి తెర లేపారు మిగతా 12లో..

వార్త 2లో

## విద్యార్థి వీసాల్లో భారీగా కత్తెర

సగానికి పైగా ఆంధ్రా,తెలంగాణ నుంచే !

## జెలెన్‌స్కీ సొంత నగరం కీవ్‌పై బాంబుల వర్షం

### 18 మంది మృతి.. 60 మందికిపైగా గాయాలు

**కీవ్(జనంసాక్షి):** కీవ్‌పై రష్యా మరోసారి దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రైవీ రిపై శుక్రవారం మాస్కో క్షిపణి ప్రయోగించిందని కీవ్ అధికారులు పేర్కొన్నారు.పిల్లల ఆటస్థలం సమీపంలో ఈ దాడులు జరగడంతో తొమ్మిది మంది చిన్నారులు సహా మొత్తం 18 మంది మరణించారని..60 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు. ఐదు అపార్ట్‌మెంట్ భవనాలు దెబ్బతిన్నాయన్నారు. మిగతా 2లో..



## ఇకనైనా రష్యాపై అమెరికా ఒత్తిడి తేవాలి

### జెలెన్‌స్కీ డిమాండ్

**కీవ్(జనంసాక్షి):** ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా రష్యా సైన్యం దాడిలో మరో 16 మంది చనిపోయినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
06.04.2025

## ‘పాలమూరు-రంగారెడ్డి’ని త్వరగా పూర్తి చేయండి

వరకు పూర్తి చేస్తామన్నారు.“నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెణ జలాశయాల పనులన్నీ పూర్తి చేస్తాం. డిసెంబర్ వరకు పనులు పూర్తి చేసి 50 టీఎంసీలు నిల్వ చేస్తాం. సబ్ స్టేషన్ల పనుల కోసం ట్రాన్స్‌కోకు రూ.262 కోట్లు విడుదల చేశాం. జులై నెలలో పంపుల డ్రై రన్ చేపడతాం. జూరాల ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించాం” అని ఉత్తమ్ తెలిపారు.

## ఆయుధాలు వీడండి..

అమిత్ షా.. వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే నిశ్చయంతో ప్రధాని మోదీ ఉన్నారని చెప్పారు. అయితే, స్థానికులు వైద్య, విద్య సదుపాయాలతోపాటు ఆధార్, రేషన్ కార్డులు, ఆరోగ్య బీమా పొందినప్పుడే ఇది సాధ్యమవుతుందన్న ఆయన.. నక్సల్స్ సమస్య తొలగిపోతేనే బస్తర్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక మావోయిస్టురహిత గ్రామాల్లో రూ.కోటి విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ హామీ ఇచ్చారు.

## 86 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం పోలీసుల ఎదుట 86 మంది మావో యిస్టులు లొంగిపోయారు. పోలీసు బెటాలియన్ కార్యాలయంలో కొత్తగూడెం మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో వీరంతా లొంగిపోయారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారని తెలిపారు. వీరిలో 66 మంంది పురుషులు, 20 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న ‘ఆపరేషన్ చేయూత’ కార్యక్రమంలో భాగంగా వీరంతా లొంగిపోయినట్లు ఐజీ పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయం కింద రూ. 25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. మావోయిస్టు జీవితాలకు ముగింపు పలుకుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అడవి ప్రాంతాల నుంచి ఒక్కసారిగా 86 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ‘ఆపరేషన్ చేయూత’ పేరిట మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్?క్వార్టర్?లో లొంగిపోయారు. నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు భారీ సంఖ్యలో సరెండర్లు జరిగాయని ఐజీ తెలిపారు.లొంగిపోయిన వారిలో 20 మంది మహిళా మావోయిస్టులు, 66 మంది పురుషులు ఉన్నారు. గత నాలుగు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 66 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, తాజాగా 86 మంది లొంగిపోయారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకంగా 25 వేల రూపాయల చెక్కును ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు.కాలం చెల్లిన సిద్ధాంతాలను వదిలి జనజీవన స్రవంతిలో కలవాలనే పిలుపునకు తోడు, మావోయిస్టు అగ్ర నాయకుల వేధింపులు,తట్టుకోలేక లొంగిపోయినట్లు ఐజీ పి.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో ఏసీఎం నుంచి 4, పార్టీ నుంచి 4, మిగతా వారు రకరకాల సంఘాల మిలీషియా సభ్యులు ఉన్నారని తెలిపారు.కొత్తగూడెం జిల్లాకు చెందిన వారు 81 మంది కాగా ములుగు జిల్లాకు చెందిన వారు ఐదుగురు ఉన్నట్లు వెల్లడించారు. ఏసీఎం సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, పార్టీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. లక్ష, మిగతా సభ్యులకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పునరావాసంతో పాటు అన్ని ప్రోత్సాహకాలు అందేలా చూస్తామని వెల్లడించారు. మావోయిస్టుల లొంగుబాటులో కీలక పాత్ర పోషించిన కొత్తగూడెం, సీఆర్‌పీఎఫ్ పోలీసుల చొరవ అమోఘం అని తెలిపారు.మొత్తం 86 మావోయిస్టులు మంది లొంగిపోవడం జరిగింది. సిద్ధాంతాలను వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసినందుకు పోలీసు శాఖ తరఫున వారిని ఆహ్వానిస్తున్నాం. వారు మా పోలీసు శాఖ మీద నమ్మకంతో ఇక్కడికి రావడం జరిగింది. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన నగదును అందించడం జరిగింది. ఇంకా రావాల్సిన వారు కూడా హింసను వీడి వస్తే వారికి తప్పకుండా చేయూత అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు వెళతామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో ఇంకా 95 మంది వివిధ క్యాడర్‌లకు చెందిన మావోయిస్టులు ఉన్నారని చెప్పారు.

## కుటుంబాన్ని చిదిమేసిన రోడ్డుప్రమాదం

**బెంగళూరు(జనంసాక్షి):**
కర్ణాటక రాష్ట్రం కలబురగి జిల్లాలో ఆగి ఉన్న ట్రక్కును ఓ వ్యాను బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గాయాలపాలయ్యారు. కలబురగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో జిల్లాలోని నెలోగి క్రాస్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 10 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న కలబురగి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కలబురగి ఆసుపత్రికి తరలించారు. మృతులను బాగల్‌కోట్ జిల్లా వాసులుగా గుర్తించారు. ఈ ఘటనపై నెలోగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు కలబురగి పోలీసులు తెలిపారు.

## హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, సమాచార కమిషన్‌ల ఎంపిక

**హైదరాబాద్(జనంసాక్షి):**
హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, సమాచార కమిషన్ సెలెక్షన్ కమిటీ శనివారం సమావేశమైంది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో కమి షన్ల నియామకంపై చర్చించారు. ప్రతిపక్షనేతగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం సమావేశానికి డుమ్మాకొట్టారు. చర్చించి ప్రతిపాదించిన పేర్లను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు తెలంగాణ ప్రభుత్వం పంపనుంది. ఇక ప్రధాన సమాచార కమిషనర్ రేసులో సీఎస్ శాంతి కుమారి ఉన్నట్లు తెలుస్తోంది. అందుకోసం సీఎస్‌గా శాంతి కుమారి రాజీనామా చేస్తారని సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, సమాచార కమిషన్‌లు అత్యంత కీలకమైన కమిషన్‌లు. హెచ్‌ఆర్‌సీలో చైర్మన్, ముగ్గురు కమిషన్ సభ్యుల స్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. అలాగే సమాచార కమిషన్‌కు సంబంధించి కమిషన్ చైర్మన్, ఐదుగురు కమిషనర్‌ల స్థానాలు కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. దాంతో పాటు లోకాయుక్త, ఉపలోకాయుక్త కూడా ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటి భర్తీపై తెలంగాణ రాష్ట్ర సర్కార్ దృష్టి సారించింది. ఆ మూడు కమిషన్‌ల భర్తీ కోసం కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగా శనివారం సెలెక్షన్ కమిటీ సమావేశాన్ని సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించారు. ఈ మూడింటికి సెలక్షన్ కమిటీలో ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉండటంతో పాటు- పలువురు సభ్యులు ఉంటారు. ఈ మూడు కమిటీ-లో ముఖ్యమంత్రితో పాటు ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సభ్యులుగా ఉంటారు. ఈ సెలక్షన్ కమిటీ- సమావేశానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రావాల్సిందిగా ఆహ్వానం పంపారు. కానీ సెలక్షన్ కమిటీ-లో సభ్యులుగా ఉన్న ప్రధాన ప్రతిపక్ష నేత ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు. అయినప్పటికీ ఈ సమావేశం కొనసాగుతోంది. ఇప్పటికే రెండు సెలక్షన్ కమిటీ- సమావేశాలు ముగిశాయి. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తకు సంబంధించిన సెలక్షన్ కమిటీ- సమావేశం ముగిసింది.

## ఆర్టిఫిషియల్ వీడియోలపై సీఎం రేవంత్ ఆగ్రహం



అలాంటప్పుడు అదే సర్వే నెంబర్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేసేటప్పుడు ఎందుకు వివాదాస్పదమైందని సమావేశంలో చర్చ జరిగింది. అర్టి ఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లుగా వీడియోలు, ఫొటోలు సృష్టించి కొందరు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయటంతో ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాస్తవాలు వెల్లడించే లోగా అబద్ధాలు సోషల్ మీడియాలో జాతీయ స్థాయిలో వైరల్ కావటం ప్రభుత్వానికి సవాలుగా మారిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏకంగా నెమళ్లు ఏడ్చినట్లుగా ఆడియోలు, బుల్లోజర్లకు జింకలు గాయపడి పరుగులు తీస్తున్నట్లుగా ఫేక్ ఫొటోలు, వీడియోలు తయారు చేశారని పోలీసు అధికారులు సీఎంకు వివరించారు. వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు కూడా వాటినే నిజమని నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు పెట్టడంతో అబద్ధాలకు ఆజ్యం పోసినట్లయిందని అన్నారు. ఏకంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యూయెన్సర్ ధ్రువ్ రాఠీ, సినీ ప్రముఖులు జాన్ అబ్రహం, దియా మీర్జా, రవీనా టండన్ లాంటి వాళ్లందరూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ ఫొటోలు, వీడియోల పోస్టు చేసి సమాజానికి తప్పుడు సందేశం చేరవేశారని సమావేశంలో చర్చ జరిగింది. ఈ భూములపై మొట్ట మొదటగా ఫేక్ వీడియో పోస్ట్ చేసిన జర్నలిస్ట్ సుమిత్ జా కొద్ది సేపట్లోనే తన పోస్టును తొలిగించి క్షమాపణలు చెప్పారని, కానీ మిగతా ప్రముఖులెవరూ ఈ నిజాన్ని గుర్తించకుండా అదే ఫేక్ వీడియో ప్రచారం చేశారని అధికారులు అభిప్రాయపడ్డారు. కంచె గచ్చిబౌలిలో ఏఐ సృష్టించిన వివాదం ప్రజాస్వామ్య వ్యవస్థలకే పెను సవాలు విసిరిందని ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇదే తీరుగా ఇండో పాక్, ఇండో చైనా సరిహద్దుల్లాంటి వివాదాలు, ఘర్షణలకు దారితీసే సున్నితమైన అంశాల్లో ఏఐతో ఫేక్ కంటెంట్ సృష్టిస్తే భవిష్యత్తుల్లో యుద్ధాలు జరిగే ప్రమాదముంటుందని చర్చ జరిగింది. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా తయారు చేసే ఫేక్ వీడియోలు, ఫొటోలు కరోనా వైరస్ ను మించిన మహమ్మారిలాంటివని ఈ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఏఐ ఫేక్ కంటెంట్ తయారీపై విచారణకు ఆదేశించేలా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.డిప్యూటీ సీఎం భట్టి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, టీజీఐఐసీ ఎండీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ట్రంప్ సుంకాల పెంపుతో మనకు మేలే..

మంత్రి అన్నారు. వివిధ దేశాల ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధిస్తోందని చెప్పారు. పలు దేశాల పారిశ్రామికవేత్తలు భారత్ వైపు చూస్తున్నారని, పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. తెలంగాణ ఎంఎస్ఎంఈలు ప్రపంచస్థాయిలో సత్తా చాటేలా ప్రత్యేక పాలసీ ఉందని పేర్కొన్నారు. జహీరాబాద్ నిమ్జ్ లో పెట్టుబడులకు 6 అంతర్జాతీయ కంపెనీలు ముందుకొచ్చాయని, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోత్సహించి రైతులను వ్యాపారవేత్తలుగా మార్చుతామని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటు-కు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల అధికార ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు-కున్న అనుకూలతలు, ప్రభుత్వం తరఫున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు. వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఒక రకంగా మనకు మేలే చేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టు-బడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపే చూస్తున్నారన్నారు. ఈ పరిణామాన్ని అనుకూలంగా మార్చుకుని ఎక్కువ పెట్టు-బడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణలో పెట్టు-బడులు పెట్టేం దుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటా మన్నారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు 6 అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకొచ్చాయని, వీటిలో మూడు కొరియా కంపెనీలున్నాయని చెప్పా రు. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు- చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నట్లు- తెలిపారు. ఆగ్రో ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించి అన్నదాతలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దుతామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్‌కు సీఎం రేవంత్ ఘన నివాళి

**హైదరాబాద్ (జనంసాక్షి):** మాజీ ఉప ప్రధాన మంత్రి డా.బాబూ జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని సిఎం రేవంత్ తదితరులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. బషీర్ బాగ్ లోని ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు వి .హనుమంతరావు, అంజన్ కుమార్ యాదవ్‌లు కూడా నివాళి అర్పించారు.



## వక్ఫ్ తరువాత మోదీ టార్గెట్ క్రైస్తవులే..

1927 ఇండియన్ చర్చి చట్టం ద్వారా స్వాధీనం చేసుకుందని ఆరోపించింది. వలసవాద కాలంలో లీజుకు తీసుకున్న భూమిని ఇకపై చర్చి ఆస్తిగా గుర్తించబోమని పేర్కొన్న 1965 ప్రభుత్వం ఉత్తర్వులను ఉదహరించింది. అంతకుముందు వక్ఫ్ బిల్లు ముస్లిం హక్కుల్ని కాలరాస్తుందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇదిలా ఉంటే, కేరళ కాథలిక్ బిషప్స్ కౌన్సిల్ వక్ఫ్ బిల్లుకు మద్దతు తెలియజేయడం గమనార్హం.

## వక్ఫ్ బిల్లు వ్యతిరేకంగా ఆప్ ఎమ్మెల్యే పిటిషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు అవుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావెద్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా, ఆప్ ఎమ్మెల్యే అమనతుల్లా ఖాన్ కూడా వక్ఫ్ బిల్లును ఛాలెంజ్ చేస్తూ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. అమనతుల్లా ఖాన్ తన పిటిషన్‌లో.. ఈ సవరణలు ముస్లింల మతపరమైన, సాంస్కృతిక స్వయంప్రతిపత్తిని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ జోక్యం మైనారిటీలు తమ మతపరమైన, స్వచ్ఛంద సంస్థలను నిర్వహించే హక్కులను దెబ్బతీస్తుందని పిటిషన్‌లో చెప్పారు. అయితే, ఈ చట్టం ముస్లిం మహిళలకు ప్రయోజనం చేకూరుస్తుందని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతను పెంచుతుందని బీజేపీ చెబుతోంది. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటను సవాల్ చేస్తూ, సమానత్వ హక్కు, మతపరమైన వ్యవహారాల నిర్వహణ, మైనారిటీ-ల హక్కులతో సహా ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘిస్తుందని ఆప్ ఎమ్మెల్యే తన వాదనల్ని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## హెచ్‌సీయూ వ్యవహారంలో ప్రభుత్వం వైఖరి సరికాదు

**విద్యార్థులు, వారికి అండగా నిలిచిన పార్టీలకు అభినందనలు : కేసీఆర్**



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరైంది కాదని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి అండగా నిలిచిన పార్టీలకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలన్నారు. “భారాస ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టింది. రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దితే నిలబెట్టుకోవడం ఈ ప్రభుత్వానికి చేతకాలేదు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక ప్రతిష్ఠను ఈ ప్రభుత్వం దిగజార్చింది. హెచ్‌సీయూ విషయంలో మరోసారి రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా చేశారు” అని కేసీఆర్ విమర్శించారు.

## జెలెన్‌స్కీ సొంత నగరంపై బాంబుల వర్షం

ఎక్కడ దాడి చేస్తున్నామనే విషయం తెలిసే రష్యా ఈ దురాగతానికి పాల్పడిందని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు.“ఇవి ప్రమాదవశాత్తూ జరిగిన దాడులు కావు. ఎక్కడ దాడులు చేస్తున్నారనే విషయం వారికి కచ్చితంగా తెలుసు. రష్యా ఉద్దేశపూర్వకంగానే క్రైవీ రిలోని ఇంధన సౌకర్యాలు ఉన్న ప్రాంతంపై క్షిపణిని ప్రయోగించింది. ఈ చర్యలతో మాస్కో అమెరికాతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని విస్మరించింది. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు కృషి చేస్తామని రష్యన్లు చేసిన వాగ్దానాలు ఈ దాడులతో ముగిశాయి. దౌత్యం అంటే ఏమిటో వారికి ఎప్పటికీ అర్థం కాదు” అని జెలెన్‌స్కీ మాస్కోపై మండిపడ్డారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు కృషి చేస్తామని రష్యన్లు చేసిన వాగ్దానాలు ఈ దాడులతో ముగిశాయి. దౌత్యం అంటే ఏమిటో వారికి ఎప్పటికీ అర్థం కాదు” అని జెలెన్‌స్కీ మాస్కోపై మండిపడ్డారు. తమతో జరుగుతున్న యుద్ధాన్ని ముగించే ఉద్దేశం రష్యాకు లేదనే విషయం ప్రపంచం మొత్తానికి అర్థమవుతోందని అన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యా అధినేత పుతిన్‌తో ఫోన్‌లో జరిపిన చర్చల్లో భాగంగా వారు పలు నిర్ణయాలు తీసుకున్నారు. యుద్ధాన్ని విరమింపజేయడంలో భాగంగా ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజుల పాటు దాడులు నిలిపివేసేలా చూడాలని అమెరికా, రష్యా ఒప్పందం చేసుకున్నాయి. ముందుగా ఈ రెండు రంగాల వరకు దాడులు ఆపాలని ట్రంప్ సూచించారు. దీనికి పుతిన్ అంగీకరించారని, శాంతి దిశగా ఇది తొలిఅడుగు అని అమెరికా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. నల్ల సముద్రంలో దాడుల విరమణకు, ఆ తర్వాత పూర్తిగా యుద్ధం అంతానికి ఇది దారితీస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. అయితే ఉక్రెయిన్ మాత్రం తమపై మాస్కో దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆరోపిస్తోంది.

## కెనడాలో భారతీయుడి దారుణ హత్య

మృతుడి సన్నిహితులు, కుటుంబసభ్యులకు అన్నివిధాల అండగా ఉంటాం. స్థానిక కమ్యూనిటీతోనూ సంప్రదింపులు జరుపుతున్నాం” అని భారత ఎంబసీ వెల్లడించింది.అయితే మృతుడి పేరు, ఇతరత్రా వివరాలేవీ తెలియరాలేదు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు కెనడా మీడియా కథనాలు వెల్లడించాయి. నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నాయి. మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు చేపట్టామని స్థానిక పోలీసులు వెల్లడించారు.

# లైట్ తీసుకోండి

సమయం” అని ట్రంప్ రాసుకొచ్చారు. “పెద్ద పెద్ద వ్యాపారులు ఈ టారిఫ్‌లతో ఎలాంటి ఆందోళన చెందట్లేదు. ఎందుకంటే వారు ఇక్కడే ఉంటారని వారికి తెలుసు. మన ఆర్థికవ్యవస్థను మరింత బలోపేతం చేసే అంశంపై వారు దృష్టిపెట్టారు. ఇదే చాలా ముఖ్యం” అని ట్రంప్ మరో పోస్ట్‌లో వెల్లడించారు.భారత్ సహా పలు దేశాలపై ట్రంప్ సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే. దీంతో గురువారం నాటి ట్రేడింగ్‌లో భారీగా క్షీణించిన అమెరికా మార్కెట్లు శుక్రవారం కూడా మరింత పతనమయ్యాయి. డోజోన్స్ 5.5శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 5.97 మేర నష్టపోయాయి. ఈ రెండు రోజుల్లో అమెరికా మార్కెట్ విలువ ఏకంగా 5 ట్రిలియన్ డాలర్ల మేర తరిగిపోయింది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి దారితీస్తాయని ఇప్పటికే పలువురు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టంచేశారు. మొత్తం 27 శాతం టారిఫ్‌లో 10 శాతం సుంకం ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి రానుండగా.. మిగతా 17 శాతం ఏప్రిల్ 10 నుంచి విధించనున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ ప్రకటన తో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా సహా అన్ని ప్రధాన మార్కెట్లు పతనమవుతున్నాయి.

## ట్రంప్ చర్యలతో ఈ ఏడాదిలోనే అమెరికాలో మాంద్యం

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ప్రతీకార సుంకాలే దీనికి ప్రధాన కారణమని జేపీ మోర్గాన్ సీఈవో మైఖేల్ ఫెరోలి పేర్కొన్నారు. మాంద్యం వల్ల అమెరికాలో నిరుద్యోగ రేటు 5.3 శాతానికి పెరుగుతుందని.. దీనివల్ల అగ్రరాజ్యంలో ఉద్యోగాలుండవని పేర్కొన్నారు. ప్రపంచదేశాల నుంచి యూఎస్‌కు వచ్చే దిగుమతులు 20శాతం కంటే ఎక్కువగా తగ్గే అవకాశం ఉందని యూఎస్ ఆర్థికవేత్త జోనాథన్ పింగిల్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాలలో జీడీపీలో దిగుమతులు 1986కు ముందు స్థాయిలకు తిరిగి వెళ్లే అవకాశం ఉందన్నారు. అమెరికా నూతన సుంకాల విధానంపై ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సైతం ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగం అమలుచేస్తున్న సుంకాలు దేశానికి గతంలో ఊహించిన దానికంటే చాలా ఎక్కువ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాయన్నారు. బార్క్లేస్, బోఫా గ్లోబల్ రీసెర్చ్, డ్యూష్ బ్యాంక్, యూబీఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ వంటి ఇతర పరిశోధనా సంస్థలు సైతం అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు అమెరికా ఆర్థికవ్యవస్థను పతనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా అన్ని ప్రపంచదేశాలపై సుంకాలతో విరుచుకుపడ్డారు. తమతో వాణిజ్య లావాదేవీలు ఉన్న దేశాలన్నింటిపైనా ఆయన టారిఫ్‌లు వేశారు. భారత్- 27శాతం, వియత్నాం- 46 శాతం, ఇజ్రాయెల్- 17 శాతం సుంకాలు విధించారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో

## విద్యార్థి వీసాల్లో భారీగా కత్తెర



**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనేది చాలా మంది కల. భారత్ నుంచి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి అగ్రరాజ్యానికి వెళ్లే వారి సంఖ్య చాలా ఎక్కువ. అయితే, గత కొంతకాలంగా విద్యార్థి వీసాల సంఖ్యకు అమెరికా సర్కారు భారీగా కత్తెర వేస్తోంది. కొత్తగా వచ్చే దరఖాస్తులను భారీగా తిరస్కరిస్తోంది. ఇందులో ఏపీ, తెలంగాణకు చెందిన దరఖాస్తులే దాదాపు సగానికి పైగా ఉంటాయని హైదరాబాద్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ సంస్థ పేర్కొంది. గడిచిన రెండు దశాబ్దాల్లో ఈ స్థాయిలో వీసాల తిరస్కరణ ఎన్నడూ చూడలేదని పేర్కొంది. అక్కడి వర్సిటీల్లో అడ్మిషన్లు లభించినా.. వీసాలు తిరస్కరిస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.ఎఫ్-1 వీసా అనేది నాన్-ఇమిగ్రెంట్ వీసా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అమెరికాలో పూర్తి స్థాయిలో విద్యను అభ్యసించేందుకు ఈ వీసా అనుమతినిస్తుంది. సాధారణంగా అగ్రరాజ్యంలోని విద్యా సంస్థలు ఏటా రెండుసార్లు ప్రవేశాలను అనుమతిస్తాయి. ఆగస్టు- డిసెంబర్ సెమిస్టర్ సమయంలోనే మన విద్యార్థులు అధికంగా వెళుతుంటారు. అయితే, గత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 41 శాతం వీసా దరఖాస్తులను అమెరికా తిరస్కరించింది. తిరస్కరణకు గల కారణాలను మాత్రం వెల్లడించడం లేదని కన్సల్టెన్సీ సంస్థలు పేర్కొంటున్నాయి. వ్యక్తిగత వివరాలు, చదువు, అవసరమైన డాక్యుమెంట్లలో ఏ చిన్న పొరపాటు ఉన్నా వదలడం లేదని చెబుతున్నారు. గతంలో ముఖ్యమైన డాక్యుమెంట్లు సరిగా ఉంటే చిన్న చిన్న పొరపాట్లను చూసీ చూడనట్లు వదిలేసేవారని పేర్కొంటున్నారు. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్-1 వీసాల కోసం 6.79 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో 2.79 లక్షల (దాదాపు 41శాతం) దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంతకుముందు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.99 లక్షల దరఖాస్తుల్లో 2.53 లక్షల (36 శాతం) అప్లికేషన్లను నిరాకరించారు. అయితే, వీసా గడువు ముగిసినా చాలామంది విద్యార్థులు అమెరికాలోనే ఉండిపోవడం వంటి కారణాల రీత్యా భారత్ నుంచి వచ్చే కొత్త దరఖాస్తులను ఆమోదించడం లేదని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు వీసాలు తిరస్కరణకు గురవ్వడంతో విదేశాల్లో చదువుకోవా లనుకునే విద్యార్థులు యూకే, జర్మనీ వంటి ఇతర దేశాల వైపు మొగ్గు చూపుతున్నారని కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

## సుంకాల పెంపుతో అమెరికాకు మేలు జరగదు

**మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా**

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తోన్న కొత్త టారిఫ్‌లు అమెరికాకు మేలు చేస్తాయని తాను భావించడం లేదని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పేర్కొన్నారు.ట్రంప్ యంత్రాంగం తీరును కొంతకాలంగా నిశితంగా గమనిస్తున్నానని, ఇప్పటివరకు బహిరంగంగా ఎక్కడా మాట్లాడలేదన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ హక్కుల ఉల్లంఘనకు వైట్‌హౌస్ పాల్పడుతున్నట్లుగానే భావిస్తున్నానని, తాజా పరిణామాలు ఎంతో ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు.” ఇటీవల బహిరంగంగా మాట్లాడటం ఇదే మొదటిసారి. కొంతకాలంగా ట్రంప్ యంత్రాంగం తీరును గమనిస్తున్నా. ఒకవేళ గతంలో అటువంటి నిర్ణయాలు తీసుకుంటే.. ఇప్పుడు మౌనంగా ఉన్నవారంతా అప్పుడు ఎలా ప్రవర్తించి ఉంటాయో ఊహించడం కష్టం. ఇక కొత్త టారిఫ్‌లు అమెరికాకు మేలు చేస్తాయని నేను భావించడం లేదు” అని బరాక్ ఒబామా పేర్కొన్నారు. స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు తెలియజేసే విద్యార్థులను తొలగించాలంటూ యూనివర్సిటీలను కేంద్ర ప్రభుత్వం బెదిరించడం ఆందోళనకర అంశమన్నారు.ఎన్నికల ముందు కమలా హారిస్‌కు మద్దతుగా ప్రచారం చేసిన ఒబామా.. ట్రంప్ రెండోసారి ఎన్నికైతే ఎదురయ్యే ముప్పు గురించి ముందే హెచ్చరించారు. ట్రంప్ తనదైన శైలిలో వ్యవహరిస్తారని ఇబ్బందులు కలిగిస్తారని చెప్పారు. ప్రస్తుత అధ్యక్షుడి నిర్ణయాల పట్ల మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కూడా తీవ్రంగా స్పందించారు.

## మోదీకి ‘మిత్ర విభూషణ్’

ఈ అవార్డును నెలకొల్పారు. గతంలో మాల్దీవుల అధ్యక్షుడు మౌమూన్ అబ్దుల్ గయూమ్, పాలస్తీనా నేత యాసర్ అరాఫత్ అందుకున్నారు. లంక అధ్యక్షుడు దిసనాయకే తనకు మిత్ర విభూషణ్ అవార్డును అందజేయడం గౌరవంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు కూడా గర్వకారణమన్నారు. కొలంబోలోని ప్రెసిడెన్షియల్ సెక్రటేరియేట్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ప్రశంసా పత్రంతో పాటు రజత పతకాన్ని అందజేస్తారు. ఆ సిల్వర్ మెడల్‌లో 9 రకాల లంక ముత్యాలు ఉంటాయి. కమలం, విశ్వం, సూర్యుడు, చంద్రుడు, వరి కంకి గుర్తులు ఉన్నాయి. మెడల్‌పై ధర్మచక్రం.. బౌద్ధ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుంది.

## 2034 తర్వాతే జమిలి ఎన్నికలు

2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దాదాపు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, జమిలి ఎన్నికలతో ఈ భారీ వ్యయం ఆదా అవుతుందన్నారు. “పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. దేశ జీడీపీలో 1.5శాతం పెరుగుదల కనిపిస్తుంది. విలువ పరంగా చూస్తే.. ఆర్థిక వ్యవస్థకు రూ.4.5లక్షల కోట్లు చేకూరుతాయి. జమిలి ఎన్నికల వల్ల కలిగే ప్రయోజనానికి ఇదో ఉదాహరణ” అని కేంద్ర మంత్రి చెప్పారు. కొన్ని పార్టీలు దీనిపై అసత్య ప్రచారాలు చేస్తూ.. గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. 2034 తర్వాతే ఇవి అమలు అవుతాయని, ఇప్పుడు వాటికి పునాది మాత్రమే పడిందన్నారు.“ఈ విధానంపై గతంలో అనేకసార్లు చర్చలు జరిగాయి. కేవలం నరేంద్ర మోదీ మాత్రమే దీన్ని తీసుకురాలేదు. 1960 నుంచి ఇది ఉనికిలో ఉంది. దీన్ని గుడ్డిగా వ్యతిరేకించే బదులు.. దాని ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని మద్దతిస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుంది” అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. డీఎంకే దివంగత నేత కరుణానిధి కూడా దీనికి మద్దతిచ్చారు.. కానీ, ఆయన కుమారుడు, ప్రస్తుత సీఎం (ఎంకే స్టాలిన్) మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఇది ఏ ఒక్కరి ప్రాధాన్య ప్రాజెక్టు కాదని, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిందని స్పష్టం చేశారు.

# సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శం

- చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పథకం సన్న బియ్యం పంపిణీ పథకం
- ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలకు పెద్దపీట
- పేద ప్రజల పక్షాన నిలిచే ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం
- అటవీ,పర్యావరణం,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ



**వరంగల్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికి ఆదర్శమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని 27వ డివిజన్ లో రేషన్ దుకాణాలను లబ్ధిదారులకు సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమం ఎంతో విజయవంతం అయిందని లబ్ధిదారులు కూడా దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల దళారీ వ్యవస్థ ఏర్పడి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిని నేడు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో ప్రతి లబ్ధిదారుడు సన్నబియాన్నే వినియోగించుకుంటూ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసినట్లు అయిందని మంత్రి సురేఖ తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మదిలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని సంక్షేమ పథకాలతో అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు మంత్రులు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారని తెలిపారు.

# బీసీలంటే కాంగ్రెస్‌కు చిన్నచూపు

- అసెంబ్లీలో పూలే విగ్రహం ఏర్పాటులో నిర్లక్ష్యం
- విగ్రహసాధనకు 8న ఇందిరాపార్క్ వద్ద దీక్ష
- విగ్రహ సాధనాదీక్ష పోస్టర్ ఆవిష్కరణలో కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలంటే చిన్నచూపని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటులో జాప్యమెందు కని నిలదీశారు. శనివారం ఉదయం తన నివాసంలో బీసీ సంఘాల నాయకులతో కలిసి పూలే విగ్రహ సాధన దీక్ష పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 8న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న విగ్రహ సాధన దీక్షకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అణచివేత, పీడన, అంటరానితనం లాంటి రుగ్మతలపై జీవితాంతం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని.. ఆయన విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు- చేసి గౌరవించుకుందామని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటు-లో ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్దతిలో ఒత్తిడి పెంచేందుకే విగ్రహ సాధన దీక్ష చేపడుతున్నా మని అన్నారు. బీసీలకు స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేశామని ప్రచారం చేసుకుంటు-న్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పెంచిన రిజర్వేషన్ల అమలులో కోసం చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ లో రిజర్వేషన్‌లు పెంచుతూ బిల్లు పాస్ చేసినా కేంద్ర ప్రభుత్వం వద్దకు ఎందుకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదో సమాధానం చెప్పి తీరాలన్నారు. కేంద్ర వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తే బీసీ రిజర్వేషన్ల పెంపుపై అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి పెంచుతాయన్న భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనుకంజ వేస్తున్నారని అన్నారు. తన పదవిని కాపాడుకునేందుకు అన్నిరకాలుగా అండగా నిలుస్తున్న ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి రాజకీయంగా ఎలాంటి ఇబ్బంది రావొద్దన్నదే రేవంత్ ప్రయత్నం అన్నారు. అందుకే అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానాన్ని కోల్డ్ స్టోరేజీలోకి పంపేస్తున్నారని వివరించారు. అసెంబ్లీలో పాస్ చేసిన తీర్మానం అమలు చేసే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వెంట పడుతామని హెచ్చరించారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా వర్గాలను పూర్తిగా విస్మరించిందన్నారు. తన జీవితాంతం సమసమాజ స్థాపన కోసం పరితపించిన మహనీయుడు పూలే విగ్రహ ఏర్పాటు- విషయంలో ఎందుకు భేషజాలకు పోతున్నారని ప్రభుత్వ పెద్దలను నిలదీశారు. దేశంలో అనేక సాంఘిక దురాచారాలు అమలవుతోన్న సమయంలోనే అంతరానితనం నిర్మూలన కోసం మహాత్మా పూలే ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. సామాజిక వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు సమానత్వం కోసం కృషి చేశారని.. తన సతీమణి సావిత్రి భాయి పూలేకు చదువు నేర్పించి ఆమె ద్వారా ఎందరో మహిళలకు ఆయన చదువు చెప్పించారని అన్నారు. ఆయనకు నివాళు లర్పించడంతోనే పాలకుల బాధ్యత తీరదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. మహాత్మా పూలే ఆశయాలను అమలు చేసినప్పుడు మాత్రమే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టు- అన్నారు. కేసీఆర్ గారి హయాంలో బీసీల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ లు ప్రవేశపెట్టి ఆయన స్ఫూర్తిని కొనసాగించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాలు దెబ్బతిన్నాయని, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ లు, ఫీ రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ ల కోసం విద్యార్థులు తంటాలు పడే పరిస్థితి తలెత్తిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే పూలే విగ్రహ సాధన దీక్షకు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు రక్షణ

- ప్రముఖ రాజ్యాంగ నిపుణులు న్యాయవాది తమిళనాడు ఎంపీ విల్సన్




**హైదరాబాద్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పరిరక్షణ ఉంటుందని ప్రముఖ రాజ్యాంగ నిపుణులు న్యాయవాది తమిళనాడు ఎంపీ విల్సన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం, ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ సంయుక్తా ఆధ్వర్యంలో సామాజిక న్యాయానికి 42% బి సి రిజర్వేషన్లు దిక్సూచి అనే అంశంపై శనివారం నాడు హైదరాబాదులోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి. చిరంజీవులు అధ్యక్షత వహించగా ఎంపీ విల్సన్, ఆల్ ఇండియా ఓబీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్, ప్రముఖ డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ రాజు, దేవరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ విల్సన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే పాలసీలను చట్టాలను కోర్టులు కొట్టివేయలేవని ఆయన వివరించారు. 1994 సంవత్సరం నుంచే తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. తమిళనాడులో సామాజిక న్యాయ ఉద్యమ ఫలితంగా నేడు దేశవ్యాప్తంగా సామాజిక న్యాయానికి తమ రాష్ట్ర ముఖ్యమంత్రి ఛాంపియన్ గా నిలిచారని చెప్పారు. తమిళనాడు రాష్ట్రంలో పెరియార్, అన్నాదురై, కరుణానిధి వంటి మహనీయులు రిజర్వేషన్ల కోసం రోడ్ల మీదకు వచ్చి ఉద్యమాలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రిజర్వేషన్లు 50% మించ కూడదన్న కోర్టు తీర్పులను అధిగమించి రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రధాన కారణం ఆనాడు తమిళనాడులోని అన్ని రాజకీయ పక్షాలు ఒకటైనందునే ఇది సాధ్యమైంది అన్నారు. రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూలులో చేర్చడం వల్ల ఒక పెద్ద గోడ నిర్మించినట్లు అవుతుందని అందులో ఎవరు జోక్యం చేసుకోవడానికి వీలు ఉండదని వివరించారు. ప్రస్తుతం భారత దేశంలో డీ లిమిటేషన్ చేయడం వల్ల దక్షిణ భారతదేశంలో ఎంపీల సంఖ్య తగ్గి రేపు చట్టాలు తయారు చేయడంలో చాలా నష్టం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు జరగబోయే డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా మనం ఉద్యమం చేయని పక్షంలో భవిష్యత్తులో ఎవరు దక్షిణాది రాష్ట్రాలను పట్టించుకోకుండానే నిర్ణయాలు జరుగుతాయని దానివల్ల దక్షిణ భారతదేశ ప్రజలు చాలా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబిసి కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో చట్టం చేయకుండా జీవోలు తెస్తూ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు తెస్తే ఆయా హైకోర్టులు, సుప్రీంకోర్టు కొట్టి వేసిన పలు తీర్పులను పుటంకిస్తూ వివరాలు చెప్పారు. రాజ్యాంగము, చట్టాల మీద, రిజర్వేషన్ల మీద అవగాహన లేనివారు తమను విమర్శిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆధారాలతో కూడిన కులగణన లెక్కలు చట్టాలు లేకుండా జీవోలు తెస్తే కోర్టులు కొట్టివేసినయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ ఉద్యమకారులు, సంఘాలు వివిధ రాజకీయ పార్టీల బీసీ నేతలందరూ ఏకమై బీసీల రిజర్వేషన్లు అమలుకై పోరాటాలు చేయాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫారం చైర్మన్ టీ చిరంజీవులు పిలుపునిచ్చారు. సంఘాల మధ్య నేతల మధ్య మనస్పర్ధలు వీడి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అందుకు అనుగుణంగా ఉద్యమం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల లేసి నివాళు లర్పించారు. ఇంకా ఈ కార్యక్రమంలో బిసి ఇంటలెక్చువల్స్ కోర్ కమిటీ సభ్యులు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, కె వి గౌడ్, కోలా జనార్దన్, అవ్వారు వేణు, కొండల గౌడ్, బొమ్మ రఘురాం, ఒంటెద్దు నరేందర్, కిరణ్, వీరస్వామి, శ్రీకాంత్, శీను తదితరులు పాల్గొన్నారు

## ఝరాసంగం కేతకి సంగమేశ్వరస్వామి ఆలయ సందర్శన

- జడ్జిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

**ఝరాసంగం, ఏప్రిల్5 (జనంసాక్షి) :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిలు జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, జస్టిస్ పి. శ్రీసుధ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా జడ్జిలకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అర్చకులు మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాలు మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదాచారణ చేసి గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి అభిషేకం, మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జడ్జీలకు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శివ రుద్రప్ప పూలమాల శాలువాతో సన్మానించి స్వామివారి ప్రసాదంతో పాటు చిత్రపటాన్ని అందజేశారు. జడ్జిల వెంట సంగారెడ్డి జిల్లా జడ్జి భవాని చంద్ర, జహీరాబాద్ జడ్జి శ్రీధర్, ఆర్డీవో రామ్ రెడ్డి, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ తిరుమలరావు, ఆర్ఐ రామారావు, శేఖర్ పటేల్ లు ఉన్నారు.

## పింఛన్లు ఇప్పిస్తానంటూ వసూళ్లు!

**ములుగు/వెంకటాపూర్,ఏప్రిల్05(జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి గ్రామ ప్రజల అయినటువంటి వృద్ధుల దగ్గర వృద్ధాప్య, మరియు వితంతువుల పింఛన్ ఇప్పిస్తా అంటూ కొంతమంది దగ్గర నుండి డబ్బులు వసూలు చేయగా అదేవిధంగా ఇంటి నెంబర్ ఇప్పించుట కోసం ఒక్కొక్కరి నుండి విడతలవారీ గా డబ్బులు వసూలు చేస్తూ వారిని గ్రామపంచాయతీ చుట్టూ తిప్పిస్తూ రేపు మాపు అంటూ కాలం వెళ్ళదిస్తూ అనేక రకాలుగా వృద్ధులను, వితంతువులను,ఇంటి నెంబర్లను తీసుకునే వారిని ఇబ్బందుల గురి చేస్తున్నాడని గ్రామ ప్రజల ఆవేదన చెందుతున్నారు.ఇది ఎక్కడ అన్యాయమని అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకపోండి అని బెదిరింపులకు గురి చేస్తున్నాడు.కాబట్టి వెంటనే వెంకటాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రతి శనివారం పరేడ్ తప్పనిసరి

- ప్రతీ పోలీసుకు క్రమశిక్షణ అవసరం
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ఇక నుంచి ప్రతీ శనివారం పోలీసులకు క్రమం తప్పకుండా పరేడ్ నిర్వహింప బడు తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పరేడ్ గ్రౌండ్ మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్ లో ఆయన హాజరయ్యారు. ఈ పరేడ్ లో మొత్తం తొమ్మిది పోలిస్ ప్లాటూన్లు పాల్గొని పరేడ్ నిర్వహించాయి. మొదటగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఎస్పీ పోలీసులకు పలు అంశాలపై సూచనలు కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ మాట్లాడుతూ పరేడ్ వల్ల మానసిక ఉల్లాసం, ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా దీని వల్ల పోలీసులకు క్రమశిక్షణ అనేది మెరుగుపడుతుందని అన్నారు. ప్రతి ఒక్క పోలీసు కు క్రమశిక్షణ అనేది ఎంతో అవసరం అన్నారు. పోలీసులు అనవసరంగా విధులకు గైర్హాజరు కాకుండా ఉండాలని తెలిపారు. క్రమశిక్షణ తప్పిన పోలీసులపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 05(జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందించుటకు వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేపట్టాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బాలికల ఉన్నత పాఠశాల మహబూబాబాద్ లో జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తమ విద్య వ్యవస్థ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి , విద్యాశాఖ మంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో వేసవిలో ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు చేపట్టి సబ్జెక్టు టీచర్స్ కొరత లేకుండా చూసి అవసరమైన ఖాళీలను డీఎస్సీ నిర్వహించి నూతన నియమకాల ద్వారా నింపాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు ఉదయం సాయంత్రం పాలు, స్నాక్స్ ఇస్తూ సెమీ రెసిడెన్షియల్ పద్ధతిలో ప్రభుత్వ పాఠశాలలను నడపాలని, అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య ప్రవేశపెడితేనే రాష్ట్రంలో ప్రభుత్వ విద్య నిలబడుతుందని, ఉత్తమ విద్యా వ్యవస్థ సాధ్యపడుతుందని అన్నారు. గత రెండేళ్లుగా ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులను ఎటువంటి జాప్యం లేకుండా చెల్లించాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి చెల్లించాల్సిన ఐదు పెండింగ్ డిఏ లను వెంటనే ప్రకటించాలని, డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, అన్ని రకాల గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ అన్ని కార్పొరేట్ హాస్పత్రులల్లో నగదు రహిత వైద్యం అందించాలని , కేజీబీవీ ఉపాధ్యాయ, ఉద్యగులకు మినిమం బేసిక్ పే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా ఉపాధ్యక్షులు నామ వెంకటేశ్వర్లు, కోశాధికారి కె నాగమల్లయ్య, కార్యదర్శులు జి వివేక్, పి మంజుల, డి హుస్సేన్, ఎం మంజుల, ఇ రమేష్, బి హరినాయక్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి సంజీవ మండలాల బాధ్యులు ఎం కుమార్, కె రాజశేఖర్, ఎం ప్రవీణ్ కుమార్, ఎండీ అబ్దుల్ అజీజ్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, జనార్ధన్, బత్తుల శ్రీనివాస్, బి మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాంగం బుక్కు ఆవిష్కరించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**భూపాలపల్లి, ఏప్రిల్ 5 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి ఓ టీవీ చానల్ పంచాంగం ఆవిష్కరిం చారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరిం చుకొని ఓ టీవీ చానల్ సమక్షంలో ఉగాది పంచాంగం పుస్తకాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాజకీయ విశ్లేషణలు, భౌగోళిక, సామాజిక సమస్యలే కాకుండా ధార్మిక కార్యక్రమాలను కూడా ప్రోత్సహిం చడం, స్వయంగా నిర్వహిం చడం అభినందించ తగిన విషయమని ఆయన కొనియాడారు. ఉరుకుల, పరుగుల జీవితంలో డిజిటల్ మీడియా పాత్ర క్రియాశీలకంగా ఉన్న సమయంలో కూడా ధార్మిక కార్యక్రమాలను చేపడుతూ దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే ప్రయత్నం చేస్తుందన్నారు. ముఖ్యంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ప్రతి ఏటా రాష్ట్ర రాజధాని లోని ఎన్టీఆర్ గార్డెన్ లో నెలరోజుల పాటు కోటి దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తుండడం గర్వించదగ్గ విషయం అన్నారు. అదే కోణంలో ప్రతి ఉగాదికి ఉగాది పంచాంగం పుస్తకాన్ని రూపొందించి పాఠకులకు,వీక్షకులకు అభిమానులకు పంపిణీ చేయడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో రిపోర్టర్ ఎడ్ల సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డిఎంహెచ్ ఓ మధుసూదన్, డీఎస్పీ సంపత్ రావు, ఎస్సీ డెవలప్మెంట్ జిల్లా అధికారి సునీత, మున్సిపల్ బి కమిషనర్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి అంబాల చంద్రమౌళి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి భద్రయ్య, సేవాలా ల్ సేన నాయకుడు సంతోష్, లక్ష్మారెడ్డి పల్లిమాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక రెడ్డి పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 5(జనంసాక్షి):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నెల రోజుల పాటు 30 సిటీ పోలీస్ యాక్ట్ అమలులో వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా మీటింగ్ ర్యాలీలు, ఉరేగింపులను నిర్వహించడం నిషేధించబడ్డాయి. అలాగే ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, అలాగే వృద్దులు, రోగులతో పాటు, విధ్యార్థుల చదువులను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు , శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్‌లను వినియోగించడంపై నిషేధాన్ని కోనసాగించడం జరుగుతుందని. ఎవరైన తప్పని సరిగా మైక్‌లను ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పని సరిగా సంబంధిత ఏసిపి అధికారుల నుండి తప్పని సరిగా అనుమతులు తీసుకోవాల్సి వుంటుందని. మైక్ కేవలం ఉదయం ఆరు గంటల నుండి రాత్రి పది గంటల వరకు మాత్రమే వినియోగించుకోవాల్సి వుంటుందని. ఎట్టి పరిస్థితుల్లో రాత్రి సమయాల్లో మైకులను వినియోగించరాదని, అలాగే హస్పటల్స్, విద్యాలయాలకు వంద మీటర్ల పరిధిలో మైకులను ఏర్పాటు చేయరాదని, ఈ నిషేధ ఉత్తర్వులు తేది 6నుండి తేది అమలులో వుంటుందని, ఏవరైన ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

## క్రికెట్ ఆడుతూ కూప్పకూలిన విద్యార్థి


- మేడ్చల్ సీఎంఆర్ కాలేజ్‌లో ఘటన

**ఖమ్మం, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** "హార్ట్ ఎటాక్" ఒకప్పుడు వయస్సు మళ్లిన వారికే ఎక్కువగా వచ్చేది..కానీ ఇటీవల కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా..పిల్లల నుంచి పెద్దల వరకు హార్ట్ ఎటాక్ కారణంగా ప్రాణాలు వదిలేస్తున్నారు. ఇలా హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. జిమ్‌లో వర్కౌట్ చేస్తూ పడిపోవడం, పెళ్లి భరత్‌లో డ్యాన్స్‌లు చేస్తూ గుండెపోటుతో ప్రాణాలు వదలడం వంటి ఘటనలు మనం చాలానే చూస్తున్నాం. అప్పటి వరకు అందరితో సరదాగా నవ్వుతూ గడిపిన వారు క్షణాల్లో నేల కూలి ప్రాణాలు వదిలేస్తున్నారు. ఇలాంటి ఘటనే తాజాగా మేడ్చల్ జిల్లాలోని కండ్లకోయలో ఉన్న సీఎంఆర్ కాలేజ్‌లో చోటుచేసుకుంది. సీఎంఆర్ కాలేజ్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ స్టూడెంట్ క్రికెట్ ఆడుతూ గుండె పోటుతో గ్రౌండ్‌లోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. ఖమ్మం జిల్లాకు చెందిన వినయ్.. మేడ్చల్ జిల్లా కండ్లకోయలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అయితే క్రికెట్ ఆడుదామని స్నేహితులతో కలిసి కాలేజీ గ్రౌండ్‌కు వెళ్లారు. అందరూ కలిసి సంతోషంగా క్రికెట్ ఆడుతూ ఉన్నారు. అయితే గ్రౌండ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న వినయ్.. ఒక్కసారిగా ఛాతీలో నొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే గ్రౌండ్‌లో ఉన్న స్నేహితులంతా వినయ్ దగ్గరకు వచ్చారు. వినయ్‌కు సీపీఆర్ చేశారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో.. వినయ్‌ను సమీపంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వినయ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. అప్పటిదాకా సరదాగా తమతో కిక్రెట్ ఆడిన ఫ్రెండ్ కళ్లముందే ప్రాణాలు కోల్పోవడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. క్రికెట్ ఆడుదామని వచ్చి.. స్నేహితుడి చావు చూడాల్సి వచ్చిందేనని ఆవేదన వ్యక్తం చేశారు.

CHENGE OF NAME AND DATE OF BIRTH

I, CHAKALI HASINI, D.O.B:14/08/2010 R/OH.NO:3-22,BOM-RASPET(POST),V) M)BOM-RASPET,D)VIKARABAD,TELANGANA STATE ,PIN:509338,CHENGED MY NAME AND DATE OF BIRTH AS FOR BIRTH CERTIFI-CATE AND STUDY BONAFIDE C.ADHVITHA D/O BHEEMAIAH ,D.O.B:14/09/2010.


# మైమరపిస్తున్న కార్ల్‌మార్క్స్ మైనపు బొమ్మ




భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) 24వ మహాసభలు ఈ నెల 2 నుండి 6 వరకు మధురైలో జరుగుతున్న తరుణంలో ప్రపంచవ్యాప్తంగా ఆయా కమ్యూనిస్ట్ నాయకుల కృషిని సూచిస్తూ వివిధ ప్రదేశాలలో ఆయా నాయకుల విగ్రహాలను ప్రతిష్టించడం మరియు పోస్టర్లను ప్రదర్శింపబడడం తద్వారా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయా కమ్యూనిస్ట్ పార్టీల మహాసభలలో సర్వసాధారణంగా కార్ల్ మార్క్స్, లెనిన్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, జోసెఫ్ స్టాలిన్ వంటి తదితర కమ్యూనిస్ట్ నాయకుల భారీ చిత్రాలను ప్రదర్శిస్తారు. అయితే ఈ భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) 24 వ మహాసభల సందర్భంగా రూపొందింపబడ్డ 'కార్ల్ మార్క్స్ మైనపు బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకుంటూ మహా సభలకు మరింతగా వన్నె చేకూరుస్తూనే ఉంది' అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. పెట్టుబడిదారీ విధానాన్ని ఎదుర్కొంటూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాలు మరియు పోరాటాలను తొలగించడా నికి కృషి చేసిన తోటి మానవుడిగా కార్ల్‌మార్క్సు సందర్శకులకు పరిచయం చేసే సదుద్దేశంతో రూపొందింపబడిన 'కార్ల్ మార్క్స్ మైనపు బొమ్మ' ఈ మహాసభల సందర్భంగా విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. 'కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో' కరపత్రాన్ని పట్టుకుని కుర్చీపై కూర్చున్న కార్ల్ మార్క్స్ యొక్క నిలువెత్తు విగ్రహాన్ని మహాసభల ప్రాంగణంలోని సెల్ఫీ పాయింట్ వద్ద ప్రతిష్టించడం భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) 24 వ మహాసభలకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. నాయకుడి దగ్గర ఉంచే టేబుల్పై కార్ల్ మార్క్స్ తన కాలంలో పట్టుకున్న కరపత్రాన్ని పోలి ఉండే భౌతిక కరపత్రాల ను కూడా అందుబాటులో ఉంచడం అనేది ఈ విగ్రహానికి మరింతగా వన్నె తెచ్చిపెట్టింది. నాయకుడితో (కార్ల్ మార్క్స్ ) పాటు ఫోటోలు తీసుకోవాలనుకునే కార్యకర్తలు అక్కడ టేబుల్పై ఉంచే ఒక కరపత్రాన్ని కూడా ఎంచుకునే వెసులుబాటును కలిగి ఉండడం నిజంగా అత్యద్భుతంగా ఉంది అని చెప్పవచ్చు. 'మార్క్సిస్ట్ పార్టీ కార్యక్రమం మొత్తం ఒకే ఒక వ్యక్తి, ప్రపంచ కార్మిక తాత్విక శక్తి అయిన కార్ల్ మార్క్స్ కృషిపై ఆధారపడి ఉంది. అందువలన విగ్రహం వాస్తవికంగా మరియు ప్రజలకు దగ్గరగా ఉండాలని నాయకులు ఆకాంక్షించారు. అందుకు అనుగుణంగానే ఈ కార్ల్ మార్క్స్ మైనపు బొమ్మ ను (విగ్రహాన్ని) అత్యద్భుతంగా రూపొందించాను' అని ప్రముఖ చిత్రకారుడు మరియు కళాకారుడు వి.శరణ్ రాజ్ పేర్కొనడా న్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. 'అన్ని శ్రమలు ఏకమవుతాయి' అనే పదాలు కరపత్రంపై ముద్రించబడి ఉండడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కార్ల్ మార్క్స్ మైనపు బొమ్మను సునిశితంగా పరిశీలిస్తే 'నాయకుడు (కార్ల్ మార్క్స్) అనుభవించిన భావోద్వేగాలను తిరిగి రేకెత్తిస్తాయి' అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ విగ్రహానికి ప్రాణం పోయడానికి ఫైబర్గ్లాస్ పదార్థాన్ని వినియోగించినట్లు చాలా స్పష్టంగా గమనించవచ్చు. ఆ మైనపు బొమ్మని 'నిజంగా కార్ల్ మార్క్స్' అనే రీతిగా కళాకారుడు వి.శరణ్ రాజ్ రూపొందిం చడం ఆయనలోని కళా ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుంది. అంతిమంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) 24 వ మహాసభల సందర్భంగా రూపొందింపబడిన కష్టజీవుల తత్వవేత్త కార్ల్ మార్క్స్ మైనపు బొమ్మ చూపరులను ఎంతగానో ఆకట్టుకొని నిజమైన కార్ల్ మార్క్స్ గాను మైమరపింపజేస్తూ 'గతం - వర్తమానంల మధ్య సాగే నిరంతర సంఘర్షణ లకు ప్రతీకగా నిలిచింది' అని చెప్పవచ్చు.

**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్ సెల్: 94933 19690.**

# ట్రంప్ అమెరికాకు భస్మాసురుడే



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమెరికాకు ఒక బస్మాసురుడిగా తయారయ్యాడు అంటున్నారు. ఈ విషయాన్ని అక్కడి సనేటర్ మర్ఫీ లాంటి వాళ్లు కూడా పేర్కొంటున్నారు. అమెరికా సంక్షేమ అభివృద్ధి ట్రంపు విధానాల వల్ల మరింత దెబ్బతినే పరిస్థితి కనిపిస్తున్నది ఆర్థిక నీతి విధానాలు సరిగా లేవనే విమర్శ అమెరికాలో సైతం మొదలైపోయింది. మరోవైపు చైనా అమెరికా వస్తువులపై 34% సుంకం విధిస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. దీంతో అమెరికన్ షేర్ మార్కెట్ దారుణంగా పడిపోయింది.

**అమెరికా షేర్ మార్కెట్ ఔట్.**

ఒక్క రోజుకే 2.5 ట్రిలియన్ డాలర్ల షేర్ మార్కెట్ పడిపోయి నష్టం వాటిల్లింది. ఇదంతా కేవలం ట్రంప్ దుందుడుకు వాదం ఫలితమే, అంటే అతిశక్తి కాదు భారతదేశంలో మీద 26% సుంకం విధించినప్పటికీ ఇప్పటిదాకా మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నోరు తెరవలేదు ఒక్కమాట మాట్లాడలేదు. అటు ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, యూరప్ లోని అలా పని చేశారు ట్రంప్ విధానాలను బహిరంగంగానే తూర్పారబడుతున్నాయి. ఒక మనవాళ్లే మౌనం గా ఉన్నారు.

**సెనేటర్ విమర్శలు.**

సెనేటర్ మర్ఫి అమెరికాలో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంపు దేశాన్ని అనా సాయి వైపుకు తానా షాహి వైపు తీసుకెళు తున్నారని, ఇదే ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య దేశానికి తీవ్ర విఘాతం కలిగించినట్లు అవుతుందని మర్ఫీ పేర్కొంటున్నారు. మొత్తానికి ట్రంపు విధానాలు అటు అంతర్జాతీయ యుద్ధానికి అణు ఆయుధాలకు సంబంధించి కూడా సరిగా లేవనే విమర్శ ఉంది. గాజా పట్టి కాజా నువ్వు ఖాళీ చేయించాలని దుర్బుద్ధి ఒకవైపు, మరోవైపు అక్కడ యుద్ధం వద్దు అనేది మరోవైపు నీతి కొనసాగుతున్నది. ఉక్రైన్- రష్యా విషయంలోనూ అటు గాజా -ఇజ్రాయిల్ విషయంలోనూ పక్కాగా పంపు విధానాలు కనిపించడం లేదు. ఐక్యరాజ్యసమితికి పూర్తిగా విరుద్ధంగా ట్రంప్ విధానాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు ఒకవైపు దేశం షేర్ మార్కెట్ మొరుగుతా ఉంటే మరోవైపు కొడుకుతో గోల్ఫ్ ఆడుతున్నాడు ట్రంప్. అసలు ట్రంప్ ప్రవర్తన చూసి ప్రపంచం విస్తుపోతున్నది.

**తానాషాహి వైపుకు అమెరికా.**

దేశాన్ని ఏకచక్రాధిపత్యం ద్వారా ఒక డిక్టేటర్ లాగా తీసుకెళ్తున్న పరిస్థితి అమెరికాకు ప్రమాదకరమని అక్కడి విపక్షాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ మేధావులు అందరు అమెరికా పరిస్థితి దిగజారుతుంది, అని పేర్కొంటున్నారు. నిరుద్యోగం అమెరికాలో పెరిగిపోయింది. ఆర్థికమైన ఇబ్బందులు కూడా ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ధరలు పెరుగుతున్నాయి, ఈ విషయాల మీద ట్రంపు కేంద్రీకరణ చేయకుండా ఇతర దేశాలకు సుంకం విధించే పనిలో నిమగ్నమయ్యాడు. మొత్తానికి ఇప్పుడున్న పరిస్థితి ప్రపంచ దేశాల్లో ఆందోళన కలిగే విషయంగా పేర్కొనక తప్పదు.

**జాగో ఇండియా జాగో.**

ఇప్పటికైనా జాగో ఇండియా జాగో తేరుకోకపోతే నోరు తెరవకపోతే మన దేశం ఆర్థిక పరిస్థితి కుదేలు అవుతుంది. మన ఎగుమతులు, దిగుమతులు పైన ప్రభావం తీవ్రంగా పడుతుంది. చైనా ను కూడా మరోసారి ట్రంప్ బెదిరిస్తున్నాడు. తమ వస్తువుల పై 34 శాతం సుంకం వేయడానికి వేయడాన్ని ఖండిస్తూ చైనాపై కోపం వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే ఇరాన్ లాంటి దేశాలు ట్రంపును కోన్ కిస్కా గాడిలాగా ట్రీట్ చేస్తూ, డోంట్ కేర్ అనే విధంగా మాట్లాడడం జరుగుతుంది. గల్ఫ్ అంతా వ్యతిరేకం అయిపోయింది.

**రెచ్చిపోతున్న ట్రంప్.**

ప్రశాంతంగా శాంతి యుతంగా సమస్యను పరిష్కరించుకోకుండా ట్రంపు రెచ్చిపోవడం అడ్డగోలుగా మాట్లాడడం ఆందోళన కలిగించే విషయంగా పేర్కొనక తప్పదు, ఏది ఏమైనా భారతదేశం అలర్ట్ కావాలి. అమెరికాకుటీల నీతి పై ప్రపంచంతో కలిసి రావాలి. మాట్లాడుకోవాలి. దేశంలోని విపక్షాలతో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడాలి. అమెరికా విధానాల మీద ఇంకా నోరు తెరవకుంటే నేరం చేసిన వారి పరిస్థితి అవుతుంది. బి అలర్ట్ మోడీజీ!



**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,**
**9951865223,**

# బాధితులారా.. బతుకుదాం!



**బలవన్మరణాల జాబితాలో బెట్టింగ్ యాప్ ల బాధితులూ ఒక్కొక్కరిగా ఏదో మూలన తరచూ చేరిపోవడం కలిచివేస్తుంది. ఒక బాధితుడు సకాలంలో తేరుకొని, తిరిగి సాధారణ జీవితంలో నిమగ్నమైన నిజాన్ని పదుగురితో పంచుకుందామని సంకల్పిస్తుండగానే నిజామాబాద్ జిల్లాలో ఇంకో విషాదం చోటుచేసుకుంది. ఆకుల కొండూర్ గ్రామస్తుడు ఆకాశ్ ప్రాణాన్ని ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం పొట్టన"బెట్టు"కున్నది.**

మంచి జీవనం కోసం కంటున్న కలలను 22 ఏళ్ల ఏజ్ లోనే చిదిమేసింది. భార్య, 6 నెలల మగ శిశువు కలిగిన ఆకాశ్ పెట్రోల్ బంకులో ఉద్యోగంతో రాబడి చాలక పందెం యాప్ బారిన పడ్డాడు. తనను నమ్ముకున్న కుటుంబా న్ని అగాధంలోకి తోసివేస్తుందని గ్రహించలేక బెట్టింగ్ వ్యసనంతో రూ. 5 లక్షల బాకీలయ్యాడు. మనం ఎన్ని నీతులు చెప్పుకొ న్నా... కలియుగంలో దేనికైనా డబ్బుతోనే పని.

రాజీవ్ యువ వికాసం వంటివి బాగా అమలు చేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను విరివిగా అందుబాటులో ఉంచాలి. అవసరాలు, పేదరికం ఆసరాగా జీవితాలతో ఆటలా డుకొనే మాయగాళ్ళు, మోసపూరిత యాప్‌ల వంక చూడకుండా పాలకులు తీక్షణంగా యోచించాలి. ఆ మాయా జూదం పీడ విరగడకు రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐపీఎస్ టీంకు అసైన్ చేసింది. తాత్కాలిక చర్యల్లా కాకుండా సమూల మార్పులకు ప్రస్తుత పరిస్థితుల తీవ్రత అద్దం పడుతుంది.

**గుండంలో స్నానం.. స్మార్ట్ ఫోన్‌కే గండం!**

తనను గండంలోకి నెట్టిన స్మార్ట్ ఫోన్నే గుండంలో వదిలేసి ప్రశాంతమైన జీవనానికి ఒడ్డున చేరాడో బెట్టింగ్ బాధితుడు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల సెగ్మెంట్‌లో ఓ మండల కేంద్రం. రెక్కల కష్టంతో భార్య, ఇద్దరు పిల్లలతో బతుకుతున్న పేద కుటుంబం. ఆ కుటుంబ యజమానికి ఆన్‌లైన్ బెట్టింగ్ వల విసిరింది. ఫాయిదా ఇస్తున్నట్టే ఇచ్చి లక్షల్లో అప్పుల పాల్జేసింది. దాంతో తాను తానులా లేడు. గుండెల్లో ఏదో తుపాను. రామ భక్తుడైన ఒక జర్నలిస్టు పేరు వేరైనా ఆ బాధితుడు మాత్రం "రామయ్యా" అనే పిలుస్తాడు. ఆ అనుబంధంతోనే బెట్టింగ్ వ్యసనపరుడిని ఆ పాత్రికేయుడు అప్రమత్తం చేశాడు. మరో నలుగురితోనూ నాలుగు మంచి మాటలు నూరిపోయించాడు. ఫలితంగా ఆ వ్యక్తి తన ఇంటి సభ్యులకు పరిస్థితి వివరించాడు.

చేసిన అప్పులు తీర్చేస్తానని, ఎవరూ బాధపడొద్దనీ ధైర్యాన్ని కూడదీసుకుని, అదే ధైర్యం పంచాడు. సదరు "రామయ్య" సూచన మేరకు ఇల్లాలు, పిల్లలతో కలిసి ఏములాడ రాజన్న గుడికి వెళ్ళాడు. తలనీలాలు సమర్పించాడు. గుండంలో తాను మునిగి ఒడ్డుకు వస్తూ, ఆ పాడు యాప్ ఉండే తన స్మార్ట్ ఫోన్ ను ఆ గుండంలో తెలిసే వదిలేశాడు. రాజేశుని దర్శనంతో ఇల్లు చేరాడు. తనను తాను కాపాడుకొంటూ, తన కుటుంబానికి రక్షణగా తన వృత్తి పనిలో నిమగ్నమయ్యాడు. ఓ సాదా సెల్ ఫోన్ తో అడ్జస్ట్ అవుతూ, బంగారు భవిష్యత్తుకు కొత్త జీవితం ప్రారంభించాడు. ఇది కల్పితం కాదు. ఇటీవలి యథార్థం!

ఈ వాస్తవం మేరకు కనీసం ఏ ఒక్కరైనా ఆ బెట్టింగ్ మహమ్మారి బారిన పడకుండా, పడిన వారు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలకు పూనుకోకుండా నిలదొక్కుకొంటే అదే పది వేలు. ఈ ఆర్టికల్ తపస్సు అంతే.

బాధిత కుటుంబాలకు పంచాలి కావొచ్చు! ఆ ఎములాడ రాజన్నే.. సదరు భక్తుని కనువిప్పు మీదట మన ముఖ్యమంత్రి రేవంతన్నలో గట్టి ప్రేరణ కలిగించాడేమో! రాష్ట్రమనే కుటుంబం ఆలనాపాలనా చూసే స్థానంలో ఉన్న సీఎం బెట్టింగ్ యాప్స్ ప్రాణాంతక దందాలకు దండన/కళ్ళెం కోసం ఐజీ (పీ ఐండ్ ఎల్) ఎం.రమేశ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయించారు. నిర్ణీత వ్యవధి 90 రోజుల్లో సమగ్ర నివేదికలు ఇవ్వాలని కడపటి సమీక్షలో సీఐడీ డీజీ శిఖా గోయల్ సిట్ బృందాన్ని కార్యోన్ముఖం చేశారు. ప్రభుత్వ స్థాయిలో చలనానికీ, సమాజంలో చైతన్యానికి ఐపీఎస్ ఆఫీసర్, టీజీఎస్ఆర్టీసీ ఎం.డి. వీసీ సజ్జనార్ గొప్పగా పాటుపడుతూనే ఉన్నారు.

బెట్టింగ్ ఊబిలోకి జారడానికి, నిండు జీవితాలు అర్ధాంతరంగా ముగియడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారు తెలియదు, తప్పయిందంటూ లేదా సమర్థించుకొంటున్న గుండె తడి లేని గొంతుల బాపతులకు శిక్షల మాటెలా ఉన్నా...సినిమాల్లోలా ఆ వ్యక్తుల పాప ప్రక్షాళనకు చురుకుగా యోచించాలి. అంటే, బెట్టింగులను ఎడాపెడా ప్రోత్సహించి... వెనకేసుకున్న సొమ్ములను కక్కించాలి. ఇంకా చెప్పాలంటే వారి ఆర్థిక సామర్థ్యం మేరకు డబుల్, ట్రిబుల్ రాబట్టాలి. బాధిత కుటుంబాలకు ఇప్పించాలి. గుట్టుగానైనా సరే ఇదంతా చేసి పుణ్యం దక్కించుకోవాలి.

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు**
**హైదరాబాద్ , 9440850384**

# రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం

1995 వక్ఫ్ చట్టాన్ని భర్తీ చేసే యుఎంఈఈడి (UMEED -ఏకీకృత వక్ఫ్ నిర్వహణ సాధికారత, సామర్థ్యం, అభివృద్ధి) బిల్లును 2025 ఏప్రిల్ 2 అర్ధరాత్రి లోక్‌సభ ఆమోదించడంతో, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఫాసిజం ముస్లిం వ్యతిరేక మెజారిటీ హిందూరాష్ట్రం వైపు దాని ఎర్రెత్తిన వేగంతో మరో అడుగు ముందుకు వేసింది. లోక్‌సభలో బిజెపికి మెజారిటీ లేకపోవడంతో, బిల్లును ఆమోదించడంలో హిందూత్వ ఫాసిస్టులు దాని కేంద్ర- మితవాద (రైట్) మిత్రుల మద్దతును సంపాదించు కున్నారు. మరోసారి పార్లమెంటును కేవలం నామ మాత్రపుప్రదర్శనశాల గా మార్చారు. వక్ఫ్ చట్టాన్ని మొదటిసారిగా 1954లో పార్లమెంటు ఆమోదించింది. అయితే, బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత ముస్లింలలో నెలకొన్న పరాయీకరణ, నిరాశ, నిస్పృహలను పరిగణనలోకి తీసుకుని, అందులో నాటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ప్రభుత్వం యొక్క నిశ్శబ్ద, నిష్క్రియాపాత్రకు ప్రాయశ్చిత్తంగా, కాంగ్రెస్ 1995 వక్ఫ్ చట్టం ద్వారా వక్ఫ్‌ను బలోపేతం చేయడానికి చొరవ తీసుకుంది. వక్ఫ్ బోర్డులకు మరిన్ని అధికారాలు కల్పించింది. 2013లో, వక్ఫ్ ఆస్తులను రక్షించడానికి అందుకు అధికారులను నియమించడానికి వక్ఫ్ బోర్డుకు విస్తృత అధికారాలను మంజూరు చేయడానికి దీనిని మళ్ళీ సవరించారు. ఇప్పుడు, ఈ కొత్త చట్టం ద్వారా, హిందూత్వ ఫాసిస్టులు వక్ఫ్ చరిత్ర మొత్తాన్ని తిరిగి వ్రాసి, ఒకేసారి దానిని బలహీనపరిచారు.

ఈ సవరణ కోసం మోడీ ప్రభుత్వం తరచుగా పదే పదే వినిపిస్తున్న వాదనలు ఏమిటంటే, వక్ఫ్ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వాటిలో అవినీతిని నిర్మూలించాలనే వారి కోరికట. వాస్తవానికి, ముస్లిం మత పండితులు కూడా వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో అవినీతిని తోసిపుచ్చడం లేదు. అయితే, భారతదేశంలో, న్యాయవ్యవస్థతో సహా అన్ని సంస్థలు మరియు పరిపాలనా రంగాలను విస్తరించి ఉన్న అవినీతికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ముస్లిం వ్యతిరేక చట్టాన్ని తీసుకురావడానికి ఇది నిరాధారమైన మరియు సత్తా లేని పసలేని, బిల్లును సమర్ధించుకోవడానికి చేసే డొల్లవాదన . అవినీతిని ఎదుర్కోవడానికి అనేక పరిపాలనా మరియు చట్టపరమైన మార్గాలు ఉన్నాయి. ఇది ప్రత్యేకంగా ముస్లింల యొక్క ప్రశ్నే కాదు. మరియు వక్ఫ్ భూమితో పోలిస్తే, భారత జనాభాలో కేవలం 1.57% ప్రాతినిధ్యం వహిస్తున్న కాథలిక్ చర్చి వక్ఫ్ బోర్డు కంటే చాలా రెట్లు ఎక్కువ భూమిని కలిగి ఉంది. అందువల్ల, మోడీ ప్రభుత్వ వక్ఫ్ చట్టం ప్రత్యక్ష ముస్లిం వ్యతిరేక దాడి. ఇది బంచ్ ఆఫ్ థాట్స్‌లో క్రోడీకరించబడినట్లుగా ముస్లింలను 'శత్రువు నంబర్ వన్'గా లక్ష్యంగా చేసుకోవడంతో మరియు పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ), జాతీయ పౌర పట్టిక (ఎన్.ఆర్.సి), మదర్సా చట్టం, ఏకీకృత పౌర స్మృతి (యూనిఫాం సివిల్ కోడ్ )మొదలైన ముస్లిం వ్యతిరేక చట్టాల శ్రేణిని కొనసాగించడానికి సరిగ్గా సరిపోతుంది. ఇవి ఆమోదించబడ్డాయి. మరియు కొన్ని చట్టాలు వరుస క్రమంలో ఉన్నాయి.

'ట్రస్ట్' అనే పాశ్చాత్య భావనకు ముందే ఉన్న, 12వ శతాబ్దపు సుల్తానేట్ కాలం నాటి 'వక్ఫ్' భారతదేశంలో 'ముస్లిం సంస్కృతి' మరియు గుర్తింపు నుండి విడదీయరాని ఒక ఆచారం, జీవన విధానం. అందువల్ల ఇది, వక్ఫ్ చట్టం ముస్లిం గుర్తింపుపైనే ఒక దుష్ట, 'సాంస్కృతిక జాతీయవాద' మెజారిటీ హిందూ మతోన్మాద దాడి. ముస్లిం భూములు, ఇతర దానధర్మాలను నియంత్రించే చట్టాలను మార్చడం దుర్మార్గమైనది. దీని తక్షణ ప్రభావం ఏమిటంటే, శతాబ్దాలుగా ముస్లింలు విరాళంగా ఇచ్చిన భూమి మరియు ఆస్తులు వివాదాలకు గురవుతాయి. ఇది ముస్లింల స్థావరాలు, దుకాణాలు, మతపరమైన మరియు స్వచ్ఛంద సంస్థలు, అనాథాశ్రమాలు, మసీదులు మరియు స్మశానవాటికల కూల్చివేతకు దారితీస్తుంది. 1995 చట్టం ప్రకారం భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో ఆస్తులను నిర్వహించే 32 వక్ఫ్ బోర్డులలో ప్రభుత్వ నామినీలు, ముస్లిం శాసనసభ్యులు, ముస్లిం మతపండితులు మరియు సంరక్షకులుగా ఉన్నారు. అందరూ ముస్లింలే ఉండాలి అనేది ఆ చట్టంలోని ముఖ్య అంశం. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ యొక్క పని వక్ఫ్ విషయాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహా ఇవ్వడం మరియు భారతదేశం అంతటా రాష్ట్ర స్థాయి వక్ఫ్ బోర్డులను పర్యవేక్షించడం దాని విధి. పైన పేర్కొన్న విధంగా, 2013 సవరణ వక్ఫ్ ఆస్తులకు రక్షణను మరింత బలోపేతం చేసింది. ఆక్రమణకు గురి చేసిన వారికి జైలు శిక్షను ప్రవేశపెట్టింది . వక్ఫ్ ఆస్తుల అమ్మకం, బహుమతి, మార్పిడి, తనఖా లేదా బదిలీని స్పష్టంగా నిషేధించింది.

కొత్త చట్టంలో ఈ నిబంధనలన్నీ పక్కన పెట్టబడ్డాయి. ముస్లిం ఆస్తుల రక్షణకు నిబంధనలు బలహీన పరచ చేయబడ్డాయి. లేదా కొత్త వక్ఫ్ చట్టంలో పూర్తిగా ఈ విషయాలన్నీ తిరగబడ్డాయి. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 యొక్క తీవ్ర ఉల్లంఘన. ఇది మైనారిటీలు మతపరమైన మరియు దాతృత్వ సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి మరియు నడపడానికి అనుమతిస్తుంది. ఇక్కడ రాష్ట్రం అటువంటి విషయాలలో జోక్యం చేసుకోవడానికి అనుమతించబడలేదు. ఈ అంశాలకు సంబంధించి, ఉమ్మడి పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అసమ్మతి మరియు విభేదాల నోటులను, గమనికలను పూర్తిగా తొలగించారు. మరియు బిల్లును పార్లమెంటు ముందు ఉంచినప్పుడు, అధికార పార్టీ 1995 చట్టానికి ప్రతిపాదించిన 40 సవరణలన్నీ కూడా యథేచ్ఛగా ఉంచబడ్డాయి.

ఖచ్చితంగా చెప్పాలంటే, భారత రాజ్యాంగ స్వభావాన్ని మార్చిన ఆర్థిక రిజర్వేషన్ ( ఆర్థికంగా బలహీనపడిన వర్గాలు- ఈ డబ్ల్యు ఎస్) విషయంలో లాగానే, యు ఎం ఈ ఈ డి(%ఖవీజుజుణ% )అని పిలువబడే వక్ఫ్ సవరణ చట్టం భారత రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణంపై మరొక దాడి. ముస్లిం సమాజం వారి భూమి మరియు ఆస్తులను లాక్కోవడానికి ఉద్దేశించబడింది. ఇది అన్ని అక్రమ ఆక్రమణదారులు ముస్లిం ఆస్తిని తమదిగా క్లెయిమ్ చేసుకునే అవకాశాలను తెరుస్తుంది. ఇది ముస్లిం సమాజం వారి సంస్థలను నిర్వహించే రాజ్యాంగ హక్కును తొలగిస్తుంది. అందువల్ల, హిందూరాష్ట్ర ఎజెండాలో భాగమైన ఈ ఫాసిస్ట్ చర్యను అన్ని లౌకిక-ప్రజాస్వామ్య శక్తులు దృఢంగా ఖండించాల్సిన సమయం ఆసన్నమైంది . అత్యంత అణగారిన ముస్లిం సమాజంతో సంఘీభావంగా నిలబడాలి. మరియు, ఈ ఫాసిస్ట్ చర్యను రద్దు చేయడానికి అవసరమైన అన్ని మార్గాలను ఆశ్రయించడానికి అన్ని ఫాసిస్ట్ వ్యతిరేక శక్తుల వైపు నుండి ముస్లిం సమాజానికి అండగా ఈ చట్టం రద్దు చేయాలనే డిమాండ్ నుండి ఎటువంటి పరిస్థితుల్లో వెనుదిరగకూడదు.

**పి జె జేమ్స్**
**జనరల్ సెక్రటరీ**
**సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్**
**న్యూ ఢిల్లీ**

తెలుగు స్వేచ్ఛానుసరణ
**మన్నవ హరిప్రసాద్,**
**పొలిట్ బ్యూరో సభ్యుడు సిపిఐ (ఎం.ఎల్)**
**రెడ్ స్టార్, 824728296**


# "ఆర్థిక, వాణిజ్య రంగాల్లో క్షీణిస్తున్న అమెరికా -ఫ్రాన్స్ సంబంధాలు"

**యూరప్, ప్రపంచ దేశాలపై ప్రభావం.**

సుంకాలు విధించే ప్రక్రియ ముగిసే వరకు అమెరికాలో పెట్టుబడులను నిలిపివేయాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మక్రాన్ డిమాండ్ చేశారు. యూరోపియన్ యూనియన్ నుంచి దిగుమతులపై 20శాతం సుంకం సహా అమెరికా వాణిజ్య భాగస్వాములపై అధ్యక్షుడు ట్రంప్ కొత్త సుంకాలను విధించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"గత వారాల్లో ప్రకటించిన భవిష్యత్తు పెట్టుబడులు, యునైటెడ్ స్టేట్స్ తో పరిస్థితి స్పష్టం కానంతకాలం తత్కాలికంగా నిలిపివేయాలి" అని మా క్రాన్ ఫ్రెంచ్ మంత్రులు, ప్రధాని ఫ్రాంకోయిస్ బెరూ పాల్గొన్న ఫ్రెంచ్ కంపెనీల సమావేశంలో అన్నారు. ట్రంప్ టారిఫ్ ప్రకటన తర్వాత అమెరికన్లు "బలహీనంగా, పేదవారు" అవుతారని మక్రాన్ అంచనా వేశారు. ఇది క్రూరమైనది మరియు నిరాధారమైనది" ఇది యూరోపియన్ ఆర్థిక వ్యవస్థ పై"భారీ ప్రభావాన్ని" చూపుతుందని ఆయన అభివర్ణించారు. ఐరోపా తమ ప్రతిస్పందన పరంగా ఏకతాటిపై నిలవాలని, ఏక పక్ష చర్యలకు వ్యతిరేకంగా హెచ్చరించాలని ఆయన పిలుపు నిచ్చారు.

"యూరోపియన్ ప్రతిస్పందన" "రెండు దశల్లో" వస్తుందనే ఫ్రెంచ్ ప్రభుత్వ వైఖరిని మక్రాన్ పునరుద్ఘాటించారు. ఉక్కు అల్యూమినియంపై ఇప్పటికే అమల్లో ఉన్న అమెరికా సుంకాలను పరిష్కరించడానికి ఒకటి ఏప్రిల్ మధ్యలో వస్తుంది. రెండోది ఏప్రిల్ నెలాఖరులో ఉంటుందని, ప్రభావితమైన రంగాలపై అధ్యయనం, ఈయు సభ్య దేశాలతో సమన్వయం తర్వాత ప్రకటించిన టారిఫ్ లకు మరింత భారీ స్పందన వస్తుందని పేర్కొంది.




**"ప్రపంచం పునర్వ్యవస్థీకరించబడుతుంది"**

ఈ సమావేశం అనంతరం ఫ్రెంచ్ ఎంప్లాయర్స్ ఫెడరేషన్ మెడెఫ్ అధిపతి ఫ్రెడరిక్ మార్టిన్ మాట్లాడుతూ పరిస్థితి చాలా తీవ్రంగా ఉందన్నారు. "ప్రపంచం పునర్వ్యవస్థీకరించబడుతుంది. వాణిజ్యం సంబంధాలు చాలా క్రూరంగా మారిపోతున్నాయి. బెదిరింపులు పేరుకుపోతున్నాయి. యూరోపియన్, అలాగే ఫ్రెంచ్ స్థాయిలో సరళీకరణను పోటీతత్వాన్ని వేగవంతం చేయాల్సిన సమయం గతంలో కంటే ఎక్కువగా వచ్చింది" అని అందరూ అంగీకరించారు. మక్రాన్ పిలుపును ప్రతిధ్వనిస్తూ,డజన్ల కొద్దీ ప్రధాన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న బిజినెస్ గ్రూప్ ఫ్రాన్స్ ఇండస్ట్రీస్, యూఎస్ టారిఫ్ ల తో ప్రభావితమైన ఫ్రెంచ్ తయారీదారులు యూఎస్ లో పెట్టుబడి ప్రాజెక్టులను నిలిపివేయడంతో సహా, ఏదో ఒక విధంగా వెనక్కి తగ్గడాన్ని పరిగణించాలని అన్నారు.

"బలమైన స్థానం నుండి చర్చలు జరపటానికి మేము మా వద్ద ఉన్న అన్ని లివర్లను ఉపయోగించడానికి సిద్ధంగా ఉండాలి" అని గ్రూప్ అధ్యక్షుడు అలెగ్జాండర్ సౌబోట్ అన్నారు. ఫ్రాన్స్ విదేశీ భూభాగలపై వేరువేరు సుంకాలు విధించాలన్న అమెరికా నిర్ణయాన్ని ఫ్రెంచ్ ఓవర్సీస్ మంత్రి మాన్యువల్ వాల్స్ "లోతైన రాజకీయ" చర్యగా అభివర్ణించారు. ఇది "అస్థిరతలు, అసంబద్ధతలు, అసమర్ధతల సేకరణను" బహిర్గతం చేస్తుంది.

ట్రంప్ టారీఫ్ బ్లిట్జ్ తర్వాత ప్యారిస్ స్టాక్ మార్కెట్ గురువారం మూడు శతానికి పైగా నష్టపోయింది. ఇది రెండేళ్లలో అతిపెద్ద రోజు వారీ క్షీణత. ట్రంప్ ప్రకటనలు అంతర్జాతీయ వాణిజ్యం యొక్క ప్రాథమిక నియమాలను పేల్చివేస్తాయని, అయితే ఈయూ ప్రతిపాదించడానికి బాగా సన్నద్ధంగా ఉందని సెంటర్ ఫర్ ప్రాస్పెక్ట్ స్టడీస్ అండ్ ఇంటర్నేషనల్ ఇన్ఫర్మేషన్ ఆర్థికవేత్త విన్సెంట్ వికార్డ్ ఏఎఫ్పీ తో అన్నారు. ఇతర చర్యలతో పాటు ఈయూ దేశాలు వస్తువులు మరియు సేవల దిగుమతులను తగ్గించ వచ్చుని,అమెరికన్ కంపెనీలకు మార్కెట్ ప్రాప్యతను తగ్గించవచ్చునని లేదా కొన్ని కంపెనీలకు ఆస్తి హక్కులను కూడా నిలిపివేయవచ్చునని వికార్డ్ తెలిపింది .

యూఎస్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ ఎనాలసిస్ (బీఇఏ) ప్రకారం, 2023లో యునైటెడ్ స్టేట్స్ లో ప్రత్యక్ష ఫ్రెంచ్ పెట్టుబడులు 370 బిలియన్ డాలర్లు, ఇది దేశంలో 5వ అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారుగా ఉంది.అదే ఏడాది ఫ్రాన్స్‌లో అమెరికా ప్రత్యక్ష పెట్టుబడులు 142 బిలియన్ డాలర్లకు చేరాయని ఫ్రాన్స్ సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. తయారీ రంగానికి ఇవి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఫ్రాన్స్ ట్రెజరీ తెలిపింది. అమెరికాలో ఫ్రెంచ్ కంపెనీలకు చెందిన 4,200కు పైగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయని ఫ్రాన్స్ లోని అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఏ.ఎఫ్.పీ.కి తెలిపింది. 7,41,000 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు బీఈఏ తెలిపింది.

మొత్తం మీద అమెరికా విధిస్తున్న టారిఫ్ ల జడివాన అమెరికా -ఫ్రాన్స్ ఆర్థిక, వాణిజ్య సంబంధాలను దెబ్బ తీయటమే కాకుండా మొత్తం యూరోపియన్ దేశాలతో పాటు, ఇతర ప్రపంచ దేశాల ఆర్థిక, వాణిజ్య రంగాలకు పెను తుఫానులా చుట్టుముట్టి కలవరపాటుకు గురిచేస్తూ ఉంది. చివరకు అమెరికా ఆర్థిక, వాణిజ్య రంగాలు కూడా ఈ తుఫానులో కొట్టుకుపోవటం అనివార్యం అని విశ్లేషకుల అభిప్రాయం.



**డాక్టర్ కోలాహలం**
**రామ్ కిశోర్**
**9849328496.**

## నిశీథి....

గాఢంపు ద్వాంతా పరిష్వంగమై..
ఎందుకో.... ఇంత గాఢ నీల పంకము
కురిసినా. ..... నీ స్మృతుల తావుల
తావులు వ్యర్థమై ...వ్యస్తమై...
అందని ఏ ఆలింగనాల అనుభూతినో
వెదకాలని యత్నిస్తూ...
ఎదురవని ఏ ఆలంబననో
మది సేద దీర్చు ఏ పిలుపునో వినాలని
కలవాలని.. గెలవాలని ప్రేరేపిస్తూ...
ఆచూకి అందని స్వప్న సౌరభాల
ముంచుతూ....
ఎదద స్వస్థ స్థితిని కలవరపరుస్తూ...
కలతను నెడుతూ..
ఏకతపు శాంతిని కబళిస్తూ
గ్రీష్మ గానం వినిపిస్తూ.. ప్రేమ నిండిన ఎదను
స్పందనా రవళిని నినదించనీ అని బోధిస్తూ
కమ్ముతూ .... నీలిమేఘాలు
నిట్టూర్పుల అగరుల కాల్చుతూ.....
నీవు నాలా అంటూ
నిరాశా నిర్లిప్తతల తోస్తూ
వేకువ వెలుగుల
వాకిలి ముద్దాడనీయక
ఎందుకో.. ఈ రాతిరి
ఇంతగా. .. బాధిస్తూ.. వేధిస్తూ
బ్రతుకును...
మనసును మధిస్తూ...

**రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి**

# రాజకీయ నాయకులకు ఆదర్శం బాబు జగ్జీవన్ రామ్

- 50 ఏళ్లు చట్టసభల్లో సేవలందించిన మహనీయుడు
- తెలంగాణలో అన్ని వర్గాలకు సమన్యాయం
- ఎస్సీ బీసీల కోసం రెండు బిల్లులు
- తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** చిన్నతనంలోనే అంటరానితనాన్ని, కుల వివక్షను ధైర్యంగా ఎదిరించిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ గారి 118వ జయంతి సందర్భంగా శనివారం వికారాబాద్ పట్టణంలోని బిజేఆర్ చౌరస్తాలో గడ్డం ప్రసాద్ కుమార్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఏర్పాటుచేసిన సభలో సభాపతి గడ్డ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... బాబుజగ్జీవన్ రామ్ బీహార్ లోని చిన్న గ్రామంలో పుట్టి దేశ స్థాయిలో అత్యున్నత పదవులను అలంకరించారన్నారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా, అన్ని వర్గాలను కలుపుకొని సమాజంలో ముందుకెళ్లాలన్నారు. సాంఘిక అసమానతలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నేటి యువతరానికి మహనీయుల జీవిత చరిత్ర తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా యువత లబ్ధి పొందాలని కలెక్టర్ సూచించారు. 6డాక్టర్ బాబు జగ్జీవన్ జయంతి ఉత్సవాల్లో జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద పటేల్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, జయంతి ఉత్సవాల అధ్యక్ష , కార్యదర్శులు రమేష్, పెద్ది అంజి, జిల్లా అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మండలంలోని బద్దం సురేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో శనివారం ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి మరియు సేంద్రియ వ్యవసాయంపై రైతులకు మరింత అవగాహన గాను రంగారెడ్డి మరియు వికారాబాద్ జిల్లాల నుండి అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మరియు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో శాస్త్రీయంగా ఆర్గానిక్ పద్ధతులు అవలంబించాలని తెలిపారు.ఆధునిక పద్ధతిలో ముందుకు సాగుతూ ఉత్పత్తి చేసే విధంగా యువకులు ముందుకు రావాలని తెలియజేశారు. వ్యవసాయానికి డిగ్రీ పట్టాలు అవసరం లేవని చదువు లేని వారు కూడా సేంద్రియ వ్యవసాయం చేసి అభివృద్ధి చెందవచ్చు అని సూచించారు.ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు వాడకం పెరగడంతో భూసారం దెబ్బతింటుందని భూమి ఆరోగ్యాన్ని కాపాడడానికి మన పూర్వీకులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులే అనుసరించారని వివరించారు.ఈ ప్రకృతి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి ఏకలవ్య ఫౌండేషన్ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వలన క్యాన్సర్,లివర్ పాడవడం వంటి రోగాలు ఉత్పన్నమవుతున్నాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, అఖిలభారత కార్యకారిణి సదస్సులు (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ) వి భాగయ్య, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఐ కార్ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన లగచర్ల సురేష్ రాజ్



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును శనివారము ఎర్రవెల్లి ఫాం హౌస్ లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తో కలిసి దుద్యాల మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు లగచర్ల సురేష్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

# చెరువులో గల్లంతైన వ్యక్తుల మృతదేహాలు లభ్యం





**హత్నూర, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మండలంలోని బోర్పట్ల గ్రామ సమీపంలో గల భీముని చెరువులో ఈతకు వెళ్లి ఊపిరాడక నీట మునిగి గల్లంతైన ప్రేమ్ కుమార్ (36),డప్పు నవీన్ (26)ల మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి.శుక్రవారం గజ ఈతగాళ్ల సహాయంతో చీకటి పడే దాకా ఎంత గాలించినా డెడ్ బాడీల జాడ కనిపించలేదు.దీంతో శనివారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి శవాలను వెలికి తీశారు.ప్రేమ్ కుమార్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉండగా,నవీన్ కు భార్య ఉంది.శవ పరీక్ష నిమిత్తం మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతుడు డప్పు నవీన్ సోదరుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

# నేడే సీతారాముల కళ్యాణ మహోత్సవం

- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు



**రాయికోడు, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ముహూర్తం సిద్ధమైంది. మండలంలోని ఇటికేపల్లి, సంగాపూర్ గ్రామాలలోని శ్రీ రామ ఆలయంలో మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గత వారం రోజుల నుండి సంగాపూర్, ఇటికపల్లి లోని దేవాలయాలలో సప్తహ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలలో వివిధ గ్రామాలలోని భజన మండలి కళాకారులు, భక్తులు పాల్గొని రాత్రులంతా జాగరణలు చేశారు. ఈనెల 5న నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఆయా గ్రామాల్లోని భక్తులందరూ సకాలంలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

# యువత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** యువత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ను ఆదర్శంగా,స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంటరాని వారికి తన జీవితాన్ని అంకితం చేశారని, అందరూ సమానంగా ఉండాలని, అంటరానితనమన్నదే ఉండకూడదని, అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారన్నారు. వ్యవసాయ, రక్షణ శాఖ మంత్రిగా,ఉప ప్రధానిగా ఎన్నో మార్పులను తీసుకొచ్చారని, ప్రత్యేకించి వ్యవసాయంలో హరిత విప్లవానికి కృషి చేశారన్నారు. నేడు దేశంలో ఎగుమతులు ఉన్నత స్థాయిలో ఉన్నాయంటే దానికి కారణం జగ్జీవన్ రామ్ అని అన్నారు.జగ్జీవన్ రామ్ కూతురు మీరా కుమార్ లోక సభ స్పీకర్ గా తెలంగాణ బిల్లును పాస్చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎలాంటి వనరులు లేని బీహార్ లాంటి అత్యంత వెనుకబడిన"ఆరా"ప్రాంతం నుండి వచ్చిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంచలంచలుగా ఎదుగుతూ భారత ఉప ప్రధానిగా అయ్యారని,వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని, ప్రతి ఒక్కరూ వారి వ్యూహాన్ని నేర్చుకోవాలన్నారు. గంగ పరివాహక ప్రాంతంలో గ్రీన్ రెవల్యూషన్ తీసుకురావడంలో ఆ ప్రాంతాన్ని వీట్ బౌల్ గా ఎలా చేయాలో అన్న విషయమై ఆయన చేసిన అధ్యయనం గొప్పదన్నారు.ఆయన సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని కోరారు.వ్యవసాయ శాఖ మంత్రిగా,రక్షణ శాఖ మంత్రిగా,ఉప ప్రధానిగా తన స్పష్టమైన మార్పు చూయించారన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త,స్వాతంత్ర సమరయోధుడని,ప్రతి ఫోర్టు పోలియోలో తనదైన ముద్రను వేశారన్నారు.దళిత వర్గాల్లో ఆయన చేసిన కృషి మరువలేనిదని,ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.ఈ సందర్భంగా వారు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి,ఘనంగానివాళులర్పించారు.అంతకుముందు మర్రిగూడ చౌరస్తాలో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్,చక్రహరి రామరాజు,మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య,దున్న యాదగిరి,బుర్ర సుధాకర్ తదితర దళిత నాయకులు మాట్లాడారు.అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బాబు జగ్జీవన్ జయంతి సందర్భంగా కలా ప్రదర్శన ఇచ్చారు.

# బీసీ సమాజ్ నియోజకవర్గ కన్వీనర్‌గా నాగోజి



**జడ్చర్ల, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** బీసీ సమాజ్ జడ్చర్ల నియోజకవర్గ కన్వీనర్ గా మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన నాగోజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో జరిగిన సమావేశంలో బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం. శ్రీనివాస్ సాగర్ నాగోజిని నియోజకవర్గ కన్వీనర్‌గా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు ఉన్నారు.

# మహనీయుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- బీఎస్పీ జిల్లా ఇన్చార్జి బి.యోసేపు



**చారకొండ, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** ఈ నెల 26న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరగబోయే జ్యోతిరావుపూలే, అంబేద్కర్, కాన్షిరాం మహనీయుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్చార్జి బి.యోసేపు అన్నారు మండల కేంద్రంలో మహనీయుల జాతర కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రామన్న, అచ్చంపేట అసెంబ్లీ ఇన్చార్జి ఉల్పర కృపానందము, అసెంబ్లీఅధ్యక్షులు జి.మల్లయ్య, అసెంబ్లీ ఉపాధ్యక్షులుఎం.శ్రీను, చారకొండ మండల అధ్యక్షులు పోతుగటి మహేందర్, రాజేష్, పరమేష్ .రమేష్.శివ. రాకేష్ వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు . అంతకుముందు శిరసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# క్యారంలో భార్గవికి బంగారు పతకం



**జహీరాబాద్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ లో జరిగిన ఐఐటి అంతరాష్ట్ర క్రీడా పోటీలలో క్యారం బోర్డులో జహీరాబాద్ పట్టణమునకు చెందిన ఎలుగొండ వెంకటేశం కుమార్తె ఎలుగొండ భార్గవి బంగారు పతకం సాధించారు .తమిళనాడు రాష్ట్రంలోని తిరుచి ఐఐటిలో భార్గవి చదువుతున్నారు. మొట్టమొదటిసారిగా బంగారు పతకం సాధించిన భార్గవికి జహీరాబాద్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా భార్గవి ఇంకా అనేక బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 50 ఆకుల తునికాకు కట్ట రేటు రూ.3.31 పైసలుగా ఖరారు



**గుండాల, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** గిరిజనులు అత్యధికంగా సేకరించే తునికాకుకి ఈ ఏడాది 50 ఆకుల కట్టకు రేటు నిర్ణయించడం జరిగింది. గత ఏడాది 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3.03 పైసలు ఉండగా ఈ ఏడాది రూ.3.31 పైసలుగా ధర నిర్ణయించారు. గుండాల మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో శనివారం తునికాకు రేటు పై కార్మికులు, తునికాకు పోరాట కమిటి, కాంట్రాక్టర్ల మధ్య చర్చలు జరిగాయి. గత ఏడాది ప్రభుత్వం ధర రూ.3 లు ఉండగా, ఈ ఏడాది ప్రభుత్వం ధర రూ.3.30 పైసలు పెంచింది. ఈ ఏడాది కాంట్రాక్టర్లు రేటు పెంచాలని పోరాట కమిటి డిమాండ్ చేశారు. చర్చల అనంతరం కాంట్రాక్టర్లు రూ.01పైసలు పెంచారు. దీంతో తునికాకు 50 ఆకుల తునికాకు కట్టకు ధర రూ.3.31 పైసలుగా నిర్ణయిచారు. కల్లేదార్ల కమీషన్, హ్యాండ్లింగ్ చార్జీలు గతంలో వెయ్యి కట్టకు రూ.332.75 పైసలు లు ఉండగా, 10శాతం పెంచుతూ ఈ ఏడాది రూ.366.02పై.లు పెంచారు. దీనిలో కల్లెదార్ల కమీషన్,కల్లాల్లో అమలు జరుగుతాయని ఆ కమిటి సభ్యులు తెలిపారు. ఈ చర్చల్లో కాంట్రాక్టర్లు రమేష్ రెడ్డి, మంతజిములు సయ్యద్ అజ్జు, ఖుద్దూస్, తునికాకు పోరాట కమిటి అధ్యక్షులు గుంపిడి వెంకటేశ్వర్లు, చిన చంద్రన్న, సీపిఐ నాయకులు రేసు ఎల్లయ్య, రమేష్, న్యూడెమోక్రసి నాయకులు ముక్తి సత్యం, ఆవునూరి మధు. కోరం సీతారాములు, ప్రజాపంథ పార్టీ నాయకులు కొమరం శాంతయ్య, చంద్రన్న వర్గం నాయకులు బానోత్ ఊక్లా, తుడుందెబ్బ నాయకులు గుంపిడి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీ నాయకులు సైదులు. గోపన్న, కొమరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లా నేతల భేటీ

- బీఆర్ఎస్ రజతోత్సవానికి సన్నాహక సమావేశం



**వనపర్తి, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌తో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులు శనివారం ఎర్రవెల్లి ఫామ్ హౌజ్‌లో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ రజతోత్సవ నిర్వహణపై జరగాల్సిన జన సమీకరణ తదితర ఏర్పాట్ల గురించి చర్చించినట్లు నేతలు వెల్లడించారు ఈ సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వి.శ్రీనివాస్ గౌడ్,చర్లాకోల లక్ష్మారెడ్డి,మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి,ఆలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, మర్రి జనార్ధన్ రెడ్డి, భీరం హర్షవర్ధన్ రెడ్డి, కె. రామ్మోహన్ రెడ్డి, ఆల వెకటేశ్వర్, రాజేందర్ రెడ్డి వనపర్తి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ కార్మిక భవనం మంజూరు చేయాలి

- జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరికి సీపీఐ వినతి



**చేర్యాల, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** హమాలీ కర్మికుల సంక్షేమం కోసం గ్రామంలో కార్మిక భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జనగామ డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గ్రామంలో పర్యటించిన సందర్భంగా శనివారం ఆకునూరు గ్రామ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. హమాలీ వృత్తిని నమ్ముకొని ఆకునూరు గ్రామంలో సుమారు 90 మంది హమాలీ కార్మికులు జీవనం సాగిస్తున్నారని, సేద తీరడం కోసం భవనం లేక ఎండ, వర్ష, చలి కాలాల్లో సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోరగా సానుకూలంగా స్పందించిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి భవనం నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారికి కార్మికులు కృతజ్ఞతలు తెలియజేస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, కార్మిక సంఘం నాయకులు ఉడుత సత్యనారాయణ, బోయిని రాజు, కడారి కనకయ్య, కోయినేని యాదయ్య, కడారి నర్సింహులు, బోయిని మల్లేశం, కోయినేని మహేందర్, రేసు యాదగిరి, పోషబోయిన శ్రీకాంత్, ఉడుత మహేందర్, ముచ్చాల నర్సింహులు, బోయిని యాదగిరి, గూడూరు శ్రీను, బూర్గుల వీరయ్య, కడారి రాజు, ఎర్ర అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఈద్ మీలాప్‌లో టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** సదాశివపేట పట్టణంలో ఎస్ఏ గార్డెన్ లో జమాతే ఇస్లామి హిందూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మౌలికల సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా, వారితో పాటు సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, ఖలేద్ ముభాషీర్ జమైతే ఇస్లామిక్ రాష్ట్ర అధ్యక్షుడు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ పాల్గొన్నారు. రంజాన్ మాసం తర్వాత జమాతే ఇస్లామిక్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈద్ మిలాప్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ముస్లిం, మైనార్టీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జమాతే ఇస్లామిక్ అధ్యక్షుడు అశ్వక్ హుస్సేన్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు అక్బర్ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి సత్యనారాయణ,మాజి మున్సిపల్ కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, నాయకులు పట్నం సుభాష్, జంగం మహేష్ పంతులు, పాస్టర్ గిరి ప్రసాద్, మైనారిటీ నాయకులు, పట్టణ ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- మిషన్ భగీరథ వాటర్ మెన్‌లకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక
- వాటర్‌మెన్‌ల కారణంగా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించిన ఎమ్మెల్యే



**జడ్చర్ల, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రజలకు త్రాగునీటిని సరఫరా చేసే విషయంలో నిర్లక్ష్యం వహించే వాటర్ మెన్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి హెచ్చరించారు. గతంలో కూడా హెచ్చరికలు చేసిన తమ వైఖరిని మార్చుకోని వాటర్ మెన్ లను విధుల నుండి తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించడానికి కూడ వెనకాడబోమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వేసవి కాలంలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో త్రాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూసుకోవల్సిన బాధ్యత మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది పైనే ఉందని చెప్పారు. శనివారం క్యాంపు కార్యాలయం నుండి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మిషన్ భగీరథ వాటర్ మెన్‌ల పనితీరుపై తమకు ఇప్పటికే అనేక ఫిర్యాదులు అందాయని తెలిపారు. కొంతమంది వాటర్ మెన్ లు సకాలంలో నీటిని విడుదల చేయకపోవడం, నిర్ణీత వేళలలో తగినంత సమయం నీటి సరఫరా చేయకపోవడం వల్ల పలు గ్రామాలలో ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతాలలో ప్రజలకు తక్కువ నీటిని సరఫరా చేసి తమకు కావాల్సిన పరిశ్రమలకు ఎక్కువ నీటిని పంపిణీ చేస్తున్నట్లు కూడా ఫిర్యాదులు అందాయన్నారు. ప్రత్యేకించి బాలానగర్, జడ్చర్ల మండలాల్లో వాటర్ మెన్ లపై ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వాటర్ మెన్‌లను ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం ఉన్నా మానవతా దృక్పథంతో తాము ఆ పని చేయలేదన్నారు. అయితే ప్రస్తుతం వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వాటర్ మెన్ ల కారణంగా ప్రజలు నీళ్ల కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తే మాత్రం తాను సహించేది లేదని హెచ్చరించారు. ఇకనైనా వాటర్ మెన్ లు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, నిర్ణీత వేళలలో నీటిని సరఫరా చేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కాగా మిషన్ భగీరథ వాటర్ మెన్ ల కారణంగా ఎక్కడైనా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడి నీళ్ల కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఉంటే ప్రజలు జడ్చర్ల లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని, మిషన్ భగీరథ అధికారులు కూడా నీటి సరఫరాను, వాటర్ మెన్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.

## ఇందిరమ్మ నమూనా గృహాన్ని పరిశీలించిన కలెక్టర్



**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని శనివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలు అతి తక్కువ ఖర్చులో అత్యాధునిక హంగులతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని చేసుకోవచ్చునని వారు సూచించారు. వనపర్తిలో గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ (నమూనా గృహాన్ని) సందర్శించి ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు అని ఎమ్మెల్యే సూచించారు. వారితోపాటు డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** పేద ప్రజల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని కీమ్యాతాండలో శనివారం గిరిజనులతో కలిసి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి భోజనం చేసి మాట్లాడారు. గతంలో పంపిణీ చేసి దొడ్డు బియ్యం ప్రజలు తినకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవడం కాకుండా పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చి ప్రతి సంక్షేమ పథకం పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నారు. ఉచిత సన్న బియ్యం పథకం ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. సన్న బియ్యం పంపిణీలో ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం భోజనం చేస్తూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసి సన్నబియ్యంతో వండిన అన్నం ఎలా ఉందని గిరిజన మహిళలను అడుగ్గా చాలా బాగుందని సంతోషం వ్యక్తం చేశారు



కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సామ యాదయ్య, కాంగ్రెస్ నాయకులు హరీష్ రెడ్డి, రామచందర్ నాయక్, హర్యానాయక్, మార్కెట్ డైరెక్టర్ వాల్యానాయక్, మాన్యనాయ బిక్, మండల అధ్యకుడు మిద్దె రాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు గంగనమోని తిరుపతయ్య, అమృత్ రెడ్డి, కూచకుళ్ల వెంకట్ రెడ్డి, వెంకటస్వామి, అమర్ నాయక్, వీరేందర్ వెంకటేష్ గౌడ్, రాజేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# సమ సమాజ దార్శనికుడు బాబు జగ్జీవన్ రామ్

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** సమసమాజ దార్శనికుడు బాబు జగ్జీవన్ రామ్ అని, ఆయన జీవితా న్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా యక్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్ లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో పాటు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ముఖ్య అతిథిలుగా హాజరై జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ స్వాతంత్ర్య సమరమోధుడిగా, ఉప ప్రధానిగా, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడి న సమ సమాజ దార్శనికు డిగా జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు మహోన్న తమైనవని కొనియాడారు. చిన్ననాటి నుంచే వివక్షను ఎదుర్కొన్న ఆయన కుల వివ క్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఉమాపతి, డి.ఎస్.పి నల్లపు లింగయ్య, డిఆర్డిఏ మొగులప్ప, డీ పిఆర్ ఓ ఎం.ఏ రషీద్, ఎస్సీ కార్పొ రేషన్ ఈ డి అబ్దుల్ ఖలీల్, ఏఓ జాన్ సుధాకర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు, దళి త సంఘాల నాయకులు మహేష్, శరణప్ప, రమేష్, వెంకటేష్, సత్యనారాయణ, సూర్యకాంత్, గడ్డం కృష్ణ య్య, వసతి గృహాల వార్డెన్లు, కలెక్టరేట్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఊరుకొండపేట లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ సాగర్



**జడ్చర్ల, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** ఊరుకొండ పేట లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళపై జరిగిన సామూహిక లైంగిక దాడి ఘటనను బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు మోడల శ్రీనివాస్ సాగర్ అన్నారు. శనివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవిత్రమైన దేవాలయ పరిసరాలలో జరిగిన ఈ ఘటన యావత్తు సమాజం జీర్ణించు కోలేకపోతుందనీ, ఊర్కొండపేట దేవాలయ ప్రాంగణంలో మరుగుదొడ్లు సక్రమంగా లేనందున, మహిళ కాలకృత్యాల కోసం సమీప ప్రాంతంలోకి వెళ్లగా లైంగిక ఘటన జరగడం బాధాకరమని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. రజక సంఘం సీనియర్ నాయకులు నడిమింటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంకొకరు ఇటువంటి లైంగిక దాడులు చేయాలంటనే భయపడే విధంగా పోలీసులు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పోలేపల్లి మాజీ సర్పంచ్ బాలస్వామి గౌడ్, బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్ ఆంజనేయులు, సామాజిక సేవకులు అంబాదాస్, రాఘవేందర్, తిరుపతయ్య గౌడ్, మహబూబ్ నగర్ పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అశ్విని సత్యం, వీరప్ప, చెరుకుల శంకర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ పేద కుటుంబలకు వరం

- టీజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సదాశివపేట, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రం నాశనమైందని, కమిషన్లతో మూటలు నింపుకున్నారే తప్ప అభివృద్ధి చేయలేదని టీజీఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సదాశివపేట మండల పరిధిలోని ఎల్లారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ లబ్ధిదారుల ఇంట్లో వండిన సన్న బియ్యం అన్నాన్ని లబ్ధిదారులతో కలిసి భుజించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మన ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికే సంక్షేమ పథకాలు చేరవేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రజలు పురుగులు అన్నం తిన్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్న బియ్యం పంపిణీ చేపట్టామని, దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆనందం వెల్లి విరుస్తుందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే కాకుండా కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి



ఒక్కరికి 6 కిలోల చొప్పున చౌక ధర దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి,మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధాన్న,సీఐ మహేష్ గౌడ్,మాజి ఎంపీటీసీ శ్రీనివాస్,నాయకులు బిట్ల ప్రేమ్, షఫీ నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యజ్ఞయాగాదుల వల్ల సకాలంలో వర్షాలు

**మల్దకల్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** యజ్ఞ యాగాదులు చేయడం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు సుభిక్షంగా పండుతాయని రుత్వికులు తెలిపారు. గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ ఆంజనేయ లక్ష్మణ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో శనివారం రెండవ



రోజు గణపతి హెూమం, బ్రహ్మాది మండల హెూమం, యోగిని మండల హెూమం,వాస్తు మండల హెూమం, పాలికా మండల హెూమం, నవగ్రహ హెూమం, ఆవాహిక దేవత మూలమంత్ర హెూమ, హవన పవమాన హెూమం, జపా క్షీరతర్పణ, మంగళహారతి తీర్థప్రసాద కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం విగ్రహాలకు ధాన్యాధివాసం, సెయ్యాది వాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు రమేష్ చారి, శశాంక దాస్, ప్రసన్న, నరేష్, ప్రాణేష్, రాఘవేంద్ర దాస్, గ్రామస్తులు నాగేష్, చక్రధర్ రెడ్డి దంపతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హెూంమంత్రి వ్యాఖ్యలకు కాంగ్రెస్ శ్రేణుల నిరసన



**న్యాల్‌కల్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కు అవమానపరిచే విధంగా కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఏఐసీసీ పిలుపు మేరకు శుక్రవారం న్యాల్ కల్‌లో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కె. భాస్కర్ రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, తిరుపతి రెడ్డి, శామ్యూల్, శ్రీనివాస్ రెడ్డి, శాంత కుమార్ పాటిల్, అడివప్ప, శ్రీనివాస్ రెడ్డి, సురేష్, గుణవంతు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ సెల్ స్పెషల్ క్యాంప్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



**రేవల్లి, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** గోపాల్ పెట్ మండల కేంద్రంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తి ఎన్ ఎస్ ఎస్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా శనివారం గోపాల్ పేట్ ఎస్ఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో "స్వచ్ఛభారత్" కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రక్కల, హనుమాన్ల గడ్డ, బొడ్రాయి ఏరియా, రామాలయ దేవాలయ ప్రాంగణంలోని ప్రాంతాల అన్నింటినీ శుభ్రపరిచారు. భోజనం అనంతరం వాలంటీర్స్ అందర్నీ జాతీయ సేవ లో కార్యోన్ముఖులు చేయడానికి 'విద్యార్థి దశ -సామాజిక సేవ' అనే అంశంపై ప్రోగ్రాం ఆఫీసర్స్ పోతురాజు శ్రీనివాస్, యువరూప లక్ష్మి, వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సామాజిక అంశాలపై, మూఢ విశ్వాసాలు నమ్మకాలపై, బాల్య వివాహాలు వాటి అనార్థాలపై, విద్య దాని ప్రాధాన్యతపై వాలంటీర్స్ కి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొనడం జరిగింది.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**మక్తల్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** పేకాట స్థావరంపై పోలీసుల దాడి చేసిన సంఘటన ఊట్కూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం ఉట్కూరు మండల శివారులో కొంతమంది డబ్బులు పందెం పెట్టుకుని పేకాట ఆడుతుండగా పక్క సమాచారంతో టాస్క్ ఫోర్స్, ఉట్కూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 7700/ రూ, 6 సెల్ ఫోన్లు, 3 బైక్‌లు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. అనంతరం గేమింగ్ ఆక్ట్ ప్రకారం ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఉట్కూర్ ఎస్సై తెలిపారు.



# భారత నిర్మాణంలో సేవలు అందించిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** భారత నిర్మాణంలో సేవలు అందించిడమే కాకుండా సమానత్వం సామర్థ్య న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి భారత మాజీ ఉప ప్రధాని డా. బాబు జగ్జీవన్ రామ్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ ,సైన్సు టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు . శనివారం ఆర్ అండ్ బి కార్యాలయ సమీపంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117 వ. జయంతి వేడుకలకు హాజరై డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి టీజీఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అధికారులు వివిధ సంఘాల ప్రతినిధులు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ స్వతంత్ర సమరయోధుడిగా, మాత్రమే కాకుండా స్వాతంత్రానం అత్యధిక కాలం భారత క్యాబినెట్ మంత్రిగా కొనసాగిన ఘనత బాబు జగ్జీవన్ రామ్‌కు దక్కుతుందన్నారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ డా. బాబు జగ్జీవన్ రామ్ ఈ పదవిలో కొనసాగిన ఆ పదవికి గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి అన్నారు. ఈ సందర్భముగా సంగారెడ్డి, కల్వకుంట రోడ్డులో ఏర్పాటుచేసిన డా బాబు జగ్జీవన్ రామ్ జయంతి సభలో టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొని మాట్లాడారు. బాబు జగజ్జీవన్ రామ్ సూచించిన అన్ని వర్గాలకు సమ న్యాయం అనే మార్గంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రజలకు అందిస్తున్నదని, కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన అన్ని వర్గాలకు అందుతున్నాయన్నారు. ఈ



కార్యక్రమంలో అదనపు కల్లెక్టర్లు చంద్రశేఖర్ ,మాధురి ,జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంజయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి జగదీష్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రామాచారి , వివిధ శాఖల అధికారులు, బహుజన సంఘాల ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ సుందరీమణులకు వరంగల్ ఆతిథ్యం

## పర్యటకశాఖ ఎండి ప్రకాష్ రెడ్డి వెల్లడి ..

**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనం సాక్షి)**



ప్రపంచ సుందరీమణుల పోటీలు ఇండియాలోని తెలంగాణ స్టేట్ 72వ మిస్ వరల్డ్ పోటీలు- 2025 ను తెలంగాణ రాష్ట్రం హోస్ట్ చేస్తుండగా వరంగల్ సుందరీమణులకు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఆతిథ్యం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా పర్యటకశాఖ ఎండి ప్రకాష్ రెడ్డి శనివారం హరిత కాకతీయ హోటల్లో వివరాలను వెల్లడించారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించబడతాయి. మే 6వ తేదీన ప్రపంచంలోని 144 దేశాలకు చెందిన సుందరీమణులు ప్రపంచంలోని వివిధ దేశాల నుండి ఆ దేశం తరఫున అందాల పోటీలో పాల్గొనడానికి తెలంగాణకు వస్తున్నారని ఆయన వెల్లడించారు. మే 6, 7వ తేదీల్లో అన్ని దేశాల వారు చేరుకుంటారు అప్పటినుండి మే 31 వరకు తెలంగాణలోనే ఈ పోటీలు వివిధ సందర్భాల్లో అన్ని కార్యక్రమాలు ముగించుకొని ఫైనల్ గా మిస్ వరల్డ్ ని ఎంపిక చేస్తారు. ఈ 144 దేశాల నుండి సుందరీ మణులు మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనే ఐదు బృందాలుగా విభజించి నాగార్జున సాగర్, బుద్ధ వనం, వరంగల్ రామప్ప టెంపుల్, యాదగిరిగుట్ట, వివిధ ప్రదేశాలను ఆయా ఖండాల వారిగా సందర్శించే విధంగా ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. శనివారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి , జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనే సుందరీమణులు వరంగల్ పర్యటనలో భాగంగా సందర్శించే కాళోజీ కళాక్షేత్రం వద్ద చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై కలెక్టర్, అధికారులతో రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్, ఐపీఎస్ అధికారి ప్రకాష్ రెడ్డి చర్చించారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొననున్న దాదాపు 30 మంది మన వరంగల్ ను సందర్శించనున్నారు. ప్రోగ్రాం ఏ విధంగా ఉండాలి, ఎలా రిసీవ్ చేసుకోవాలి అని మిగతా అన్ని డిపార్ట్మెంట్స్ కోఆర్డినేట్ చేయవలసిందిగా కలెక్టర్ ప్రావిణ్య కోరారు. అదేవిధంగా జిల్లా లోని వివిధ ప్రాంతాల ను సందర్శించే క్రమంలో పర్యటన ఏ విధమైన అరేంజ్మెంట్స్ చేయాలో కన్సల్టెంట్ ద్వారా అన్ని క్షుణ్ణంగా పరిశీలించి కూడా అధికారులతో పర్యాటక శాఖ ఎండి ప్రకాష్ రెడ్డి చర్చించి కాళోజికి కళాక్షేత్రాన్ని సందర్శించారు. మే 14వ తేదీన వరంగల్ కి ఉదయం 11:30 గంటలకి హరిత కాకతీయ హోటల్ చేరుకుంటారని, హోటల్ నుండి కాళోజీ కళాక్షేత్రం సందర్శించి అక్కడే విద్యార్థులతో సమావేశామవుతారు. బతుకమ్మలతో స్వాగతం పలికి అక్కడి కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి హరిత కాకతీయ కు చేరుకుంటారు. లంచ్ తర్వాత రామప్పకు ప్రయాణం అవుతారు. రామప్పలో టెంపుల్లో దాదాపు రెండు గంటల ప్రోగ్రాం ఉంటుంది. ఆ తర్వాత రామప్ప నుండి డైరెక్ట్ గా హైదరాబాద్కు చేరుకుంటారు ఈ ప్రోగ్రామ్ని సజావుగా ఎలా నిర్వహించాలని అనే అంశం పైన హనుమకొండ హరిత కాకతీయ లో టూరిజం ఎండీ ప్రకాష్ రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగ రావు, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఇతర శాఖల అధికారులు, పాల్గొన్నారు

# వక్ఫ్ సవరణ చట్టంతో పీడితవర్గాల ముస్లింలకు న్యాయం

## రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్

**హైదరాబాద్ (జనంసాక్షి)**



: వక్ఫ్ బోర్డు పేరుతో పేద ముస్లింల హక్కులను కాలరాస్తూ, వేల కోట్ల రూపాయల విలువైన భూములను కొంతమంది ముస్లిం పెద్దలు దోచుకుంటున్న పరిస్థితుల్లో, నరేంద్ర మోదీ ప్రభుత్వం చరిత్రాత్మకంగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం పీడిత వర్గాల ముస్లింలకు న్యాయం చేస్తుందని రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు పరిధిలో ఉన్న రూ. 1.2 లక్షల కోట్ల విలువైన భూములు అవినీతిపరుల చేతుల్లో అన్యాక్రాంతమవుతున్నాయని, కేంద్రం తీసుకొచ్చిన సవరణల ద్వారా వీటి పూర్తి డాక్యుమెంటేషన్, ఆదాయం-వ్యయం వివరాలు సెంట్రల్ పోర్టల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నదని వివరించారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని 77,538 ఎకరాల వక్ఫ్ భూముల్లో 75% ఆక్రమణకు గురవడం వెనుక కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు, ఏఐఎంఐఎం అగ్రనాయకుల పాత్ర కూడా ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏఐఎంఐఎంకు మద్దతుగా వక్ఫ్ బిల్లును వ్యతిరేకించడమే కాకుండా, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థిని నిలబెట్టకుండా ఏఐఎంఐఎంను గెలిపించేందుకు కుమ్మక్కయ్యాయని లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్-బీఆర్ఎస్-ఎంఐఎం కుమ్మక్కు రాజకీయాలు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మారాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని నిలిపివేయాలని పార్లమెంట్లో తెలంగాణ బిజెపి ఎంపీలుగా తాము గళమెత్తామని లక్ష్మణ్ గుర్తుచేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వానికి నిదర్శనంగా మారిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం మతం, కులం, ప్రాంతాలకు అతీతంగా పాలన అందిస్తోందని తెలిపారు. రానున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గౌతమ్ రావుకు ఓటేయాలని ప్రజలను కోరారు.

# వక్ఫ్" బిల్లు ఆమోదంతో పేద, మధ్యతరగతి ముస్లింలకు న్యాయం

**బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**
**కరీంనగర్ పట్టణంలో బిజెపి మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో సంబరాలు**

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 05 (జనంసాక్షి)**



: వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యసభ, లోక్ సభలో ఆమోదం పొంది బిల్ పాస్ కావడంతో శనివారం సాయంత్రం బిజెపి మైనార్టీ మోర్చా కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ చౌక్ లో టపాసులు పేల్చి సంబరాలు చేపట్టి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , కేంద్ర మంత్రులు కిరణ్ రీజీజు , బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాబి షేకం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ మాట్లాడుతూ.. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు లోక్ సభ, రాజ్యసభలో ఆమోదం పొందడం శుభపరిణామన్నారు. ముఖ్యంగా సవరణ బిల్లుతో పేద, మధ్యతరగతి ముస్లింలకు న్యాయం జరిగిందన్నారు. ప్రధానంగా దేశంలో కోట్లాదిమంది ముస్లింల ప్రయోజనాల, అభివృద్ధి కోసం ఉపయోగపడాల్సిన వక్ఫ్ ఇన్నేళ్లుగా కొందరి ప్రయోజనాల కోసమే పనిచేసినట్లు స్పష్టంగా అర్థమవుతుం దన్నారు. ఈ సవరణ బిల్లు విషయంలో అడ్డగోలుగా మాట్లాడే ఓవైసీ లాంటి వాళ్లు మెడికల్ కళాశాలలు, ఇతర వ్యాపారాలు చేసుకొని అపర కుబేరులు అయ్యారని, ఓవైసీలు ఏనాడైనా పేద ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేశారా..? వాళ్ల సమస్యల కోసం మాట్లాడారా..? రోడ్డున పడితే అక్కున చేర్చుకున్నారా..? ఓవైసీ బ్రదర్స్ ఎప్పుడు తమ స్వార్థ రాజకీయాల కోసమే పనిచేశారని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమం లో బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండి సమీ పర్వేజ్, రాష్ట్ర కార్యదర్శి బల్ బీర్ సింగ్, మైనార్టీ మోర్చా పార్లమెంటు ఇంచార్జ్ ఎండి బషీరుద్దీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ తాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి సమ్యుల్లా అహ్మద్, షహజాద్, ఉపాధ్యక్షుడు సైద్, జిల్లా కార్యదర్శి మహమ్మద్ సాబీర్, ఫయాజ్ చిస్తి, అల్తాఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు..

# గిరిజనులు అమాయక రైతులు

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 05(జనంసాక్షి)**




**మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం**
**అధికారులు అలసత్వం వహించరాదు : హుస్సేన్ నాయక్**

: పలు రకాల కంపెనీల మొక్కజొన్న విత్తనాలు వేసి నష్టపోయిన గిరిజనులు అందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. నకిలీ విత్తనాలు పంపిణీ చేసిన కంపెనీలపై రానున్న రోజులలో కేసులు వేస్తామని ఆయన హెచ్చరించారు. శనివారం ఆయన వెంకటాపురం మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటీడీఏ పిఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ అమాయక గిరిజనులను ఆసరగా చేసుకొని కొన్ని కంపెనీల యజమానులు నకిలీ విత్తనాలు సరఫరా చేసి అన్ని విధాలుగా నష్టం చేశారని, విత్తనాలను పంపిణీ చేసిన కంపెనీ యాజమాన్యాలు నకిలీ విత్తనాలను పంపించేసింది వాస్తవమేనని ఒప్పుకొని నేటి వరకు నష్టపరిహారం చెల్లించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గత కొద్ది రోజుల క్రితం పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించిన అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని, ఆదివాసి గిరిజనులు నష్టపోతున్న క్రమంలో జిల్లా యంత్రాంగం ఏ చర్యలు తీసుకుందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులను వివరాలను సేకరించి తక్షణమే నష్టపరియం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నామమాత్రంగా నష్టపరిహారం చెల్లించ కుండా పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ వెంకటాపురం మండలంలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించడం జరిగిందని, విత్తనాలను పంపిణీ చేసిన కంపెనీ యజమానియాలతో పలు దఫాలుగా చర్చలు జరిపి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పంట నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, ఎమ్మార్వో లక్ష్మీ రాజనర్సు, జిల్లా సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్, విద్యుత్ శాఖ అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, రైతులు, ఆయా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దళితబంధు నిధులు విడుదల చేయాలి

**భూపాలపల్లి, ఏప్రిల్ 5 (జనం సాక్షి)**




భూపాలపల్లి జిల్లా రెండో విడత దళిత బందు రాష్ట్ర అధ్యక్షుడు కోయిల మహేష్ అన్న పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లా ఇన్చార్జ్ పులి రామన్న ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గంలోని రెండవ విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలనిభూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కీ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 16 నెలల నుండి రెండవ విడత లబ్ధిదారుల అమౌంటు ఫ్రిజింగ్ లో ఉండడం వలన దళిత బంధు లబ్ధిదారులకు ఎలాంటి ఉపయోగం లేకుండా ఉండటం వలన వారు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు కనుక అట్టి ఫ్రీజింగ్ ను ఎత్తివేసి దళిత బంధు పథకాన్ని కొనసాగించాలని ఈరోజు కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దళితులను మోసం చేయాలని చూస్తే ఊరుకోమని రానున్న రోజుల్లో రాష్ట్ర కమిటీ సూచనతో హైదరాబాదు నడిబొడ్డున భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని ప్రతి ఊరు నుండి లబ్ధిదారులు ఏకం చేసుకొని కదిలించి ఆ సభను విజయవంతం చేసి దళితుల ఐక్యతను చాటుతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజన్న సంఘీభావం తెలిపారు. దళిత బందు సాధన కోసం తన మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి స్టేట్ సోషల్ మీడియా ఇంచార్జ్ మంత్రి రాజబాబు, రాష్ట్ర గౌరవ సలహాదారు మంతెన సమ్మయ్య ,జిల్లా గౌరవ సలహాదారు చిట్యాల సమ్మయ్య , జిల్లా కార్యవర్గ సభ్యులు ఇనుముల సతీష్ , మలహర్ మండలం ముఖ్య కార్యవర్గ సభ్యులు దమేరా ముత్తయ్య , దళిత బంధు సభ్యులు మారుపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలకు పెద్దపీట

**అటవీ,పర్యావరణం,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనంసాక్షి):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికి ఆదర్శమని అటవీ, పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్ లో రేషన్ దుకాణాలను లబ్ధిదారులకు సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమం ఎంతో విజయవంతం అయిందని లబ్ధిదారులు కూడా దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడం వల్ల దళారీ వ్యవస్థ ఏర్పడి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిని నేడు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో ప్రతి లబ్ధిదారుడు సన్నబియాన్నే వినియోగించుకుంటూ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసినట్లు అయిందని మంత్రి సురేఖ తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మదిలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని సంక్షేమ పథకాలతో అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి గారు మంత్రులు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నారని తెలిపారు.

# ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక విద్యామండలి ఏర్పాటు చేయాలి

**తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ పెడరేషన్ (టిపిటిఎఫ్)**

**ఏటూరునాగారం, ఏప్రిల్ 05(జనంసాక్షి)**




తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో "ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా రక్షణ - ప్రభుత్వ విధానాలు" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాల టిపిటిఎఫ్ ములుగు జిల్లా ప్రధానకార్యదర్శి పల్లె నాగరాజు అధ్యక్షత వహించగా, ఈ సమావేశానికి ముఖ్య వక్తలుగా హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాధానల్ రాజు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపత్రి అరుణ్ కుమార్ హజరై మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతాలలో విద్యా నిర్వీర్యానికి ప్రభుత్వాలు అన్ని కూడా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నావని అన్నారు. బాధవత్ రాజు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాలలో విద్యను పర్యవేక్షించాల్సిన రాష్ట్ర గవర్నర్ గత కొన్ని సంవత్సరాలుగా తాత్సార్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. మైపతి ఆరుణ్ మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతాల విద్యా పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అన్నారు. పోదెం క్రిష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఐటిడిఏ ప్రాంతాల విద్యా రక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉప్పస్వామి, ఎస్సి, ఎస్టి సంఘం జిల్లా అధ్యక్షులు బాబురావు, టిపిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు హట్కర్ సమ్మయ్య, ఏటూరునాగారం ఎంఈఓ మల్లయ్య, డివైఎఫ్ఐ రత్నం ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ రవి, పండిత పరిషత్ నాయకలు సుభాష్, టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు దిలీప్, రాంనాథ్, శ్యాం ప్రసాద్, సారంగపాణి, రాజు, ఇతర ఉపాధ్యాయులు ప్రజా సంఘాలు బాధ్యులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి శుభాకాంక్షలు

**హైదరాబాద్ (జనంసాక్షి)**



శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మీడియాకి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరపాలని అధికారులను ఆదేశించారు. "శ్రీరాముడు సత్యానికి, న్యాయానికి, మంచి నీతి జీవనానికి నిలువెత్తు ప్రతిరూపమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో శ్రీరాముని జీవితం ఒక గొప్ప మార్గదర్శకమని శాంతి, సహనం, విశ్వాసం, కష్టనష్టాలను అధిగమించే స్థైర్యం వంటి విలువలను శ్రీరాముని జీవితం మనకు నేర్పుతుందనీ మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు. ఈ పండుగ పర్వదినం ప్రజలందరికీ సంతోషం, ఆయురారోగ్యం, శాంతి, ఐశ్వర్యాలను అందించాలని ఆకాంక్షిస్తూ, రామ నామ స్మరణతో మనలో ధర్మపథంలో నడిపించే శక్తిని ఇస్తుందన్నారు. "ప్రతి ఒక్కరికి న్యాయం, సమానత్వం కలిగే రామ రాజ్యం లాంటి పాలన అందాలని సురేఖ ఆకాంక్షించారు. గోదావరి నదీ తీరాన సీతాసమేతంగా కొలువై ఉన్న శ్రీరాముని ఆలయం భద్రాచలం, 'దక్షిణ అయోధ్య'గా పేరుగాంచిందని, అలాంటి మహిమాన్వితమైన పుణ్యక్షేత్రం మన రాష్ట్రంలో ఉండటం నిజంగా మన అదృష్టమన్నారు.

# సన్న బియ్యం పంపిణీ ప్రతిష్టాత్మక నిర్ణయం

**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి)**



: పేదవాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ మండలం పాతూరు గ్రామంలో శనివారం రేషన్ షాపులో రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి పేదవాడికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. మెదక్ జిల్లాలో 520 రేషన్ షాపుల ద్వారా 2,13,828 రేషన్ కార్డ్ దారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం 4430.496 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయడం జరుగుతుందని దీని ద్వారా ఆరు లక్షల 96 వేల 43 మంది సభ్యులకు సన్న బియ్యం పంపిణీ ద్వారా లబ్ధి చేకూరనుందని తెలిపారు. జిల్లాలో 100 శాతం చౌక ధరల దుకాణాల ద్వారా అర్హత గల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
06 ఏప్రిల్ 2025

## శాంతి భద్రతలతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** శాంతి భద్రతల తో పాటు,సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,పోలీస్ లనుఅభినందించారు. జిల్లాపోలీస్, యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన, మెగాజాబ్మేళాకు ఆయనముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాబ్ మేళాలో కనీసం 30 వేల బేసిక్ పే నుండి ఉద్యోగాలు ఇవ్వడం సంతోషమని అన్నారు.పోలీసులు 24 గంటలు పని చేసేఉద్యోగులుగా ప్రజల భద్రతతో పాటు,సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో పోలీస్ తరఫున ఇంత పెద్ద జాబ్ మేళా నిర్వహించడం జిల్లాలో మొదటిదని అన్నారు.ఈ జాబ్ మేళాలో ఉన్నత చదువులు చదివిన వారు కూడా ఉద్యోగాల కోసం వచ్చారని అన్నారు.జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మరో జాబ్ మేళాను త్వరలోనే నల్గొండ లో ఏర్పాటు చేస్తామన్నారు. మాదక,ద్రవ్యాల రహిత జిల్లాగా నల్గొండ జిల్లాను తీర్చిదిద్దడంలో మిషన్ పరివర్తనను అమలు చేయడం,అలాగే ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను చేయడం అభినందనీయమన్నారు.ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూఅండగాఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేశారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారు మొదటిసారి వేతనం తక్కువగా ఉన్నప్పటికీ నిరాశపడవద్దని,అనుభవం కోసం కృషి చేయాలని,తాను కూడా మొదటి సారి రు.18000 రూపాయల ఇంటర్న్షిప్తో బొంబాయి లో పని చేశానని తెలిపారు.ఎంత దూరంలో ఉద్యోగం వచ్చినా పనిచేయాలని, భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ పోలీస్ ఆధ్వర్యంలో పరేడ్ మైదానంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు112 కంపెనీలు వచ్చాయని, సుమారు 2500 ఖాళీలు ఈ జాబ్ మేళాలో భర్తీ చేయనున్నామని, 4,000 మంది అభ్యర్థులు ఇప్పటివరకే రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఎక్కువగా 45 వేల జీతానికి ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని అన్నారు.యువత సంఘవిద్రోహ శక్తులుగా తయారు కాకుండా ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ జాబ్ మేళా ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఉద్యోగాలు పొందిన వారు మొదటి ఉద్యోగం అని తేలికగా తీసుకోకుండా,కష్టపడి పని చేయాలని,రానివారు నిరాశ పడవద్దు అని తెలిపారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం యువతేజం అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని, ప్రతి గ్రామంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ ను ఏర్పాటు చేశామని చెప్పారు. జాబ్ మేళాలో హాజరైన వారందరికీ ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా భోజన సదుపాయం కల్పించడం పట్ల ఆయన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఏ ఎస్పీ మౌనిక వందన సమర్పణ చేయగా,డీఎస్పీ శివరాంరెడ్డి,జాబ్ కో-ఆర్డినేటర్ రవి,పోలీస్ సిబ్బంది,యువతీ యువకు తదితరులు పాల్గొన్నారు.

## 9 శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

- డాక్టర్ పిడమర్తి రవి



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గ కేంద్రాలలో విజయోత్సవ సంబరాలలో భాగంగా నల్గొండ, నకిరేకల్, సూర్యాపేట, ఖమ్మం నియోజకవర్గం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు చేసుకున్న నాయకులు. ఈ విజయోత్సవ సంబరాలకు ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరై మాదిగ జేఏసీ శ్రేణులకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంకి మిఠాయి తినిపిస్తూ వర్గీకరణ సంబరాలు చేసుకున్నారు. వేముల వీరేశం మాట్లాడుతూ 9.75 శాతం రిజర్వేషన్ మాదిగలకు కల్పించిన ముఖ్యమంత్రి ఎప్పటికీ మాదిగల హృదయంలో చిరస్మరణీయంగా ఉండిపోతారని అన్నారు. వర్గీకరణ బిల్లు సుప్రీంకోర్టులో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయంగా ఆ కేసులో ఇంప్లిడ్ అయ్యి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయ నిపుల సలహాతో వర్గీకరణ బిల్లు సుప్రీంకోర్టులో ఆమోదించే విధంగా అనేక ప్రయత్నాలు చేయాల్సి చివరకు వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చు అనే తీర్పు రాగానే తెలంగాణలో మొట్టమొదటిసారిగా వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా భారతదేశ చరిత్రలో తెలంగాణ నిలిచే విధంగా బిల్లు ఆమోదించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలలో మాదిగ జేఏసీ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వర్గీకరణ విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తామని అన్నారు రేపు ఉమ్మడి ఖమ్మం వరంగల్ జిల్లాలో విజయోత్సవ సంబరాలు ఉంటాయని అన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో మాదిగ జేఏసీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు కొండల్, యూత్ జేఏసీ అధ్యక్షులు పుల్లెంల సతీష్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్న నాయకులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ...నకిరేకల్ నియోజకవర్గంలో నకిరేకల్ శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ వేముల వీరేశం గారు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి గారికి మిఠాయి తినిపిస్తూ సంబరాలు చేసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ సంబరాల్లో భాగంగా ఈరోజు సూర్యాపేట పట్టణంలో మాదిగ జేఏసీ నాయకులు సంజయ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలకు ముఖ్య అతిథులుగా హాజరై నా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి నాయకులకు కార్యకర్తలకు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతకోటి కారన్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం పట్టణంలో జిల్లా అధ్యక్షులు గురుమూర్తి ఆధ్వర్యంలో వర్గీకరణ సంబరాలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## గద్వాల జిల్లాలో గతి తప్పుతున్న లా అండ్ ఆర్డర్

- ఎమ్మార్పీఎస్ నాయకులు డిజిపికి ఫిర్యాదు

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** జిల్లాలో లా అండ్ ఆర్డర్ గతి తప్పుతుందని డిజిపి జితేందర్ కు జోగులాంబ గద్వాల జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో పోలీసు యంత్రాంగం విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని, జిల్లాలో జోరుగా ఇసుక, మట్టి, పిడిఎఫ్ బియ్యం రాత్రి వేళలో జోరుగా సాగుతున్న జిల్లా పోలీస్ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందని, జిల్లాలో దొంగతనాలు, దోపిడీలు, మహిళలపై అత్యాచారాలు, ఎస్సీ, ఎస్టీ కేసులు కట్టడంలో నిర్లక్ష్య వైఖరి, కట్టిన కేసులో కూడా స్టేషన్ బెయిల్ ఇవ్వడం, ఎస్సీ ఎస్టీ కేసును నీరుకార్చడం, అలాగే సివిల్ కేసులలో జోక్యం తీసుకోవడం, జిల్లాలోని ఐజ పట్టణానికి చెందిన అల్వాల గజేంద్ర గౌడ్ ప్రజల సొమ్ము కోట్ల రూపాయలను మింగిన కూడా పోలీస్ వ్యవస్థ పాదదర్శంగా వ్యవహరించక నిందితుడికి వత్తాసు పలుకుతున్నారని ఈ సందర్భంగా వారు అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా జిల్లా పోలీసు యంత్రాంగం బడా నాయకుల మాటలు వింటూ మామూలు ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, ఈ విధానం ఇలాగనే కొనసాగితే ప్రజల హక్కులకు భంగం కలిగే విధంగా రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా చేస్తున్నారని ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులు తమపై ఒత్తిడితోపాటు దాడులు చేసే ప్రమాదం ఉందని వారు ఈ సందర్భంగా అన్నారు. జిల్లాలో జరుగుతున్న నియంత పాలనను పారదూరలి డి ఐ జి స్థాయి అధికారి చే విచారణ జరిపించాలని జిల్లాలో లా అండ్ ఆర్డర్ పరిరక్షించాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ కోఆర్డినేటర్ పరుశరాముడు, గట్టు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సత్వర న్యాయం అందించేందుకు అదనపు కోర్టు

- రాష్ట్ర హై కోర్ట్ జడ్జిలు జస్టిస్ పి.శ్రీ సుధ, జస్టిస్ అనిల్ కుమార్



**జహీరాబాద్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** సత్వర న్యాయ సేవలు అందించేందుకు అదనపు కోర్టు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర హై కోర్ట్ జడ్జిలు జస్టిస్ పి. శ్రీ సుధ, జస్టిస్ అనిల్ కుమార్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని కోర్టు సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు సివిల్ జడ్జి కోర్ట్ను హై కోర్ట్ జడ్జిలు జస్టిస్ పి. శ్రీ సుధ, జస్టిస్ అనిల్ కుమార్ లు ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనవారికి కోర్టు ప్రారంభానికి ముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం హై కోర్ట్ జడ్జి జస్టిస్ పి.శ్రీ సుధ మాట్లాడుతూ స్థానిక కోర్టు లో తమ దృష్టికి వచ్చిన పలు సమస్యలను ఒక్కొక్కటిగా నేరవేర్చే విధంగా ప్రయత్నం చేస్తానని హామీచ్చారు. త్వరలో 1700 పోస్టులకు నోటిఫికేషన్ను హైకోర్టు ద్వారా ప్రకటించానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి సెషన్ జడ్జి జి. భవానీ చంద్ర, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు, న్యాయవాదులు, కోర్టు పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని కూల్చే పిచ్చి పనులు మేం చేయబోం...

- జనరల్ ఎన్నికల్లోనే తేల్చుకుంటాం
- దేశంలో,రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయినట్లే
- ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశంలో కెసిఆర్



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** ఎవడో భిక్ష వేస్తే తాను సీఎం సీట్లో కూర్చోనని, వచ్చే మూడేళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో కొనసాగుతుందని, ప్రభుత్వాన్ని కూల్చే పిచ్చి పనులు మేం చేయబోం'మని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు.శనివారం ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధ్యలో వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చెప్పినా తాము ఆ పనికి ఒప్పుకోబోమన్నారు.అలా మధ్యలో తాము అధికారాన్ని చేపట్టబోమన్నారు.జనరల్ ఎన్నికల్లోనే తేల్చుకుంటామని,మళ్లీ తామే బీఆర్ఎస్ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.తాము సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామని అన్నారు.కాగా దేశంలో మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టిన మోడీకి బాగా గర్వం పెరిగిందని కేసీఆర్ విమర్శించారు.తనకు తానే మేధావిని అని అనుకుంటున్నారని...చివరకు ఆర్ఎస్ఎస్ కంటే తానే గొప్ప అనే భావనలో ఉన్నారని కేసీఆర్ చెప్పారు.ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్ సైతం గుర్తించిందని, ఆయన మీద తీవ్ర వ్యతిరేకతతో ఉన్నదన్నారు.ఇటు దేశవ్యాప్తంగానూ మోడీపై వ్యతిరేకత వచ్చిందన్నారు.మోడీ అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ మారాడని తెలిపారు.ఇక దేశంలో,రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయినట్లేనని జోస్యం చెప్పారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి,ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్,నోముల భగత్,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య,కంచర్ల భూపాల్ రెడ్డి,నల్లమోతు భాస్కర్ రావు,బొల్లం మల్లయ్య యాదవ్, బడుగుల లింగయ్య యాదవ్,పార్టీ సీనియర్ నేత విజయసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ కృషి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంటరాని వారి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు.అందరూ సమానంగా ఉండాలని, అంటరానితనం అన్నదే ఉండకూడదని, అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారన్నారు.దేశంలో అత్యధిక కాలం పార్లమెంట్ సభ్యులుగా ఉన్న ఏకైక నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు.వ్యవసాయ,రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో మార్పులను తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్,ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి బిఎస్. లత, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, ఎస్టి కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శంకర్ నాయక్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి నరసింహారావు, డిఎంహెచ్ఓ డాక్టర్ కోటా చలం, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ, పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జెడ్పిటిసి జిడి బిక్షం, కుల సంఘ నాయకులు మట్టపల్లి సైదులు, కోట గోపి, నెమ్మాది వెంకటేశ్వర్లు, బొల్లెద్దు వినయ్, ములకలపల్లి రాములు, వీరయ్య, నిమ్మల శ్రీనివాసరావు,టీఎన్జీవో జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక చేయూత

- లయన్స్ క్లబ్ హోప్ ఫౌండేషన్ ఔదార్యం




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** సమాజ ఎదుగుదల విద్యా ప్రాప్తితోనే ముడిపడి ఉందని లయన్స్ క్లబ్ హోప్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సీతాఫల్ మండి కార్పొరేటర్ హేమ శ్యామల చేతుల మీదుగా నిరుపేద విద్యార్థులైన వి. భావన(6వ తరగతి), వి. సాయి నిఖిల్ (4వ తరగతి) కి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ 20 వేల రూపాయల చెక్ ను శనివారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులైన భావన, సాయి నిఖిల్ విద్యలో అద్భుతంగా రానిస్తున్నప్పటికీ స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుసుకొని సీతాఫల్ మండి కార్పొరేటర్ హేమ శ్యామల చేతుల మీదుగా తోచిన ఆర్థిక సహకారాన్ని అందించడం జరిగిందన్నారు. చదువులో బాగా రాణిస్తున్నప్పటికీ ఆర్థిక కారణాలు అడ్డంకిగా మారడంతో చదువులో ఇబ్బందిని ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న లయన్స్ క్లబ్ హోప్ సేవా సంస్థ సదరు విద్యార్థులకు ఆర్థికచేయుతను అందించడానికి ముందుకు రావడం జరిగిందని, ఇందులో భాగంగానే 20 వేల రూపాయల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించడం జరిగిందన్నారు. ఇరువురు చిన్నారులు విద్యారంగంలో రాణిస్తూనే మరోవైపు ఉన్నత లక్ష్యాలపై దృష్టిని సారించి జీవితంలో గొప్ప స్థానానికి చేరుకోవాల్సిన అవసరం ఉందని, తద్వారా కుటుంబ ఎదుగుదలకు మూలస్తంభంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తమ లయన్స్ క్లబ్ ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమందికి ఇప్పటికే అనేక హితోదిక సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. నిరుపేదలకు చేయూతనందించడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగానే ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇక ముందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపడతామని, లయన్స్ క్లబ్ అంటేనే సేవా కార్యక్రమాలకు చిరునామా అని కొండా విజయ్ కుమార్ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రాజశేఖర్, మారం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పథకం పేదవారి ఆత్మగౌరవ పథకం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పథకం పేదవారి ఆత్మగౌరవ పథకం అని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం ఆయన నల్గొండ జిల్లా,నార్కెట్ పల్లి మండలం,ఎల్లారెడ్డిగూడెంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి సన్న బియ్యం లబ్ధిదారు మేడి అరుణ ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి16 నెలలు అయిందని, అయితే ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు మాత్రమే కాకుండా, ఇవ్వని హామీలనుసైతం అమలు చేస్తున్నదని,ఉచిత బస్సు,500 రూపాయలకే ఎల్పీజీ కనెక్షన్, గృహజ్యోతి,రైతు భరోసా,రైతు భీమా,రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని,త్వరలోనే రాజీవ్ యువశక్తి పథకం కింద నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కింద నాలుగు లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయంఇవ్వనున్నమన్నారు. సన్న బియ్యం పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకం అని,అలాంటిది జగ్జీవన్ రామ్ జయంతి రోజున పేద దళిత మహిళ అరుణ ఇంట్లో భోజనం చేయడం సంతోషంగా ఉందన్నారు. నిజమైన తెలంగాణ పేదవాడు కలల కన్న తెలంగాణ ఇదేనని ఆయన తెలిపారు.ఇప్పటివరకు దొడ్డు బియ్యం ఇస్తే వాటిని పాలిష్ చేసి తిరిగి రీసైకిలింగ్ చేసి మిల్లర్లు అమ్ముతున్నారని,దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఉమ్మడి నల్గొండ జిల్లా హుజూర్నగర్ నుండి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని,3 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న శ్రీరామనవమి సందర్భంగా ఆయన రాష్ట్ర,జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, నార్కెట్ పల్లి తహసిల్దార్,తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## సామాజిక విప్లవానికి చేసిన కృషి ఎనలేనిది

- కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** బాబు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సామాజిక విప్లవానికి చేసిన కృషి ఎనలేనిది అని, కలెక్టర్ హనుమంతరావు కొనియాడారు. శనివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 118 వ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ కార్నర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డిఓ కృష్ణారెడ్డి వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి ,జ్యోతిని వెలిగించి ప్రసంగించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడి జీవితం ,ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని కలెక్టర్ అన్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డా. బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడిగా మాత్రమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతర భారత నిర్మాణంలో అపూర్వమైన సేవలు అందించిన మహనీయుడని అన్నారు.1908 ఏప్రిల్ 5న జన్మించిన ఆయన, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, అనంతరం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకుడిగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వం యువకుల కోసం రాజీవ్ యువ వికాసం ప్రవేశపెట్టినందున ఈనెల 14 వ తేదీ వరకు గడువు ఉన్నందున ప్రతి ఒక నిరుపేద కుటుంబాలు దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం అందించే రాయితీని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఎస్సీ కులాల సంక్షేమ, అభివృద్ధి శాఖ అధికారి వసంత కుమారి, ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ శ్యాంసుందర్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి యాదయ్య, ఇతర జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్ రాజలింగం,మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## రూ.కోట్లు కురవాలంటే ఉత్తమమార్గాలు

**జనంసాక్షి:**కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ 'స్టార్టప్ మహాకుంబ్ 2025'లో చేసిన వ్యాఖ్యలు భారత స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో చర్చకు దారితీశాయి. సంస్థలు డీప్‌టెక్ ఇన్నోవేషన్‌పై దృష్టి సారించడం లేదని, ఈ విభాగానికి వెంచర్ క్యాపిటల్ (వీసీ) నిధులు తగ్గిపోతున్నాయన్నారు. 2023లో డీప్‌టెక్ వీసీ ఒప్పందాల్లో 11%, పెట్టుబడి విలువలో 13% వాటాను కలిగి ఉన్నాయని, అయితే ఈ గణాంకాలు 2024లో వరుసగా 9%, 6%కు పడిపోయాయని తెలిపారు. 2025 ప్రారంభం నాటికి డీప్‌టెక్ వెంచర్లు మొత్తం వీసీ పెట్టుబడుల్లో 9% మాత్రమే ఆకర్షించాయని పేర్కొన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ వంటి అద్భుతమైన టెక్నాలజీలపై దృష్టి సారించే డీప్‌టెక్ రంగంలోని స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటలిస్టులను ఆకర్షించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ విభాగంలోని స్టార్టప్‌లు తమ విలువను ప్రదర్శించడానికి, నష్టాలను తగ్గించడానికి పెట్టుబడిదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా వ్యూహాత్మక చర్యలను అవలంబించాలి. వెంచర్ క్యాపిటలిస్టులను ఆకర్షించడానికి ఈ రంగంలోని స్టార్టప్‌లు ఎలాంటి విధానాలు అనుసరించాలో నిపుణులు సూచిస్తున్నారు.డీప్‌టెక్ రంగంలోని వీసీలు లోతైన శాస్త్రీయ లేదా సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యమిస్తారు. ఈమేరకు స్టార్టప్‌లు వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేయాలి. సంబంధిత టెక్నాలజీలో నైపుణ్యం కలిగిన పీహెచ్‌డీలు, ఇంజినీర్లు లేదా శాస్త్రవేత్తలు (ఉదా.క్వాంటమ్ కంప్యూటింగ్ స్టార్టప్‌కు క్వాంటమ్ ఫిజికల్ శాస్త్రవేత్త) అవసరం. మార్కెట్ వ్యూహంలో అనుభవం ఉన్న వ్యక్తులు సృజనాత్మకతను జోడిస్తారు. అలాంటివారికి ప్రాధన్యం ఇవ్వాలి. వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించే పరిశ్రమ అనుభవజ్ఞులను కంపెనీలో చేర్చుకోవాలి. డీప్‌టెక్ స్టార్టప్‌లు తరచుగా సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరిస్తుంటాయి. వీసీలను ఆకర్షించాలంటే సమస్యను స్పష్టంగా నిర్ధారించాలి. సామాజిక అవసరాలతో ముడిపడి ఉన్న సవాళ్లను స్పష్టంగా తెలియజేయాలి. ఇప్పటికే ఉన్న ప్రత్యామ్నాయాలతో సమస్యను అధిగమించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారో తెలపాలి. సమస్యల పరిష్కారానికి ఇన్నోవేటివ్ సమాధానాలు ఆలోచించాలి. డీప్‌టెక్‌లో సాంకేతిక ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వీసీలు తరచుగా స్పష్టమైన పురోగతికి పెద్దపీట వేస్తారు. స్టార్టప్‌లు ప్రతి ఇన్నోవేషన్‌లో ఎంవీపీ (మినిమమ్ వయబుల్ ప్రొడక్ట్)ని దృష్టిలో ఉంచుకోవాలి.



# త్వరలో 'రియల్'బూమ్

### హైదరాబాద్‌లో ఫ్లాట్లు, స్థలాల ధరలు పెరిగే సూచనలు




**హైదరాబాద్(జనంసాక్షి):**కరోనా మహమ్మారి కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీ పడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని..చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్‌ఎల్–రూఫ్‌అండ్‌ఫ్లోర్ సం యుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది.హైదరా బాద్‌తో సహా ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, బెంగళూరు, చెన్నై, పుణే నగరాలలో 2,500 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. పలు కీలకాంశాలివే.. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌ల నేపథ్యంలో ఫ్లోర్ ప్లాన్స్‌లలో మార్పులు చేయాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరు మోసిన డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్ట్‌లలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తామ ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని జేఎల్‌ఎల్ ఇండియా (రెసిడెన్షియల్ సర్వీసెస్) ఎండీ శివ కృష్ణన్ తెలిపారు. కరోనా ప్రారంభం నుంచి ల్యాండ్ బ్యాంక్‌ను సమీకరించిన డెవలపర్లు.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. దీంతో రెండో అర్ధ భాగం నుంచి గృహ లాంచింగ్స్‌లో వృద్ధి నమోదవుతుందని అంచనా వేస్తున్నారు.

## పాన్ కార్డులకు కొత్త డెడ్‌లైన్..




**జనంసాక్షి:**పాన్ కార్డులకు సంబంధించి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు కొత్త డెడ్‌లైన్‌ను ప్రకటించింది. ఆధార్ ఎల్‌రోల్మెంట్ ఐడీని ఉపయోగించి పాన్ కార్డులు పొందినవారందరూ వచ్చే డిసెంబర్ 31 లోగా దానిని తమ ఒరిజినల్ ఆధార్ నంబర్‌తో భర్తీ చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. సీబీడీటీ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. 2024 అక్టోబర్ 1 లేదా అంతకుముందు తమ ఆధార్ దరఖాస్తు నమోదు ఐడీని ఇచ్చి పాన్ కార్డులు వారందరూ తమ ఆధార్ నంబర్‌ను 2025 డిసెంబర్ 31 లోగా ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయాలి. ఈ నోటిఫికేషన్ ఏప్రిల్ 3న విడుదలైంది. అయితే సదరు పాన్‌కార్డుదారులు తమ ఆధార్ నంబర్‌ను ఆదాయపు పన్ను శాఖకు ఎలా తెలియజేయాలన్న దానిపై మాత్రం స్పష్టత లేదు.నిర్దిష్ట పాన్ హోల్డర్లు ఆధార్ సంఖ్యను ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయడానికి పాన్–ఆధార్ లింకింగ్ పద్ధతిని ఉపయోగించవచ్చుంటున్నారు ట్యాక్స్‌మన్.కామ్ అడ్వైజరీ అండ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ వాధ్వా. పాన్ హోల్డర్లు ఈ–ఫైలింగ్ పోర్టల్‌ను సందర్శించి పాన్–ఆధార్ లింకింగ్ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందన్నారు. నిర్దేశిత పాన్ హోల్డర్లు పాన్–ఆధార్ లింక్ చేస్తే ఎలాంటి పెనాల్టీ వర్తించదని భావిస్తున్నారు. అయితే, దీని గురించి ఆదాయపు పన్ను శాఖ నుంచి మరింత స్పష్టత వస్తే ఇలాంటి పాన్ హోల్డర్లకు ఉపయోగపడుతుందన్నారు.మరో ప్రత్యామ్నాయ మార్గంలో పన్ను చెల్లింపుదారులు ఎన్ఎస్‌డీఎల్ ఈగవ్ లేదా యూటీఐఐటీఎస్ఎల్ నిర్దేశిత పాన్ సేవా కేంద్రాన్ని సందర్శించి పాన్ కార్డు, ఆధార్ కార్డు, నిర్దేశిత రుసుము కాపీతో పాటు నిర్దేశిత ఫారాన్ని నింపవచ్చని ట్యాక్స్ కన్సల్టింగ్ సంస్థ భూటా షా అండ్ కో ఎల్ఎల్‌పీ పార్టనర్ స్నేహ పాధియార్ చెబుతున్నారు. సర్వీస్ సెంటర్లో బయోమెట్రిక్ ద్వారా కూడా ఆధార్‌ను ధృవీకరించవచ్చని, పాన్, ఆధార్ డేటాలో పొంతన లేకపోతే బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరి అని తెలియజేశారు.ప్రస్తుతం, పాన్‌ను ఆధార్‌తో లింక్ చేయడానికి పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఎందుకంటే పాన్–ఆధార్ లింక్ కోసం సాధారణ పాన్ హోల్డర్లకు గడువు 2023 జూన్ 30తో ముగిసింది. అందువల్ల పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేయని ఏ పాన్ హోల్డర్ అయినా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అయితే కేవలం ఆధార్ ఎన్‌రోల్మెంట్ ఐడీని ఉపయోగించి పాన్ కార్డు పొందినవారు ఆ సమయంలో ఒరిజినల్ ఆధార్ నంబర్ లేదు కాబట్టి గడువులోగా రెండింటినీ లింక్ చేయలేరు. కాబట్టి, ఈ పాన్ హోల్డర్లకు ఇప్పుడు ఈ పెనాల్టీ చెల్లించాల్సిన అవసరం నుండి మినహాయింపు ఇవ్వాలి.పాన్ హోల్డర్లు తమ ఆధార్ నంబర్‌ను 2025 డిసెంబర్ 31 లోగా లేదా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మరేదైనా తేదీలోగా ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే, పాన్ హోల్డర్లు తమ ఆధార్ నంబర్‌ను ఆదాయపు పన్ను శాఖకు అందించడంలో విఫలమైతే ఏమి జరుగుతుందో మాత్రం పేర్కొనలేదు. గడువు తేదీలోగా ఆదాయపు పన్ను శాఖకు ఆధార్ నంబర్ తెలియజేయకపోతే 2026 జనవరి 1 నుంచి పాన్ పనిచేయకపోవచ్చు. అయితే ఈ విషయంలో ఆదాయపు పన్ను శాఖ నుంచి మరింత స్పష్టత వస్తే బాగుంటుందని వాధ్వా పేర్కొన్నారు.




## ఇల్లు అమ్మిన ఇషా అంబానీ

**జనంసాక్షి:**భారతీయ బిలియనీర్ ముకేశ్–నీతా అంబానీల కుమార్తె ఇషా అంబానీ కాలిఫోర్నియాలోని లాస్ ఏంజిల్స్‌లో ఉన్న తన 38,000 చదరపు అడుగుల భవనాన్ని విక్రయించారు.జెన్నిఫర్ లోపెజ్–బెన్ అఫ్లెక్ హాలీవుడ్ జంట దీన్ని సొంతం చేసుకుంది. బెవర్లీ హిల్స్‌లో ఉన్న ఈ విశాలమైన ప్రాపర్టీ విలువ 61 మిలియన్ డాలర్లు (సుమారు రూ.500 కోట్లకు పైగా) అని హిందుస్థాన్ టైమ్స్ తెలిపింది. ఇషా భవనాన్ని కొనుగోలు చేయడానికి ముందు ఈ ఇద్దరు నటులు తమ ఆస్తులను కొన్నింటిని విక్రయించారు. అఫ్లెక్ తన పసిఫిక్ పాలిసేడ్స్ నివాసాన్ని 28.5 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.237 కోట్లు) విక్రయించగా, లోపెజ్ తన బెల్ ఎయిర్ భవనాన్ని 34 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.283 కోట్లు) అమ్మారు. ఇషా అంబానీ అమ్మిన ఈ భవనంలో ఇన్ఫినిటీ పూల్, 24 బాత్రూంలు, అవుట్ డోర్ కిచెన్, సెలూన్, బాక్సింగ్ రింగ్‌తో కూడిన జిమ్, 12 పడక గదులతోపాటు అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయి. 2022లో ఇషా అంబానీ, ఆనంద్ పిరమల్ ఈ లగ్జరీ బెవర్లీ హిల్స్ ప్రాపర్టీలో ఎక్కువ సమయమే గడిపారు. ప్రపంచ వ్యాపార రంగంలో ప్రముఖ వ్యక్తిగా ఉన్న ఇషా అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దాతృత్వ కార్యక్రమాల్లోనూ ఆమె చురుకుగా పాల్గొంటున్నారు. వృత్తిపరమైన విజయాలతోపాటు ఇషా తన విలాసవంతమైన జీవనశైలికి ప్రసిద్ధి చెందారు. ప్రీమియం ఆస్తులు, లగ్జరీ కార్లు, అద్భుతమైన ఆభరణాలు, డిజైనర్ దుస్తులు.. ఇలా చాలా విభాగాల్లో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. పిరమాల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ పిరమాల్‌ను వివాహం చేసుకున్న ఆమె దక్షిణ ముంబైలో ఉన్న గులిటా అనే సముద్రం ఒడ్డున ఉన్న భవనంలో నివసిస్తున్నారు.


## పలు దేశాల్లో భూకంపం..

### ఉత్తర భారతంలోనూ భూ ప్రకంపనలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి)**నేపాల్‌ను శుక్రవారం సాయంత్రం స్వల్ప భూకంపం వణికించింది. రిక్టర్ స్కేల్‌పై 5.0 తీవ్రతతో గరా?కోట్‌కు మూడు కి.మీ దూరంలో 20కి.మీ లోతులో భూకంప కేంద్రం రికార్డయ్యింది. ఈ ప్రభావంతో ఉత్తర భారతంలోనూ పలు ప్రాంతాల్లో కొన్ని సెకండ్లపాటు భూమి కంపించింది.నేపాల్‌లో శుక్రవారం సాయంత్రం 7.52 గంటల సమయంలో ఇది రికార్డయినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఆ సమయంలో ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో పలు చోట్ల భూప్రకంపనలు చోటుచేసుకుంది.మరోవైపు జపాన్‌లోనూ గత 24 గంటల్లో నాలుగుసార్లు భూమి కంపించింది. తాజాగా హొక్కాయిడో ఒట్రాడాలో 4.7 తీవ్రతతో భూమి కంపించింది. రెండ్రోజుల కిందట.. కాగోషిమా నిషినూమోటో కేంద్రంగా 6.2 తీవ్రతతో భూకంపం సంభవించింది.మరోవైపు.. పపువా న్యూ గినియాలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.9గా నమోదు అయింది. పశ్చిమ న్యూ బ్రిటన్ ప్రావిన్స్‌లోని కింబే పట్టణానికి 194 కి.మీ దూరంలో భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే పేర్కొంది. 10 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. దీంతో సునామీ హెచ్చరికలు జారీచేసింది.ఇదిలా ఉంటే.. మార్చి 28వ తేదీన మయన్మార్, థాయ్‌లాండ్‌లలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఒక్క మయన్మార్‌లోనే మూడువేల మందికిపైగా చనిపోయారు. వేల సంఖ్యలో గాయపడ్డారు. పలువురు గల్లంతయ్యారు. పలు దేశాల రెస్క్యూ సిబ్బంది సహాయచర్యలు కొనసాగిస్తున్నారు.

# బిల్‌గేట్స్‌కు నిరసన సెగ..

### ఏకంగా ఆయన ఎదుటే సంస్థ ఉద్యోగుల ఆందోళన • 'ఇది నీకు సిగ్గుచేటు'..అంటూ తీవ్రవ్యాఖ్యలు



**జనంసాక్షి:**50వ మైక్రోసాఫ్ట్ వార్షికోత్సవ వేడుకలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఇజ్రాయిల్ మిలటరీకి ఏఐ టెక్నాలజీని అందిస్తుండటాన్ని వారు వ్యతిరేకించారు.మైక్రోసాఫ్ట్ ఏఐ సీఈఓ 'ముస్తఫా సులేమాన్' ప్రజెంటేషన్ ఇస్తున్న సమయంలో ఈ పరిణామ చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముస్తఫా సులేమాన్ ప్రజెంటేషన్ ఇస్తున్న సమయం లో.. మైక్రోసాఫ్ట్ ఉద్యోగి ఇబ్తిహాల్ అబౌసాద్ వేదిక వద్దకు వచ్చి ఆయన వ్యాఖ్యలకు అంతరాయం కలిగించారు. ముస్తఫా.. ఇది నీకు సిగ్గుచేటు. ఏఐను మంచి కోసం ఉప యోగి స్తున్నామని మీరు చెబుతున్నారు. కానీ గాజా ఘర్షణ సమయంలో ఇజ్రాయెల్ మిలటరీకి ఏఐ టెక్నా లజీని అందించి.. 50వేల మంది మరణానికి కారణమైంది. మైక్రోసాఫ్ట్ మారణహోమానికి సహాయం చేసిందని అన్నారు. నేను మీ మాటలు వింటున్నాను, థాంక్యూ అంటూ.. ఆమె మాటలకు ముస్తఫా స్పందించారు. ఈ కార్యక్ర మంలో మైక్రోసాఫ్ట్ కో ఫౌండర్ బిల్ గేట్స్, సీఈఓ సత్య నాదెళ్ల, మాజీ సీఈఓ స్టీవ్ బాల్మెర్ కూడా ఉన్నారు. ఇబ్తిహాల్ అబౌసాద్ నిరసన తెలిపిన తరువా త.. మరో ఉద్యోగి వానియా అగర్వాల్ కూడా నిరసన తెలిపారు. మైక్రోసాఫ్ట్ వార్షికోత్సవ వేడుకలో వీరు నిరసన తెలిపినందుకు వారు తమ వర్క్ అకౌం ట్ యాక్సెస్ కోల్పోయినట్లు సమాచారం. వారి ఉద్యోగం తొలగించి ఉండొచ్చని తెలుస్తోంది.

# జాతీయం అంతర్జాతీయం

## ఇకనైనా రష్యాపై ఒత్తిడి తేవాలి

కాల్పుల విరమణ అంశంపై జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యాపై అమెరికా ఇప్పటికైనా ఒత్తిడి పెంచాలి అని డిమాండ్ చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా వీడియాలో మాట్లాడుతూ.. రష్యా క్షిపణి దాడి తర్వాత ప్రస్తుతం క్రివీ రిహ్‌లో రెస్క్యూ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి, ఆరుగురు పిల్లలు సహా 16 మంది మరణించారు. ఖార్కివ్ లక్ష్యంగా చేసుకున్న రష్యన్ డ్రోన్ దాడి తర్వాత రోజంతా సహాయక చర్యలు కొనసాగాయి. ఆరు "షాహెద్" డ్రోన్‌లతో రష్యా సైన్యం ఉద్దేశపూర్వకంగా దాడి చేసింది. ఈ దాడులు ప్రమాదవశాత్తు జరగలేదు. రష్యా స్వయంగా అమెరికాతో కాల్పులు విరమణ గురించి చర్చించినప్పటికీ దాడులను కొనసాగిస్తోంది. కాల్పుల విరమణను రష్యా అధ్యక్షుడు పుతిన్ పదేపదే ఉల్లంఘిస్తున్నారు.అందుకే రష్యాపై ఒత్తిడి చాలా అవసరం. రష్యాపై ఇంకా ఆంక్షలు విధించాలి. కాల్పుల విరమణకు సంబంధించి పుతిన్‌పై అన్ని విధాలుగా ఒత్తిడి తెస్తేనే రష్యా దాడులు చేయకుండా ఉండగలదు. మార్చి 11వ తేదీ నుంచి పుతిన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూనే ఉన్నారు. చర్చల ద్వారా రష్యాపై ఒత్తిడి పెంచాలి. అప్పుడే పుతిన్ దారిలోకి వస్తారు అంటూ చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా, ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత.. యుద్ధంపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే.



చాపకింద నీరులా..

# ట్రంప్ మరో బాంబు

### గప్‌చుప్‌గా ఆసియా రీజియన్‌లో భారీగా సైన్య మోహరింపు

**వాషింగ్టన్:** ఒకవైపు ప్రపంచమంతా ట్రంప్ టారిఫ్ గురించి చర్చించుకుంటున్న వేళ.. అమెరికా అనూహ్య చర్యలకు దిగింది. గప్‌చుప్‌గా ఆసియా రీజియన్‌లో భారీగా సైన్య మోహరింపునకు దిగింది. ఇందులో భాగంగా ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన బీ–2 బాంబర్ విమానాలను రంగంలోకి దించడం తీవ్ర చర్చనీయాంశమైంది. బీ–2 స్టెల్త్ బాంబర్లకు ప్రపంచంలోనే అత్యాధునికమైన యుద్ధవిమానాలుగా పేరుంది. అమెరికాలో అలాంటివి 20 ఉండగా.. వాటిలో ఆరింటిని హిందూ మహాసముద్ర రీజియన్‌లోని యూఎస్–బ్రిటన్ మిలిటరీ బేస్ డియాగో గార్సియా రన్‌వేపై మోహరింపజేశారు. ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే రాడార్ సిగ్నల్స్ కూడా అందకుండా.. షెల్టర్‌లో మరిన్ని బాంబర్లు ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు..ఇండో ఫసిఫిక్ రీజియన్‌లోనూ యుద్ధవిమానాల గస్తీని అమెరికా పెంచాలని అమెరికా భావిస్తోంది. ఇప్పటిదాకా ఒక విమాన వాహక నౌకతోనే గస్తీ నిర్వహిస్తుండగా.. ఆ సంఖ్యను 3కి పెంచే యోచనలో ఉంది. హిందూ మహాసముద్రం రీజియన్‌లో రెండు, దక్షిణ చైనా సముద్రానికి దగ్గరగా వెస్ట్రన్ పసిఫిక్ దగ్గర ఒక విమాన వాహక నౌకతో గస్తీ ఉంచాలనుకుంటోంది. అంతేకాదు ఈ మోహరింపు మునుముందు మరింత పెరగనుందని అమెరికా రక్షణ కార్యాలయం పెంటగాన్ ధృవీకరించింది. అయితే.. ఈ చర్యలను భారీ వ్యూహాత్మక ఎత్తుగడగా విశ్లేషకులు భావిస్తున్నారు.ఆయా రీజియన్‌లలో అమెరికా రక్షణాత్మక వైఖరిని మెరుగుపరచడానికి ఈ మోహరింపు అని పెంటగాన్ ప్రకటించుకుంది. అదే సమయంలో.. భాగస్వామ్య దేశాల భద్రతకు అమెరికా కట్టుబడి ఉందని, ఈ క్రమంలోనే దాడులు, అంతర్యుద్ధాలు, రాజకీయ సంక్షోభాలు.. వాటికి కొనసాగింపుగా చెలరేగే ఉద్రిక్తతలను కట్టడి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెబుతోంది. అమెరికా ఏ దేశం, ఏ సంస్థల పేర్లు ప్రకటించకపోయినప్పటికీ.. మిడిల్ ఈస్ట్, దక్షిణాసియా పరిస్థితుల నేపథ్యంలోనే అమెరికా ఈ చర్యలకు దిగిందన్నది విశ్లేషకుల మాట. ప్రధానంగా ఇరాన్, యెమెన్‌లతో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలోనే సైన్యాన్ని రంగంలోకి దించుతోందని భావిస్తున్నారు.గత వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగానే హౌతీలకు వార్నింగ్ ఇచ్చారు. అమెరికా నౌకలపై దాడులు ఆపకపోతే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని యెమెన్‌ను, మద్ధతుగా నిలిచిన ఇరాన్‌ను హెచ్చరించారాయన. అలాగే.. అణు ఒప్పందం విషయంలోనూ ఇరాన్‌ను హెచ్చరిస్తూ వస్తున్నది చూస్తున్నాం.అయితే రక్షణ రంగ నిపుణులు మాత్రం బీ–2 లాంటి శక్తివంతమైన బాంబర్లను కేవలం హౌతీలు, ఇరాన్ కోసమే మోహరింపజేసి ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ముఖ్యంగా యెమెన్‌పై దాడికి ఇది చాలా ఎక్కువనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. పనిలో పనిగా ఇరాన్ మిత్రపక్షాలైన చైనా, రష్యాలకు కూడా ట్రంప్ హెచ్చరికల సంకేతాలు పంపిస్తున్నారనే చర్చ మొదలైంది ఇప్పుడు.దక్షిణ చైనా సముద్రానికి దగ్గరగా వెస్ట్రన్ పసిఫిక్ వద్ద యూఎస్ఎస్ నిమిట్జ్ క్యారీయర్‌ను, మిడిల్ ఈస్ట్‌లో యూఎస్ఎస్ కార్ల్ విన్‌సన్ వాహక నౌకను మోహరింపజేయడమే ఇందుకు ఉదాహరణలుగా చెబుతున్నారు. దీంతో ట్రంప్ ఆలోచన అంతకు మించే ఉందన్న చర్చ నడుస్తోంది.

## ఎవరిని కదిలించినా కన్నీరే..

### కోల్‌కతా టీచర్ల కుటుంబాల్లో నెలకొన్న దీనస్థితి

### సుప్రీం తీర్పుతో గమ్యగోచరంగా మారిన జీవితాలు



**జనంసాక్షి:**ఇది ఏ ఒక్కరి పరిస్థితో కాదు.. సుమారు 25 వేల మందికిపైగా ఉద్యోగస్తుల పరిస్థితి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇదే టాపిక్. 2016 టీచర్ల నియమాకాల రద్దు టాపిక్..ప్రస్తుతం హాట్ టాపిక్ అయ్యింది. ఎంతో హాయిగా తమ జీవితాల్లోకి వెలుగొచ్చిందని అనుకుంటుండగానే వారి జీవితాల్లో చీకటి అలుముకుంది. టీచర్లగా ఉద్యోగాలు చేస్తూ సంఘంలో ఎంతో గౌరవంగా బతుకుతున్న వారి జీవితాలను కారు మబ్బు అలుముకుంది. తమ నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో టీచర్ల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. దేశ అత్యున్నత ధర్మాసనం తీర్పు ఇలా ఉంటే ఇక ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ టీచర్ల కుటుంబాల్లో కన్నీటి వరదలే తారసపడుతున్నాయి.పశ్చిమ బెంగాల్‌లో 2016 నుంచి పనిచేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ రెండు రోజుల క్రితం తీర్పు ఇవ్వడంపై ఆ టీచర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. టీచర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ నియమాకాలు కలిపి 25 వేల 753 పోస్టులను చెల్లవంటూ సుప్రీంకోర్టు నుంచి తీర్పు వచ్చిన నేపథ్యంలో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక తమ జీవితాలు ఇంతేనా.. అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎందుకిలా జరిగింది.. మాకే ఎందుకు ఇలా జరిగింది అంటూ మౌనంగా రోదిస్తున్నారు.2016లో టీచర్ గా నియమించబడ్డ రజత్ హల్దార్ మాట్లాడుతూ.. ' మాకు మాటలు రావడం లేదు. మేము అర్హత సాధించిన టీచర్లం. మాకు ఎటువంటి ఆరోపణలు లేవు. సుమారు 19 వేల మంది టీచింగ్ స్టాఫ్ పై ఎటువంటి అభ్యంతరాలు లేవు. కానీ మమ్మల్ని వారు అనర్హులు అంటూ సుప్రీంకోర్టు ప్రకటించడంతో మాకు ఏమీ చెప్పుకోవాలో.. ఎవరి చెప్పుకోవాలో తెలయని స్థితిలో ఉన్నాం. సుప్రీంకోర్టు తీర్పుతో మాకు అన్యాయం జరిగింది. ఇది న్యాయబద్ధమైన తీర్పు కాదు. ఏ దర్యాప్తు సంస్థలు కూడా మా నియామకం చట్టబద్ధతలో జరగలేదని చెప్పలేదు. మేము ఎటువంటి తప్పు చేయలేదు' అంటూ గద్గద స్వరంతో చెప్పుకొచ్చాడు.కాగా, వెస్ట్ బెంగాల్‌లో 2016 నుంచి పనిచేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాల ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు 2024 లో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. నియామకాల్లో భారీ అక్రమాలు, అవకతవకలకు పాల్పడిన పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్(డబ్ల్యూబీఎస్ఎస్‌సీ)కు అత్యున్నత న్యాయస్థానం తలంటింది.మొత్తం 25,753 మంది ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాల్లో అవకతవకలను, లోపాలను ఉద్దేశపూర్వకంగానే కప్పిపుచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ..మొత్తం నియామకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. మళ్లీ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం గురువారం ఆదేశించింది. మరికొద్ది నెలల్లో అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా చోటుచేసుకున్న ఈ పరిణామం మమతా సర్కారు గట్టి ఎదురుదెబ్బగా విశ్లేషకులు చెబుతున్నారు.

# ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ పనులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 5 (జనంసాక్షి)**



వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్ పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ మద్యమాలకు ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన ముంపు గ్రామాల ప్రజలకు ఈ ప్రాంతంలో ఉపాధి లేక ఇబ్బంది పడటం చూసిన వాడిగా మీకు ఉపాధి కల్పించడం కోసం పనులు ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభం చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ అని,దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి పేద ప్రజలకు ఉపయోగపడే పథలకలను తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమాన్నారు.ఆనాడు గరిబి హటావో, బ్యాంకుల జతీయకరణ,ఇందిరమ్మ ఇల్లు, విద్యుత్ సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు.మన ప్రాంతంలో అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం జరిగిందని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయత్వంలో రైసింగ్ తెలంగాణ పేరుతో ముందుకు పోతుందన్నారు.ప్రజా ప్రభుత్వం లో ఇచ్చినా హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నమని,పేద ధనిక తేడా లేకుండా ప్రజలందరికీ సన్నం బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు .ఎన్నికల్లో హామీ ఇవ్వకున్న ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమని, ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేస్తునామన్నారు.3500 మంది ఉపాధి హామీ కూలీలకు ఉపాధి హామీ ద్వారా 100 రోజుల పని కల్పిస్తున్నామని ,ఒక్క రోజు పనికి రూ 300 పైచిలుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డు అందించి పని కల్పిస్తమని,ఉపాధి హామీ పనికి వెళ్ళడం ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి కూడా అర్హులుగా అవుతారన్నారు. ఫిష్ ఫండ్ లు ఉపాధి హామీ కూలీలకు, మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు .రేవంత్ రెడ్డి నాయత్వంలో ప్రజా ప్రభుత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సి వర్గీకరణ బిల్లలను అసెంబ్లీ లో అమోదం తెలపడం జరిగింది.రుద్రవరం గ్రామానికి నూతనంగా సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరిగిందనీ,ఇప్పటికే టెండర్లు పూర్తయి పనులు ప్రారంభం కానున్నాయన్నారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలని నిన్నటి రోజున మన ప్రాంతంలో రూ 13 కోట్ల 66 లక్షలతో 4 నూతన సబ్ స్టేషన్ లను మంజూరు చేయడం జరిగిందన్నారు.ప్రజా ప్రభుత్వంలో 15 నెలల్లోనే వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 10 ,33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేయడం జరిగిందని,పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.రాజీవ్ యువ వికాసం ద్వారా సుమారు 5 లక్షల మందికి ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతి నిధులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ఎస్టీపీపీని నంబర్ వన్ పవర్ ప్లాంట్ గా నిలపడానికి కృషి

## నూతన ఈడీగా బాధ్యతలు స్వీకరించిన చెన్నకేశవ చిరంజీవి

**మంచిర్యాల ప్రతినిధి ఏప్రిల్ 06, (జనంసాక్షి)**



: దేశంలోని పవర్ ప్లాంట్లలో జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ను నెంబర్ వన్ స్థానంలో నిలిపే విధంగా కృషి చేస్తానని ఈడి చెన్నకేశవుల చిరంజీవి అన్నారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లా జైపూర్ లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నూతన ఈడి గా నియమించబడిన చెన్నకేశవుల చిరంజీవి నేడు బాధ్యతలు చేపట్టారు . ఈ సందర్భంగా ఈడి ఎస్టిపిపిలోని మైసమ్మ తల్లిని, దేవాలయంలో సీతారామచంద్రాలయంలో సతీ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్టిపిపి జీఎం (ఈ అండ్ ఎం) కే. శ్రీనివాసులు నూతన ఈడి చిరంజీవి పూలమొక్కతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ముందుగా ఎస్టిపిపి జీఎం కే. శ్రీనివాసులు మాట్లాడుతూ.. చెన్నకేశవుల చిరంజీవి ఎన్టిపిసిలో సుమారు 20 సంవత్సరాల పైగా అనుభవం ఉన్నదని, జార?ండ్ రాష్ట్రంలోని ఎన్టిపిసి, నార్త్ ఖరంపురలో ఎ.జీ.ఎం (ఓఎం)గా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో విధులు నిర్వహించారని ప్రస్తుతం ఎస్టిపిపి లో ఈడి గా విధులు నిర్వహించడానికి డిప్యూటేషన్ పై వచ్చారని తెలిపారు. అనంతరం నూతన ఈడి చెన్నకేశవుల చిరంజీవి ఎస్టిపిపిలో పనిచేసే ప్రతి అధికారి మరియు ఉద్యోగి ప్లాంటు అభివృద్ధికి తమవంతు సహకారం అందించి దేశంలోనే అత్యుత్తమ ప్లాంటులలో ఒకటిగా ఎస్టిపిపిని నిలపాలని, తద్వారా సంస్థ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి అలాగే దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.ఈ సందర్భంగా పవర్ ప్లాంట్ లోని వివిధ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న అధికారులు నూతన ఈడిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ (ఓఎం) జే.ఎన్. సింగ్ సింగ్,
సిఎంఓఎఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, ఎ.జీ.ఎం (సివిల్) ప్రసాద్, ఏజిఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అజ్మీరా తుకారాం, ఎస్ఓ టూ ఈడీ ప్రభాకర్ రావు ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 5 (జనంసాక్షి)**

బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలను ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఎస్పీ మహేష్ బి గితె, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూపలతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ జయంతి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. అంతకుముందు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎస్సీ అభివృద్ధి అధికారి రాజ మనోహర్ రావు, ఆయా శాఖల అధికారులు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 5 (జనం సాక్షి)**



: బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేడుకలను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్ర కాంత్ రెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఎంపీ గా, ఉప ప్రధానిగా పనిచేశారని, రాజకీయంగా ఉన్నతుడయ్యాడని తెలిపారు. అంతకుముందు పలువురు పలు సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, ఆర్డీఓ వీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ పాల్గొన్నారు.

## భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

### ఎస్టి జాతీయ కమిషన్ జాటోత్ హుస్సేన్ నాయక్ కి వినతి

**నూగూర్ వెంకటాపురం ఏప్రిల్ 5(జనం సాక్షి) :**



శనివారం నాడు వెంకటాపురం మండలం చింతపల్లి గ్రామంలో బాండ్ మొక్కజొన్న వేసి ప్రాణాలు కోల్పోయిన రైతు కుంటుంబాలను పరామర్శించడానికి వచ్చిన జాతీయ ఎస్టి కమిషనర్ జేటోత్ హుస్సేన్ నాయక్ ని కలిసిన గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం కేంద్రంగా ఒక న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు,ఆదిమ జాతి తెగలు వెనుక బడి ఉన్నారని, మా చట్టాలు జీవోలు పూర్తి స్థాయిలో అమలు కావాలంటే మాకు ప్రత్యేకంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేస్తే మా జీవన విధానానికి లా ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నో ఫిర్యాదు చేసినప్పటికీ ధర్నాలు రాస్తారో చేసినప్పటికీ ఈ ప్రభుత్వం ఆదివాసులపై నిరంకుశ విధానాన్ని చూపుతుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తర్వాత భద్రాచలంకి కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేసి ఆదివాసి జీవన విధానానికి తోడ్పడేలా చూడాలని కోరడం జరిగింది. ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్,వెంకటాపురం మండల నాయకులు పర్శిక అనిల్,పూనెం అర్జున్, బాబురావు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

# నేటి యువతకు స్ఫూర్తి బాబు జగ్జీవన్ రామ్

### సంఘసంస్కర్త జగ్జీవన్ రామ్ ను ఆదర్శంగా తీసుకోవాలి

### బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పలువురు వక్తలు

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :**




స్వాతంత్ర పోరాటంలోనూ నవభారత నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించిన సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కరీంనగర్ లోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ చౌరస్తాలో గల జగ్జీవన్ రామ్ విగ్రహానికి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... చిన్న వయసులో కేంద్ర మంత్రివర్గంలో అనేక పదవులు చేపట్టిన బాబు జగ్జీవన్ రామ్ భారత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. చదువు ద్వారానే జగ్జీవన్ రామ్ అంతటి కీర్తి సంపాదించారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని సూచించారు. ముఖ్యంగా యువత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను నెరవేర్చాలని అన్నారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో, నవభారత నిర్మాణంలో బాబు జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని అన్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. చదువు ద్వారానే ఆయనలో ప్రశ్నించే పోరాడే తత్వం వచ్చిందని తెలిపారు. 50 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పాటు పార్లమెంటేరియన్ గా ప్రజాసేవ చేశారని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ.. సామాజిక న్యాయానికి, భారత అభివృద్ధికి బాబు జగ్జీవన్ రామ్ పోరాటం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. అంతకుముందు ఈనెల 14న నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ర్యాలీకి సంబంధించిన పోస్టర్ని ఆవిష్కరించారు. కులాంతర వివాహం చేసుకున్న ఐదుగురు దంపతులకు వివాహ ప్రోత్సాహక బహుమతి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారధి కళాబృందం ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్, ఎస్సీ అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఎస్సీ ఎస్టీ సంఘాల నేతలు, ప్రజాసంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# నేడు గద్దర్ స్మృతివనం భూమిపూజ

**గద్దర్ గళం ఆధ్వర్యంలో సభా నిర్వహణ**

**హాజరుకానున్న పాశం యాదగిరి, గాదె ఇన్నయ్య**

**పాటపై పాలకుల అణిచివేత దినం సభ**

**ప్రకటించిన గద్దర్ గళం అసోసియేషన్ అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య**



**హైదరాబాద్ (జనంసాక్షి)**

ప్రజాయుద్ధనౌక గద్దర్పై 1997 ఏప్రిల్ 6న కాల్పులు జరిగాయి. ఆ దాడిని నిరసిస్తూ 'గద్దర్ గళం' ఆధ్వర్యంలో తెల్లాపూర్ గద్దర్ విగ్రహం వద్ద పాటపై పాలకుల అణిచివేత దినాన్ని నిర్వహిస్తోంది. గద్దర్ చనిపోయిన ఆరునెలల్లోనే తెల్లాపూర్లో 15 అడుగుల విగ్రహాన్ని గద్దర్గళం అసోసియేషన్ ఏర్పాటు చేసింది. ఆ సందర్భంలో ప్రభుత్వం, అధికారులు భూమిని కేటాయించకపోతే పెద్దెత్తున పోరాటం కొనసాగింది. తెల్లాపూర్ స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆమరణ దీక్ష చేశారు. ఫలితంగా దిగివచ్చిన ప్రభుత్వం తొమ్మిది గుంటల భూమిని కేటాయించింది. అలాగే గద్దర్ జీవిత విశేషాలతో కూడిన స్మృతివనం కూడా ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపింది. అందులో భాగంగా నేడు తెల్లాపూర్ గద్దర్ విగ్రహ ప్రాంగణంలో భూమి పూజతో పాటు గద్దర్కు నివాళి సభను గద్దర్ గళం అసోసియేషన్ ఏర్పాటు చేస్తోంది. ఇట్టి సభలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య, గద్దర్గళం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య, కార్యదర్శి డా.పసునూరి రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గజ్జెల స్వామి, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ తదితరులు పాల్గొంటారు.

# వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 13న మిలియన్ మార్చ్

## కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :**




వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఈ నెల 13న హైదరాబాద్ ట్యాంక్ బండి పై మిలియన్ మార్చ్ నిర్వహించనున్నామని, ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఇమ్రాన్ ప్రతాప్ గరి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లతో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నారని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్ తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తుందని పేర్కొంటూ శనివారం రోజు పలువురు మైనారిటీ నేతలతో కలిసి డిసిసి కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. మహమ్మద్ తాజుద్దీన్ మాట్లాడుతూ... ఈ దేశంలో రైల్వే, రక్షణ శాఖ వక్ఫ్ కు 9.4 లక్షల ఎకరాల భూమి ఉంది. 1995 చట్టం ప్రకారం దేవుని (అల్లా) పేరు మీద ఈ భూములు అల్లా కు ఇవ్వడం జరిగింది. ఈ భూములను ప్రైవేటుపరం చేయడానికి ముస్లింలకు అన్యాయం చేసి, మరొక వర్గం వారిని సంతృప్తి పరచడానికి బిజెపి కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ మెజారిటీతో ఉభయ సభలలో బిల్లును ఆమోదింప చేసిందన్నారు. సెక్యులర్ పార్టీలు అని చెప్పుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, చిరాక్ పాశ్వాన్, దేవగౌడ ముస్లింల ఓట్లను దండుకొని నేడు మతతత్వ పార్టీతో చేతులు కలిపి బిల్లుకు మద్దతు ఇవ్వడం దారుణం అని వీరికి రాబోయే ఎన్నికల్లో ముస్లింలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయకపోతే దేశవ్యాప్తంగా అంచలంచెలుగా నిరంతర ప్రక్రియగా

ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు నిహాల్ అహ్మద్, లయీక్ ఖాద్రి, అబ్దుల్ రెహమాన్, కలిముద్దీన్, మహమ్మద్ అమీర్, మహమ్మద్ చాంద్, మహమ్మద్ పాషా, హనీఫ్, షబానా బేగం, బషీర్, అజ్మత్, సిరాజ్, అక్బర్, ఖురేషి, జాఫర్, ఇర్ఫాన్, ఎంఎం రెహమాన్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు నేర్పించాలి

**మంథని, (జనంసాక్షి)**



పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను నేర్పించాలని, అప్పుడే సమాజాన్ని అర్థం చేసుకునే మంచి నాయకులు తయారవుతారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం సన్ సిటీలోని "గ్లెన్డేల్ అకాడమీ లో నిర్వహించిన "లీడర్ షిప్ డే - 2025" కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... వ్యక్తిత్వ నిర్మాణంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కేవలం మార్కులు మాత్రమే జీవితం కాదని, తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ చూపేలా చిన్నారులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కోరారు. ప్రతి చిన్నారిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని.. ఇతరుల తో పోల్చి వారిపై ఒత్తిడి తేవొద్దన్నారు. అబ్దుల్ కలాం మాటలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థి దశలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని... దాన్ని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి రోజు కొత్త అంశాలను నేర్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. టెక్నాలజీ రోజురోజుకీ కొత్త పుంతలు తరుణంలో వినూత్నంగా ఆలోచించాలన్నారు. అన్ని రంగాల్లో మెరుగ్గా రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జీఎస్ జీ డిప్యూటీ కంట్రీ డైరెక్టర్ అవ్నీష్ సింగ్, గ్లెన్డేల్ గ్రూప్స్ డైరెక్టర్ మీనూ సలూజా, లైఫ్ కోచ్ అండ్ మెంటార్ డా.కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గానికి కడియం చేసిన అభివృద్ధి శూన్యం

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 05 ( జనం సాక్షి ) :**



స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి ఏమీ లేదని పాత పనులని తాను తెచ్చానని చెప్పుకుంటున్నారని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం స్టేషన్ ఘన పూర్ మండల కేంద్రంలో జరిగిన బాబు జగజ్జీవన్ రామ్117వ జయంతివేడుకల్లో పాల్గొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంఎదుట ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి,ఘన నివాళులు అర్పించా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. తాను పవిత్రమైన వైద్య వృత్తిని వదిలి వచ్చినా.. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, రిజర్వాయర్లు తీసుకొస్తే.. తాను చేశానని కడియం చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పిస్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, నాయకులు ఇల్లందుల సుదర్శన్, గుర్రం యాదగిరి, తాటికొండ సురేష్, కనకం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాహుల్ మెరుపులతో..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకన్న ఢిల్లీకి సీఎస్కే పేసర్ ఖలీల్ అహ్మద్ ఆదిలోనే షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(0)ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. సున్నాకే వికెట్ పడిన వేళ కేఎల్ రాహుల్(77), అభిషేక్ పోరెల్(33)లు దూకుడుగా ఆడి సీఎస్కేపై ఒత్తిడి పెంచారు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో పొరెల్ వెనుదిరగడంతో 54 పరుగుల వద్ద ఢిల్లీ రెండో వికెట్ కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ అక్షర్ పటేల్(21) ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో స్ట్రెయిట్‌గా భారీ సిక్సర్ బాదిన అతడు.. నూర్ అహ్మద్ బౌలింగ్‌ను అంచనా వేయలేక క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దాంతో, 90 వద్ద ఢిల్లీ మూడో వికెట్ పడింది.

# రాణించిన యశస్వి

## పంజాబ్ టార్గెట్ 206



**చండీగఢ్:** ఐపీఎల్ 2025లో భాగంగా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన రాజస్థాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (67. 45 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్ లు) ఈ సీజన్లో తొలిసారి హాఫ్ సెంచరీ బాదాడు. చివర్లో రియాన్ పరాగ్ (43. 25 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సు) మెరుపులు మెరిపించాడు. కెప్టెన్ సంజు శాంసన్ (38. 26 బంతుల్లో 6 ఫోర్లు) రాణించాడు. నితీష్ రాణా (12), హెట్మయర్ (20), ధ్రువ్ జురెల్ (13: 5 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో ఫెర్గూసన్ 2, అర్షదీప్, మార్కో యాన్సెన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. జైస్వాల్, శాంసన్ రాజస్థాన్కు శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్కు 89 పరుగులు జోడించింది. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో జైస్వాల్ వరుసగా రెండు సిక్సు బాదాడు. మరోవైపు, శాంసన్ నిలకడగా బౌండరీలు రాబట్టాడు. 10 ఓవర్లకు రాజస్థాన్ వికెట్ నష్టపోకుండా 85 పరుగులు చేసింది. ఫెర్గూసన్ వేసిన 11వ ఓవర్లో శాంసన్.. శ్రేయస్‌కు క్యాచ్ ఇచ్చాడు. చాహల్ వేసిన 12వ ఓవర్లో జైస్వాల్ వరుసగా ఫోర్, సిక్స్ కొట్టాడు. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ (40 బంతుల్లో) అందుకున్నాడు. స్థాయినిస్ బౌలింగ్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టిన యశస్వి.. ఫెర్గూసన్ బౌలింగ్లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. నితీశ్ రాణాను మార్కో యాన్సెన్ వెనక్కి పంపాడు. 15 ఓవర్లకు రాజస్థాన్ 142/3తో నిలవగా.. తర్వాత రియాన్ పరాగ్, హెట్మయర్ దూకుడు పెంచారు. అర్షదీప్ బౌలింగ్ లో పరాగ్ రెండు ఫోర్లు కొట్టాడు. ఫెర్గూసన్ వేసిన 17వ ఓవర్లో హెట్మయర్ సిక్స్ బాదాడు. యాన్సెన్ వేసిన 18వ ఓవర్లో పరాగ్ వరుసగా రెండు సిక్సర్లు బాదేశాడు. అర్ష్దీప్ వేసిన 19వ ఓవర్లో హెట్మయర్.. మ్యాక్స్వెల్కు క్యాచ్ ఇచ్చాడు.





# ఢిల్లీ హ్యాట్రిక్

## ఛేదనలో మరోసారి చిత్తైన సూపర్ కింగ్స్

- చెన్నైను 25 పరుగుల తేడాతో ఓడించిన ఢిల్లీ క్యాపిటల్స్
- కొనసాగుతున్న కేఎల్ రాహుల్ జైత్రయాత్ర

ఐపీఎల్ 18 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలిరెండు మ్యాచుల్లో విజయాలు సాధించిన ఢిల్లీ మూడో పోరులోనూ విజయభేరి మోగించింది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను 25 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. కేఎల్ రాహుల్(77) అర్ధ శతకంతో చెలరేగగా.. బౌలర్లు ఆదిలోనే వికెట్లు తీసి చెన్నైని ఓటమి అంచులోకి నెట్టారు. పవర్ ప్లేలో 41 రన్స్‌కే 3 కీలక వికెట్లు కోల్పోయిన సీఎస్కే ఏ దశలోనూ కోలుకోలేదు. ఆఖర్లో విజయ్ శంకర్(68 నాటౌట్), ఎంఎస్ ధోనీ (30 నాటౌట్)లు పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు.

ఛేదన అంటే చాలు చెన్నై సూపర్ కింగ్స్ తడబడుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సీఎస్కేచతికిలపడింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 184 పరుగుల ఛేదనలో టాపార్డర్ వైఫల్యంతో ఓటమి అంచుల్లోకి వెళ్లింది. తొలి ఓవర్లోనే రిటర్న్ క్యాచ్‌తో రచిన్ రవీంద్ర(3)ను వెనక్కి పంపాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే డెవాన్ కాన్వే(13)ను విప్రజ్ నిగమ్ బోల్తా కొట్టించాడు.

ఆ కాసేపటికే మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(5) పెద్ద షాట్ ఆడగా.. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ అందుకున్నాడు. దాంతో, 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆపద్బాంధవుడు శివం దూబే(18), రవీంద్ర జడేజా(2)లు ఘోరంగా విఫలమయ్యారు. దూబే ఔట్ అయ్యాక.. విజయ్ శంకర్(68 నాటౌట్) అండగా ఎంఎస్ ధోనీ(30 నాటౌట్) చివరివరకూ పోరాడాడు. ఆరో వికెట్‌కు 84 పరుగులు జోడించినా ఓటమి తప్పించలేకపోయారు.

ఐపీఎల్ 18 సీజన్లో చెన్నై సూపర్ కింగ్స్ హ్యాట్రిక్ ఓటమి చవిచూసింది. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్లో చెన్నైపై దిల్లీ క్యాపిటల్స్ 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. 184 పరుగుల లక్ష్యఛేదనలో సీఎస్కే 158/5 స్కోరుకే పరిమితమైంది. విజయ్ శంకర్ (69: 54 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే పోరాడాడు. రచిన్ రవీంద్ర (3), డేవాన్ కాన్వే (13), రుతురాజ్ గైక్వాడ్ (5), శివమ్ దూబె (18), రవీంద్ర జడేజా (2) పరుగులు చేశారు. ఎంఎస్ ధోనీ (30. 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) నాటౌట్గా నిలిచాడు. దిల్లీ బౌలర్లలో విప్రాజ్ నిగమ్ 2, మిచెల్ స్టార్క్, ముకేశ్ కుమార్, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ పడగొట్టారు. దిల్లీకి ఇది వరుసగా మూడో విజయం కాగా.. చెన్నైకి హ్యాట్రిక్ ఓటమి. ఢిల్లీ జట్టు 15 ఏళ్ల తర్వాత చెన్నైలో సీఎస్కేను ఓడించడం విశేషం.

టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన దిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (77. 51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సు) అర్ధ శతకంతో అదరగొట్టాడు. అభిషేక్ పొరెల్ (33. 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అక్షర్ పటేల్ (21. 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), సమీర్ రిజ్వీ (20. 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (22: 11 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. సీఎస్కే బౌలర్లలో ఖలీల్ అహ్మద్ 2, రవీంద్ర జడేజా, నూర్ అహ్మద్, మతీశా పతిరన చెరో వికెట్ తీశారు.

### కేఎల్ రాహుల్(77)

అక్షర్ పటేల్ వెనుదిరిగాక కేఎల్ రాహుల్ గేర్ మార్చాడు. చెన్నై స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలతో చెపాక్‌ను హోరెత్తించాడు. 33 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకన్న రాహుల్ ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. సమీర్ రిజ్వీతో కలిసి నాలుగో వికెట్‌కు 56 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఢిల్లీ స్కోర్ బోర్డును ఉరికిస్తున్న ఈ జోడీని ఖలీల్ విడదీశాడు. ఆ తర్వాత ఎంట్రీ ఇచ్చిన ట్రిస్టన్ స్టబ్స్(21) రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో జట్టు స్కోర్ 180 దాటించాడు. పథిరన వేసిన 20వ ఓవర్లో రాహుల్, ఫినిషర్ అశుతోష్ శర్మ(1)లు ఔట్ కావడంతో ఢిల్లీ 183 పరుగులకే పరిమితమైంది.

## పవర్ ప్లేలో కీలక వికెట్లు కోల్పోయాం

### చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్

బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ వైఫల్యం తమ ఓటమిని శాసించిందని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన చెన్నై సూపర్ కింగ్స్ 25 పరుగుల తేడాతో చిత్తయ్యింది. ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన రుతురాజ్ గైక్వాడ్.. పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోవడం తమ విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. బౌలింగ్‌లోనూ 15-20 పరుగులు అదనంగా ఇచ్చినట్లు అంగీకరించాడు. ఢిల్లీ బౌలర్లు అసాధారణ ప్రదర్శనతో తమ పతనాన్ని శాసించారని కొనియాడాడు. పరిస్థితులకు తగ్గట్లు బౌలింగ్ చేసి తమను దెబ్బ తీసారని తెలిపాడు. పవర్ ప్లేలో అతి జాగ్రత్తగా బ్యాటింగ్, బౌలింగ్ చేస్తుండటంతోనే హ్యాట్రిక్ పరాజయాలను ఎదుర్కొన్నామన్నారు.



## పంత్‌కు రూ.12 లక్షలు..జరిమానా

ముంబయి ఇండియన్స్ను చిత్తు చేసిన లఖ్ నవూ సూపర్ జెయింట్స్‌కు షాక్ తగిలింది. ఎల్ఎస్ఏ కెప్టెన్ రిషబ్ పంత్ తోపాటు యువ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠికి జరిమానా విధిస్తూ ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ నిర్ణయం తీసుకుంది. లఖ్నవూలోని అటల్ బిహారీ వాజ్పేయీ ఏకనా స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగింది. పంత్‌కు రూ.12 లక్షలు జరిమానా విధించగా.. యువ బౌలర్ దిగ్వేశ్ వరుసగా రెండోసారి ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ఆగ్రహానికి గురికావడం గమనార్హం. "లఖ్నవూ సూపర్ జెయింట్స్ సారథి రిషబ్ పంత్‌కు జరిమానా విధించాం. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆర్టికల్ 2.22 ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పంత్ కు రూ. 12 లక్షలు జరిమానా విధించాం" అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ తెలిపింది. ఐపీఎల్ 2025 సీజన్లో 'స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా ఎదుర్కొన్న మూడో సారథి రిషబ్ పంత్. ఇంతకుముందు హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్‌పై ఫైన్ పడింది.

**దిగ్వేశ్ ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు**

ముంబయిపై లఖ్ నవూ విజయం సాధించడంలో దిగ్వేశ్ రాఠి కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్ల స్పెల్లో ఒక్క వికెట్ తీసి 21 పరుగులు మాత్రమే ఇచ్చాడు. కీలకమైన నమన్ ధీర్ (46)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో అతడికే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. అయితే, నమన్ ను ఔట్ చేసిన తర్వాత కూడా 'సంతకం' చేసినట్లుగా సంబరాలు నిర్వహించడంపై మ్యాచ్ రిఫరీ ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 2.5 కోడ్ ఆఫ్ కండక్ట్ లెవెల్ 1 నేరం కిందకు వస్తుందని.. దీంతో అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించినట్లు కమిటీ వెల్లడించింది. ఇప్పటికే పంజాబ్లో జరిగిన మ్యాచ్‌లోనే ఇలానే వ్యవహరించిన సంగతి తెలిసిందే. అప్పుడు ఒక డీమెరిట్ పాయింట్ వచ్చింది. ఇప్పుడీ ఘటనతో మరో రెండు డీమెరిట్ పాయింట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో అతడి ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు ఉన్నట్లైంది.

## హ్యాట్రిక్ విజయాలు అస్సలు ఊహించలేదు

### ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్

ఐపీఎల్ 2025 సీజన్‌లో హ్యాట్రిక్ విజయాలు దక్కుతాయని తాను అస్సలు ఊహించలేదని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఢిల్లీ క్యాపిటల్స్ 25 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ సీజన్‌లో ఢిల్లీకి ఇది వరుసగా మూడో విజయం. మ్యాచ్ అనంతరం తమ వరుస విజయాలపై అక్షర్ పటేల్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇంత సునాయసంగా హ్యాట్రిక్ విజయాలు అందుకుంటామని తాము అస్సలు ఊహించలేదన్నాడు. సమష్టి ప్రదర్శనతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అభిప్రాయపడ్డాడు.ఇంత సునాయసంగా హ్యాట్రిక్ విజయాలు సాధిస్తామని అస్సలు ఊహించలేదు.

## డగౌట్ నుండి ముంబై టీమ్‌కు రోహిత్ సూచనలు



డగౌట్‌లో ఉండి, ఎప్పటికప్పుడు మ్యాచ్‌ను అంచనా వేస్తూ, ముంబై టీమ్‌కు రోహిత్ సూచనఈ సీజన్‌లో పూరన్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు 75, 70, 44 పరుగులతో ఆరెంజ్ క్యాప్‌ను కూడా తన సొంతం చేసుకున్నాడు. ఇక ముంబైతోనూ సూపర్ టచ్ లో కన్పించిన పూరన్ ను స్లో బౌన్సర్ తో హార్దిక్ బోల్తా కొట్టించాడు. అతనికి అలా బౌలింగ్ చేయాలని రోహితే సూచించినట్లు కామెంటేటర్ సబా కరీం తెలిపాడు. పూరన్ వికెట్ పడిన తర్వాత ఉద్వేగంతో రోహిత్ ప్రవర్తించిన విధానంపై కరీం మాట్లాడాడు. ఇక ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై 12 పరుగులతో ఓడిపోయింది. ఇక మ్యాచ్‌లో రోహిత్ ఇన్వాల్వ్ మెంట్ పై నెటిజన్లు ప్రశంసిస్తూ పోస్టులు పెడుతున్నారు. గాయాలతో ఇబ్బంది పడుతున్న స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా, రోహిత్ త్వరలోనే జట్టులోకి వస్తారని హార్దిక్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

# నేడు రాములోరి కళ్యాణం


## రామయ్య కల్యాణానికి సర్వం సిద్ధం

### ఆలయంలో ఏర్పాట్లు పూర్తి

- లక్షకు పైగా భక్తులు వస్తారని అధికారుల అంచనా
- ఆలయం అధ్వర్యంలో భక్తులకు అన్నదానం
- భక్తులకు త్రాగునీరు,మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు







రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 5 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోనే హరిహర క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం శ్రీ సీతరాముల కళ్యాణ మహోత్సవం కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రతియేటా రాజన్న సన్నిధిలో శ్రీ సీత రాముల కళ్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం సైతం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారు లు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 30 న మొదలైన శ్రీరామ నవరాత్రి ఉత్సవములు నేడు జరుగుతున్న రామయ్య కళ్యాణంతో ముగుస్తాయి. శ్రీ సీతరాముల కళ్యాణం మహోత్సవం తిలకించడానికి సుమారు లక్ష మందికి పైగా భక్తులు వస్తారని ఆలయ అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీ సీతరాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఆలయ చైర్మన్ ఛాంబర్ ఎదురుగా విశాలమైనా కళ్యాణ వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 09.30 నిమిషాల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అభిజిత్ లగ్న సుముహుర్త మున అర్చకులు కళ్యాణం జరిపించనున్నారు. భక్తులు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు ఆలయం ముందు భాగంలో ఎండ ప్రభావం ఉండకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులు కళ్యాణం తిలకించడానికి ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో భక్తులకు దాతల సహకారంతో మంచినీళ్ల ప్యాకె ట్స్, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు అందించేం దకు సిద్ధం చేశారు. శ్రీ సీతరాముల కళ్యాణం అనంతరం సాయంత్రం 5 గంటలకు వైభవంగా రథోత్సవం నిర్వహించ నున్నారు.రాత్రి 7.30లకు శ్రీ సీతరామ చంద్ర స్వామి వారి ఆలయంలో డోలోత్సవం నిర్వహిస్తారు. భక్తుల కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఏర్పాట్లను చేశారు. ముఖ్యంగా ప్రథమ చికిత్స కేంద్రాలు, రెస్క్యూ సిబ్బంది, అంబులెన్స్, ఫైర్ ఇంజన్‌లను అధికారులు సిద్ధం చేశారు. భక్తులు కళ్యాణం తిలకించడానికి ప్రత్యేకంగా వేర్వేరుగా జోన్‌లుగా విభజించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుండి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. వివిధ ప్రాంతాలలో ఉన్న శివపార్వతులు, హిజ్రలు, జోగినిలు రాష్ట్రం లో ఎక్కడికి వెళ్లకుండా వేములవాడకి రావడం సనాథంగా వస్తున్న అచారం. ఓ వైపు రామకళ్యాణం జరుగుతుంటే మరో వైపు శివుడిని జోగినిలు, శివ పార్వతులు శంకరుడిని పెళ్లాడుతున్నట్లు తలంబ్రాలు పోసుకోవడం, మాంగళ్య ధారణ చేసుకోవడం, జీలకర్ర బెల్లం పెట్టుకోవడం యిక్కడ విశేషం.

### కళ్యాణానికి భారీ పోలీస్ బందోబస్తు..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే శ్రీ సీతరాముల కళ్యాణంకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వేముల వాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో సీఐ వీర ప్రసాద్ పర్యవేక్షణలో దాదాపు 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నా మన్నారు. కళ్యాణానికి దాదాపు లక్షకుపై వరకు భక్తులు వస్తార ని అంచనాతో బందోబస్తు చేస్తామన్నారు. ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాల నిఘా, ప్రత్యేకంగా సివిల్ పోలీసులతో గస్తీ నిర్వహించి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా చూస్తారని ఆయన తెలిపారు.



### రామయ్య కళ్యాణనానికి అన్ని ఏర్పాట్లు చేశాం..

ప్రతి యేటా రాజన్న సన్నిధిలో శ్రీ సీతరాముల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తున్నామని శ్రీసీతరాముల కళ్యాణం వైభోవేతంగా నిర్వహి ంచేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అలయ ఈవో తెలిపా రు. దాదాపు లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం వునందున్న వేసవి కాలం కావడంతో చలువ పందిళ్లు, తాగునీటి వసతి, మజ్జిగ ప్యాకెట్స్ అందించేందకు సిద్ధం చేశామన్నారు. శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి దాతల సహకారంతో సుమారు 30 వేల మంది భక్తులకు ఉచిత అన్నదానం,మంచినీటి ప్యాకెట్లు చల్లా ప్యాకెట్లను కూడ ఏర్పాటు చేశామన్నారు.



వినోద్ రెడ్డి
ఆలయ ఈవో

### కళ్యాణ వేడుకలకు ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ డిఎం శ్రీనివాస్

శ్రీరామనవమి సందర్బంగా వేములవాడకు రానున్న భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డిఎం శ్రీనివాస్ తెలిపారు. వరంగల్, నర్సంపేట, హన్మకొం డ, తొర్రురు, కరీంనగర్, కోరుట్ల, జగిత్యాల డిపోల నుండి 100 ప్రత్యేక బస్సులు నడుస్తాయని, వేములవాడ డిపోనుండి 15 బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణి కుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు కూడా సిద్ధంగా ఉంటాయన్నారు.



## సిఐఎల్ ఛైర్మన్‌ను కలిసిన పెన్షనర్స్

(ప్రత్యేక ప్రతినిధి/ జనంసాక్షి) : కోల్‌కత్తా లోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో, కోల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి బృందం పెన్షన్ పెంపు గురించి ఛైర్మన్‌తో చర్చించి ంది. మెడికేర్ పథకం జీవితకాలం పరిమితి పెంపుతో సహా ఇతర తీవ్రమైన సమస్యలను కూడా ఛైర్మన్ ముందు ఉంచారు. పైన పేర్కొన్న అంశాలకు సంబంధించి లిఖితపూర్వక మెమోరాండం కూడా సమర్పించబడిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రబీర్ కె. ముఖర్జీ తెలిపారు. అన్ని డిమాండ్లను సానుభూతితో పరిశీలిస్తానని ఛైర్మన్ హామీ ఇచ్చారనిముఖర్జీ అన్నారు.




## శ్రీమంతులు తినే అన్నం పేద ప్రజలు తినాలనేదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

### వికారాబాద్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేష్ రెడ్డి

బొంరాస్ పేట,ఏప్రిల్ 5 (జనం సాక్షి): సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల ఆశాజ్యోతి అని రాష్ట్రంలో శ్రీమంతులు తినే ఆహారాన్ని ప్రతి పేదవాడు తినాలని లక్ష్యంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం జరిగిందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. నాందార్ పూర్ గ్రామంలో శనివారం వికారాబాద్ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజేష్ రెడ్డి,పిఎసిఎస్ ఛైర్మన్ జయకృష్ణ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్ హాజరై సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, మల్లేష్, సంతోష్ నాయక్,మహేందర్ సింగ్ పాల్గొన్నారు.



## ఐటీసీ ఆశీర్వాద్ మసాలాలు బ్రాండ్ ప్రచారకర్తగా నాని

ఖైరతాబాద్, ఏప్రిల్ 05 (జనం సాక్షి) : ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన ఐటిసి లిమిటెడ్ యొక్క ఆ శీర్వాద్ మసాలాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధి ంచి తమ బ్రాండ్ అంబాసిడర్‌గా టా లీవుడ్ నేచురల్ స్టార్ నానిని ఎంచుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఈ బ్రాండ్ తన ప్రాంతీయ ప్రచారంలో భాగంగా 'దమ్ముమీదే, స్టార్ మీరే' అంటూ కొత్త టెలివిజన్ వాణిజ్య ప్రకటన (టీవీసీ)ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పియూష్ మిశ్రా మాట్లాడుతూ.. జీవితాతీత ఆకర్షణకు చిరునామాగా నిలిచే నాని, ఆశీర్వాద్ మసాలాల యొక్క ప్రధాన విలువలైన ఆకర్షణీయమైన, శక్తివంతమైన, అద్భుతమైన రుచి, పూర్తి స్థాయి దమ్మును సంపూర్ణంగా ప్రతిబింబిస్తారన్నారు. తన నటనతో ప్రేక్షకులను నాని ఆకర్షించినట్లే, ఆశీర్వాద్ మసాలాలు ప్రతి వంటకా న్ని శక్తివంతమైన రంగు సాటిలేని రుచితో ఉన్నతీ కరిస్తాయన్నారు. ఈ భాగస్వామ్యంతో బ్రాండ్ ఈ ప్రాంతంలోని వినియోగదారులతో తమ అనుబం ధాన్ని మరింతగా పెంచుకోవడం లక్ష్యంగా పెట్టు కుందన్నారు. అదే సమయంలో మసాలాల విభా గంలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకో నున్నట్లు వెల్లడించారు.తరతరాలుగా తెలుగు వంటకాలు ఆకర్షణీయమైన రుచులు, సుగంధ ద్రవ్యాలు సిగ్నేచర్ 'తెలుగు కారం'తో వృద్ధి చెందా యని, తమ విస్తృత శ్రేణి అధిక-నాణ్యత, ప్రామాణికమైన మసాలాల ద్వారా ఈ పాకశాస్త్ర వారసత్వాన్ని ఆశీర్వాద్ మసాలా గౌరవిస్తుందన్నారు.

# పీహెచ్‌సీల్లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

- రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్గొండ బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు,ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల మాదిరిగానే ఉచిత వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తున్నదని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రు. 23.75 కోట్ల రూపాయలతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ ను ప్రారంభించారు. రానున్న సంవత్సర కాలంలో అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. గాంధీ,ఉస్మానియా ఆసుపత్రులలో లివర్,కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన16 నెలల్లోనే 22 కోట్ల ఎల్ఓసిలు ఇవ్వడం జరిగిందని,ఉదయం ఎల్ఓసికి దరఖాస్తు చేసుకుంటే సాయంత్రంలోగా,ఎల్ఓసి,ఇస్తున్నామన్నారు. హైదరాబాద్,వరంగల్ తర్వాత అతిపెద్ద పట్టణాలలో నల్గొండ ఒకటని,నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పించడం జరిగిందని,గాంధీ, నీలోఫర్ తర్వాత ఎక్కువ ప్రసవాలు ఇక్కడ జరుగుతున్నాయని అన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి,నార్కెట్పల్లి-అద్దంకి జాతీయ రహదారి ఉండడం క్రిటికల్ కేర్ యూనిట్ అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కేవలం సంవత్సర కాలంలో క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఉన్నందున వసతులు కల్పించేందుకు అవకాశం ఉందని, మరో మూడు కోర్సులు మెడికల్ కళాశాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల క్రిటికల్ కేర్ యూనిట్లో అవసరమైన లిఫ్టు, వెంటిలేటర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లి కార్పొరేట్ వైద్యం పొందలేరు కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచిందని,అంబులెన్స్ సౌకర్యంతో పాటు,అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆయన వెల్లడించారు. దేవరకొండ లాంటి మారుమూల గిరిజన ప్రాంతాలలో సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలో అందించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,ఆస్పత్రి వైద్యులు,ఇతర అధికారులు,టి ఎస్ ఎం ఐ డి సి ఈ ఈ జైపాల్ రెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా 50 పడకలతో అదునాతన సౌకర్యాలతో నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ యూనిట్లో దయాలసిస్ యంత్రాలు,క్రిటికల్ కేర్ యంత్రాలు, అడ్వాన్స్, మానిటరింగ్ యంత్రాలు,పేషెంట్ మానిటర్లు,24/7 కేర్ యంత్రాలు ఉన్నాయి.

# సుంకాలపై భారత్‌తో సంప్రదింపులు

- ఈ విషయమై స్వయంగా చర్చలు జరుపుతున్న ట్రంప్
- ఈమేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడి
- టారీఫ్ వార్ నేపథ్యంలో కీలక పరిణామం



ఈనేపథ్యంలోనే కీలక పరిణామం చోటుచేసు కుంది. సుంకాలపై భారత్ వియత్నాం, ఇజ్రాయె ల్‌తో అమెరికా సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. స్వయంగా ట్రంప్ ఆయా దేశాల ప్రతినిధులతో ఈ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇవి ఫలిస్తే ఆయా దేశాలతో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. దీంతో భారత్‌తో సహా వియత్నాం, ఇజ్రాయెల్‌పై సుంకాలు తగ్గే అవకాశం ఉంది. టారిఫ్‌లు ప్రకటించిన మరుసటిరోజు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. సుంకాలపై చర్చలకు తాను సిద్ధమేనంటూ సంకేతాలిచ్చారు. అమెరికా నుంచి ఇతర దేశాలు వసూలు చేస్తున్న దాని ఆధారంగానే తామ వారిపై టారిఫ్‌లు విధించామన్న ట్రంప్.. ఇదంతా పరస్పర చర్యగా పేర్కొన్నారు. ఈ సుంకాలు అమల్లోకి రాగానే.. చాలా దేశాలు తమ గురించి ఆలోచించడం మొదలుపెట్టాయన్నారు. దీంతో ఆయా దేశాలు అమెరికా కోసం ఏద్కెనా చేస్తామని అంటున్నాయని వెల్లడిరచారు. ఏ దేశమైనా అలా ముందుకొచ్చి ఆఫర్ ఇస్తే.. వారితో సుంకాలపై చర్చించేందుకు సిద్ధమేనన్నారు. ఇక, ఇదే విషయంపై ఆయన కుమారుడు ఎరిక్ ట్రంప్ కూడా ఆసక్తికర పోస్టు చేశారు. సుంకాలపై ముందుగా చర్చలకు వచ్చే దేశాలకు మంచి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. చివరిగా వచ్చేవారికి నిరాశే ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అయితే, ఈ ప్రకటనలకు ట్రంప్ పాలకవర్గం చేస్తున్న వ్యాఖ్యలు భిన్నంగా ఉన్నాయి. సుంకాలపై ట్రంప్ ఏ దేశాలతోనూ డీల్ కుదుర్చుకునే అవకాశం లేదని అమెరికా వాణిజ్య మంత్రి హెూవర్డ్ లుట్నిక్, ట్రంప్ సన్నిహితుడు పీటర్ నవరో అన్నారు. ఈనెల 2న ట్రంప్ పలు దేశాలపై పరస్పర సుంకాలు ప్రకటించారు. అమెరికాకు దిగుమతి అయ్యే ప్రతి వస్తువు పైనా కనిష్ఠంగా 10% నుంచి గరిష్ఠంగా 49శాతం వరకు సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. తమతో వాణిజ్య లావాదేవీలు ఉన్న దేశాలన్నింటిపైనా ఆయన టారిఫ్‌లు వేశారు. భారత్- 27శాతం, వియత్నాం- 46 శాతం, ఇజ్రాయెల్- 17 శాతం సుంకాలు విధించారు.

# కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయండి

- టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడుకు బండిసంజయ్ లేఖ



**కరీంనగర్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణం కోసం ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని, యుద్ధప్రాతిపదికను పనులు చేయించాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్రమంత్రి బండిసంజయ్ లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ధర్మ ప్రచారంతో పాటు హిందూ దేవాలయాల నిర్మాణ అభివృద్ధి టీటీడీ చేస్తున్న కృషి భేష్ అని మెచ్చుకున్నారు. ధూప-దీప నైవేద్యాలకు నోచుకోని అనేక దేవాలయాలను ఆదుకోవడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ప్రధాని మోదీ మద్దతుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాబోయే రోజుల్లో ఏపీ అభివృద్ధిని చూడబోతున్నామన్నారు. టీటీడీ చైర్మన్ నాయకత్వంలో భక్తులంతా భక్తిభావంతో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులను పొందుతున్నారని తెలిపారు. తిరుమలలో చేపట్టిన చర్యలు భక్తుల నుంచి విశేషమైన ప్రశంసలు పొందుతున్నాయని చెప్పారు. కరీంనగర్‌లో చేపట్టిన టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకరిం చాలన్నారు. 2023లోనే కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి లభించిందని తెలిపారు. ఇందులో కరీంనగర్ పద్మానగర్‌లో 10 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. అదే ఏడాది మే 31న కరీంనగర్‌లోని 10 ఎకరాల స్థలంలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమి పూజ కూడా జరిగిందని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. టీటీడీ ఆలయ నిర్మాణం కోసం కరీంనగర్ సహా పొరుగు జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

# మల్కాజిగిరి సమస్యలు పరిష్కరించండి

- మంత్రి శ్రీధర్‌బాబును కోరిన ఈటల రాజేందర్

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో సమస్యలను పరిష్కరించాలని మంత్రి శ్రీధర్‌బాబును.. భాజపా ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును ఈటల రాజేందర్ కలిశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, రోడ్లు సరిగా లేవని, చెరువులు మురికి కూపాలుగా మారాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైడ్రా పేరిట డబ్బులు వసూలు చేస్తున్న బ్లాక్‌మెయిలర్లపై దృష్టి సారించాలని కోరారు. చిన్న దేవాలయాలను కూడా దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నగరానికి నాలుగు వైపులా డంప్ యార్డులు ఉండాలని.. చెత్తంతా బాలాజీనగర్‌కు పంపిస్తే అక్కడి ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని శ్రీధర్‌బాబును కోరారు. సమస్యల పరిష్కారంపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారని ఈటల రాజేందర్ తెలిపారు.



# దుర్మార్గపు పాలనపై పోరాటం చేస్తా

- రైతులను అరి గోస పెడుతున్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎండిన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**భువనగిరి కలెక్టరేట్ , ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** రైతులను అరిగోస పెడుతున్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. శనివారం జిల్లాలో ని వలిగొండ మండలం టేకుల సోమవారం గ్రామంలో ఎండిన వరి పంట పొలాలను పరిశీలించారు. సందర్భంగా మాట్లాడుతూ ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ముమ్మాటికి కాంగ్రెస్ తెచ్చిన దే అంటూ ధ్వజమెత్తారు. సాగునీరు అందక చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోయాయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులను చూస్తే గుండె బరువెక్కింది అని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి నిర్వహణ పై అవగాహన లేక దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వం పంట పొలాలను ఎండ బెట్టింది రైతులను కష్టాలపాలు చేసిందని విమర్శించారు. రైతులను అరి గోస పెడుతోన్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టేది లేదు అని అన్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏదుళ్ళ గూడెం గ్రామానికి మూసి భీమలింగం వద్ద లిఫ్టు ను పరిశీలించారు. టేకుల సోమవారం గ్రామంలో ఎండిపోయిన వరి పంట పొలాలను పరిశీలించి మాట్లాడుతూ తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మోహన్ రెడ్డి సంస్మరణ సభలో ఎమ్మెల్సీ కవిత నివాళు లర్పించారు. అంతకుముందు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వలిగొండ మండలం టేకుల సోమవారం గ్రామంలో ఎం ఎం ఎస్ ఫంక్షన్ హాల్ లో కీర్తిశేషులు గూడూరు మోహన్ రెడ్డి సంస్కరణ సభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఫైళ్ళ శేఖర్ రెడ్డి ,జిల్లా పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి ,రాష్ట్ర నాయకులు రైతులు మండల నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ‘భూ భారతి’తో రైతులకు మేలు.. ఉద్యోగులకు భరోసా

- గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం
- రైతులకు మెరుగైన సేవలు, ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు
- ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



**సిద్దిపేట, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా అమలులోకి రాబోతున్న భూ భారతి చట్టంతో రైతులకు మేలు, రెవెన్యూ ఉద్యోగులకు భరోసా ఉంటుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఈ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని దీమా వ్యక్తం చేశారు. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణం అవుతుందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో తహసీల్దార్ సరిత అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందడంతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ భద్రతకు సమీప భవిష్యత్తులోనే ఓ భరోసా దొరుకుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణమైతుందన్నారు. ఆప్షన్ల ద్వారా నియామకం అవుతున్న జీపీవోలందరికీ కామన్ సర్వీస్ ఉంటుందన్నారు. అలాగే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి వచ్చిట్లుగానే ప్రతి జీపీవోకు పదోన్నతులు వస్తాయన్నారు. ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున గ్రామ పరిపాలన అధికారులను నియామకం చేయడం వలన రైతులకు రెవెన్యూ సేవలు చెరువ కావడంతో పాటు రెవెన్యూ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు లభిస్తున్నాయన్నారు. అయితే భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రెవెన్యూ ఉద్యోగులు పునరంకితం కావాలన్నారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 10,954 మంది గ్రామ పాలన అధికారులను వ్యక్తిగత ఆప్షన్ల ద్వారా నియామకం చేస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల ఆకాంక్షకు ప్రభుత్వ సహకారం తోడవడంతో రెవెన్యూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను క్రమంగా సాదించుకుంటున్నామన్నారు. త్వరలోనే అమల్లోకి రాబోతున్న భూ భారతి చట్టంలో తహశీల్దార్లకు ఆర్డీఓలకు, అడిషనల్ కలెక్టర్లకు అధికారాల వికేంద్రీకరణ జరిగిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రాష్ట్ర రాజధానిలోని సీసీఎల్ఏ నుండి గ్రామ పరిపాలన అధికారి వరకు అధికారాల వికేంద్రీకరణ జరగడంతో భూ సమస్యలు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కొండంత అండగా నిలిచిన ప్రభుత్వానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్న అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అన్ని శాఖల ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సంక్షేమానికి పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు.

**అనతి కాలంలో అత్యధిక విజయాలు : డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనతి కాలంలోనే అత్యధిక విజయాలు సాదించామని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామకృష్ణ అన్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల సంఖ్యను పెంచడం, గ్రామానికో అధికారి చొప్పున 10,954 జీపీవో పోస్టుల ఏర్పాటు మనకు అతిపెద్ద విజయాలని ఆయన అభివర్ణించారు. వేరువేరు జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సుమారు 10 ఏళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించడం జరిగిందన్నారు.

**నాడు చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థ నేడు పునర్నిర్మాణం : టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి**

గతంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థ ప్రస్తుతం మళ్ళీ పునర్నిర్మాణం అవుతుందన్నారు. అలాగే జీఓ నం.317 రాష్ట్రంలో ఉద్యోగులుగా ఉన్న భార్యాభర్తలకు సైతం చెట్టుకొక్కరికి పుట్టకొక్కరికి పోస్టింగ్ లు ఇచ్చారన్నారు. వీఆర్వో, వీఆర్ఏల ఉద్యోగ జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. కానీ ప్రస్తుతం మన గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ మళ్లీ పురుడు పోసుకుంటుంది అన్నారు. జేఏసీ ఉద్యమ ఫలితంగా ఉద్యోగుల ఆంక్షలను, 317 జీవోలోని నిబంధనలను ప్రభుత్వం సడలించిందన్నారు. ముఖ్యంగా స్పోజ్, మెడికల్, తదితర కోణాలలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించిందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, కోశాధికారి వెంకట్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు చల్ల శ్రీనివాస్, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీజీఏ సెక్రటరీ జనరల్ సెక్రటరీ పూల్ సింగ్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్శనం గౌడ్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రాధ, సీసీఎల్ఏ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ చైతన్య, రాంబాబు, కోశాధికారి మల్లేశం, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షులు సుజాత చౌహాన్, టీజీటీఏ ఉపాధ్యక్షులు పాల్ సింగ్, పూర్వపు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరిక ఉపేందర్ రావు, డిప్యూటీ కలెక్టర్లు గీత, సుధా, నిర్మల, తహసీల్దార్లు సరిత, హసీనాభేగం, విష్ణుసాగర్, ఉమ్మడి జిల్లా పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్ అశోక్, భవాని, మహేష్, మర్రి ప్రదీప్ తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు అనిల్ కుమార్, స్వామి, వినయ్ తో పాటు అధిక సంఖ్యలో ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

# ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మిస్సింగ్

**హైదరాబాద్, ఏప్రిల్5 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. న్యూ బోయిన్‌పల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసం ఉండే మహేశ్, ఉమా దంపతులుగా తెలుస్తోంది. వారి ముగ్గురు పిల్లలతోపాటు సంధ్యా అనే మరో కుటుంబ సభ్యురాలు కూడా కనిపించకుండా పోయారు. స్థానిక నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్‌గా మహేష్ పనిచేస్తున్నాడు. గురువారం మహేష్ ఇంటికి సంధ్యా వెళ్లింది. సంధ్యాతో పాటు అదే రోజు బయటకు వెళ్లి మహేష్, భార్య పిల్లలు తిరిగిరాలేదు. ఇంటి యజమాని సమాచారంతో పోలీసులకు మహేష్ బావ భిక్షపతి ఫిర్యాదు చేశాడు. భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆరుగురు ఆటో బుక్ చేసుకుని బోయిన్‌పల్లి నుంచి ఎంజీబీఎస్ స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి ఎటు వెళ్లారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆరుగురి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను పోలీసులు విచారణ చేస్తున్నారు. వీరి మిస్సింగ్ సికింద్రాబాద్‌లో మిస్టరీగా మారింది.

# వక్ఫ్ బిల్లు వ్యతిరేకంగా ఆప్ ఎమ్మెల్యే పిటిషన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు అవుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ఎంపీ మొహమ్మద్ జావెద్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా, ఆప్ ఎమ్మెల్యే అమనతుల్లా ఖాన్ కూడా వక్ఫ్ బిల్లును ఛాలెంజ్ చేస్తూ సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. అమనతుల్లా ఖాన్ తన పిటిషన్‌లో.. ఈ సవరణలు ముస్లింల మతపరమైన, సాంస్కృతిక స్వయంప్రతిపత్తిని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ జోక్యం మైనారిటీలు తమ మతపరమైన, స్వచ్ఛంద సంస్థలను నిర్వహించే హక్కులను దెబ్బతీస్తుందని పిటిషన్‌లో చెప్పారు. అయితే, ఈ చట్టం ముస్లిం మహిళలకు ప్రయోజనం చేకూరుస్తుందని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతను పెంచుతుందని బీజేపీ చెబుతోంది. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటను సవాల్ చేస్తూ, సమానత్వ హక్కు, మతపరమైన వ్యవహారాల నిర్వహణ, మైనారిటీ-ల హక్కులతో సహా ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘిస్తుందని ఆప్ ఎమ్మెల్యే తన వాదనల్ని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# బీజేపీ, కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు

- ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రోటోకాల్‌కు తిలోదకాలు : దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** ఆరు నెలలు అమెరికాలో ఆరు నెలలు భారత్‌లో ఉంటూ కాంగ్రెస్ పార్టీలో తన ఉనికిని కాపాడు కునేందుకు రాజకీయాలు చేయడం మధుయాష్కీకి పరిపాటిగా మారిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కీ తీరును సుధీర్‌రెడ్డి ఎండగట్టారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల చీకటి పొత్తుతోనే ప్రోటోకాల్ రగడ సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. మధుయాష్కీ అవగాహన లేమితో బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులను తప్పుదోవపట్టించి రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. సంవత్సర కాలంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించకుండా అటు అధికారులను, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని తప్పుదోవపట్టించే విధంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మధుయాష్కీ వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఎన్నడూ లేని విధంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ని విమర్శిస్తున్నారన్నారు. కనీస అవగాహన లేకుండా బీజేపీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడవస్థానంలో నిలిపి ప్రజలు బుద్ధి చెప్పినా మధుయాష్కీ చిల్లర రాజకీయాలు మానుకోవడం లేదని మండిపడ్డారు. మధుయాష్కీ తనపై వ్యక్తిగత దూషణలకు దిగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలలో హుందాతనం చాలా అవసరమన్నారు. రెండుసార్లు ఎంపీగా పనిచేసిన వ్యక్తి ఈ విధంగా ప్రవర్తించడం తగునా అని అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నదని కావునా తానేమి మాట్లాడనని ఆయన చెప్పారు. కోర్టుతీర్పు అనంతరం ఆ అంశంపై మాట్లాడుతానన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370